thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 266 | కరీంనగర్ బుధవారం, 3 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 71ఏళ్ల వయసులో ప్రభుత్వ కొలువు పొందినట్టు ఫీలయ్యా: కమల్ హాసన్

మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, నటుడు కమల్‌హాసన్ ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఇలా పెద్దలసభ లో ఎంపీగా ఎన్నికైనప్పుడు తన అనుభూతి ఏమిటని కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ వ్యక్తి ప్రశ్నించారు. బదులుగా.. ఏడు పదుల వయసులో ప్రభుత్వ కొలువు పొందినట్టుగా ఉందని సమాధానమిచ్చారు కమల్. ఆ సమయంలో తన తల్లిదండ్రులు గుర్తుకువచ్చారని చెప్పిన ఆయన.. వెంటనే వాళ్లకు ఫోన్ చేసి చెప్పాలనుకున్నట్టు వివరించారు. 'ఆ క్షణంలో నా తల్లిదండ్రులు డి.శ్రీనివాసన్ అయ్యంగార్, రాజ్యలక్ష్మిలను తలచుకున్నాను. నేను రాజ్యసభకు వెళ్లి సంతకం చేసినప్పుడు వారే గుర్తుకొచ్చారు. నేను స్కూల్లో ఓ డ్రాపౌట్ స్టూడెంట్‌ను. కనీసం ఎస్ఎస్ఎల్సీ పాసైనా.. నాకు రైల్వేలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చేదని మా అమ్మ ఎప్పుడూ అంటుండేవారు. అలాం టిది 71 ఏళ్ల వయసులో సాధించినట్టుంది. ఆ సమయంలో నా తల్లికి ఫోన్ చేసి.. ప్రభుత్వ కొలువులో పనిచేస్తున్నానని చెప్పాలనిపించేంత గర్వంగా అనిపించింది.' అని కమల్ హాసన్ తన రాజ్యసభ ఎంపీ అనుభవాన్ని పంచుకున్నారు.




# వాయిదాల పర్వం

## ఇరుసభల్లో ఎస్ఐఆర్‌పై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు

## ఇప్పటికిప్పుడు కుదరదన్న అధికారపక్షం

## నినాదాలతో వేడెక్కిన శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే విపక్షాల ఆందోళనతో లోక్‌సభ అట్టుడికింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. అందుకే లోక్‌సభ స్పీకర్ నిరాకరించడంతో విపక్షసభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో పలు మార్లు లోక్‌సభ వాయిదాపడింది.

**నివాళులతో మొదలై నినాదాలతో కొనసాగి..** అంతకుముందు సోమవారం ఉదయం 11 గంటలకు జాతీయగీతం జనగణమనతో లోక్‌సభలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతిచెందిన మాజీ సభ్యులకు ప్రస్తుత లోక్‌సభ సభ్యులు నివాళిగా సంతాపం తెలిపారు. అనంతరం స్పీకర్ ఓంబిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెనువెంటనే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీసహా పలు విపక్ష పార్టీల ఎంపీలు తమతమ స్థానాల్లోంచి లేచారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర(ఎస్ఐఆర్) సర్వే అంశంపై లోక్‌సభలో చర్చించాలని పట్టుబట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా వెంటనే కల్పించుకున్నారు. 'తొలిరోజే సభాకార్యకలాపాలకు అడ్డుతగలడం ఏమాత్రం మంచి పద్ధతి కాదు. సభలో విధానాత్మక, నిర్మాణాత్మక చర్చలు జరగాలి. సభలో సమ్మతి, అసమ్మతి రెండు ఉన్నా, చర్చల ద్వారానే అన్నింటికీ సమాధానం దొరుకుతుంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌ను నినాదాలతో అడ్డుకోకూడదు. ప్రశ్నోత్తరాలు కొనసాగనివ్వండి" అని స్పీకర్ అన్నారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా, ఎస్ఐఆర్‌పై చర్చను కోరుతూ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక సైతం విపక్ష సభ్యుల వైఖరితో మార్పు రాలేదు. విపక్షాల ఆందోళన ఎక్కువవడంతో కేవలం 12 నిమిషాల తర్వాత సభ మళ్లీ వాయిదాపడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ మళ్లీ మొదలైంది.

**బిల్లులను ప్రవేశపెట్టిన సీతారామన్...** పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సయిజ్ డ్యూటీ, పాన్ మసాలాపై కొత్త సెస్ వేసేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు, సెంట్రల్ ఎక్సయిజ్(సవరణ) బిల్లు-2025, హెల్త్‌సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025లను ఈలోపే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలన కొనసాగుతుండటంతో మణిపూర్ జీఎస్టీ(సవరణ) బిల్లును సైతం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. 2025-26 ఆర్థికసంవత్సర గ్రాంట్లకు సంబంధించిన అనుబంధ పద్దును సైతం సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత సభ మరోసారి వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా విపక్ష సభ్యుల నినాదాలు ఆగలేదు. దీంతో చేసేదిలేక స్పీకర్ మధ్యాహ్నం 2.20 గంటలకు సభను మంగళవారానికి వాయిదావేశారు.

**రాజ్యసభలోనూ..** ఎగువసభలోనూ దాదాపు ఇవే దృశ్యాలు కనిపించాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. "ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రభుత్వం వెనుకడుగు వేయట్లేదు. అయితే నిర్ణీత కాలావధిలోపు ఫలానా సమయంలోనే చర్చించాలనే మొండిపట్టును విపక్షాలు విడనాడాలి. ఎస్ఐఆర్‌పై చర్చ అంశంలో కేంద్రానికి మరింత సమయం కావాలి" అని ఆయన అన్నారు. మంత్రి సమాధానంతో సంతృప్తిచెందని విపక్ష సభ్యులు వెనువెంటనే రాజ్యసభ నుంచి వాకౌట్‌చేశారు. అంతకుముందు ఎస్ఐఆర్‌సహా పలు అంశాలపై తక్షణం చర్చ జరపాలంటూ తొమ్మిది మంది విపక్ష సభ్యులు వేర్వేరుగా రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు నోటీస్‌లను అందజేశారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణంచేశాక రాజ్యసభ డిప్యూటీచైర్మన్ హోదాలో రాధాకృష్ణన్ సేవలందించడం ఇదేతొలిసారికావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనను ప్రధాని మోదీ పొగిడారు. "సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం మన ప్రజాస్వామ్యంలోని శక్తికి నిదర్శనం. పలు రాష్ట్రాల్లో కీలక పదవుల్లో సేవచేసి గడించిన అనుభవం రాజ్యసభ సజావుగా సాగేందుకు తోహదపడనుంది" అని ఆయన అన్నారు. తర్వాత ఖర్గే మాట్లాడారు.

" గత ఉపరాష్ట్రపతి హఠాత్తుగా రాజీనామాచేయడం అధికార పక్షాన్ని సైతం విస్మయపరిచింది. రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య సమతూకం పాటిస్తూ విపక్ష సభ్యులకు సైతం సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేస్తున్నా" అని ఖర్గే అన్నారు.



## కేంద్రం ఇప్పటి వరకు ఏ సిటీకి నిధులు ఆపలేదు

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీకి నిధులు ఇవ్వకపోతే భాజపాని భూస్థాపితం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం పట్ల ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజమే రేవంత్‌రెడ్డి సర్కార్‌ని భూస్థాపితం చేస్తుందన్నారు. ఇప్పటి వరకు కేంద్రం ఏ సిటీకి నిధులు ఆపలేదన్నారు. ఫ్యూచర్ సిటీ ఎవరిని అడిగి కడుతున్నారని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసుపై రామచందర్‌రావు స్పందిస్తూ.. నేషనల్ హెరాల్డ్ భూముల లెక్కలు ఎవరికీ తెలియదని, సుప్రీంకోర్టు తీర్పు ద్వారానే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని చెప్పారు.

"డిజిటల్ ఇండియాలో అనేక మార్పులు జరుగుతాయి. సంచార్ సాథీ కూడా డిజిటల్ ఇండియాలో భాగమే. ఏ యాప్ తెచ్చినా ప్రజల సంక్షేమం కోసమే. కాంగ్రెస్ భాజపాపై తప్పుడు ప్రచారం చేస్తోంది"అని ఎన్.రామచందర్‌రావు అన్నారు.

## ఈసారి గెలిచి తీరాల్సిందే..! ఖైరతాబాద్ ఉపఎన్నిక కోసం బీఆర్ఎస్ కసరత్తు.. బలమైన అభ్యర్థి కోసం వేట..

హైదరాబాద్ : ఈసారి మునుపటి లెక్క కాదు. కంటోన్మెంట్ చేజారింది..జూబ్లీహిల్స్ మిస్ అయ్యింది. ఆ రెండు సిట్టింగ్ సీట్లలో సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. ఖైరతాబాద్ బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాల్సిందేనని పట్టుదలతో ఉంది బీఆర్ఎస్. ఇక చేజారిన జూబ్లీహిల్స్ పక్కనే ఉన్న ఖైరతాబాద్‌కు కూడా ఉప ఎన్నిక ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది.

పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో ఖైరతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పదన్న చర్చ జరుగుతోంది. దానంపై వేటు పడటమో లేక అంతకంటే ముందే ఆయన రిజైన్ చేయడమో? ఏదో ఒకటి పక్కా అని టాక్ వినిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో తీవ్ర నిరాశలో ఉన్న బీఆర్ఎస్..కచ్చితంగా ఖైరతాబాద్‌లో గెలిచి తీరాలన్న కసితో ఉంది. అందుకోసం ఇప్పటి నుంచే కసరత్తు స్పీడప్ చేసింది. బలమైన అభ్యర్థి కోసం గులాబీ పార్టీ వేట మొదలుపెట్టింది. అధికార కాంగ్రెస్ నుంచి మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తే ఒకలా..లేదంటే మరోలా రెండు ప్లాన్స్ రెడీ చేస్తోంది గులాబీదళం. దివంగత నేత పీజేఆర్‌కు ఖైరతాబాద్ లో అభిమానులు ఉండటంతో..ఆయన తనయుడు, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ ను రంగంలోకి దించాలని అనుకుంటోందట బీఆర్ఎస్.

**పీజేఆర్ తనయుడిగా ఫాలోయింగ్..** ఒకసారి ఖైరతాబాద్ నుంచి, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జూబ్లీహిల్స్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణు..2023లో టికెట్ దక్కకపోవడంతో కారెక్కారు. మొన్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విష్ణు టికెట్ ఆశించినా..మాగంటి గోపీనాథ్ భార్య సునీతనే పోటీలో పెట్టారు గులాబీ బాస్ కేసీఆర్. కాబట్టి ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే విష్ణును పోటీ చేయిస్తే..పీజేఆర్ తనయుడిగా ఇప్పటికే ఆయనకున్న ఫాలోయింగ్‌తో ఖైరతాబాద్ లో దానం నాగేందర్‌కు గట్టి పోటీ ఇస్తాడని నమ్ముతోంది గులాబీ పార్టీ.

**టికెట్ రేసులో మన్నె, దాసోజు..?...** ఇదే సమయంలో బీఆర్ఎస్ లో ఖైరతాబాద్ టికెట్ ను పలువురు ఆశిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన మన్నె గోవర్ధన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకపోతే తన భార్య మన్నె కవితకు ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. ప్రస్తుతం ఖైరతాబాద్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ గా ఉన్నారు మన్నె కవిత. 2018, 2023 రెండుసార్లు బీఆర్ఎస్ దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే సీటు త్యాగం చేసి సహకరించానని..ఈసారి తనకు, లేకపోతే తన భార్య మన్నె కవితకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట మన్నె గోవర్ధన్‌రెడ్డి. మరోవైపు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కూడా గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేశారు. బీసీ ఈక్వేషన్‌లో దాసోజు పేరు కూడా బీఆర్ఎస్ పరిశీలిస్తోంది. వీరితో పాటు మరికొందరు నేతలు ఖైరతాబాద్ బీఆర్ఎస్ టికెట్ రేసులో ఉన్నారని..పార్టీ ముందు తమ ప్రతిపాదన పెట్టారని అంటున్నారు. దీంతో ఖైరతాబాద్ నుంచి ఎవరిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచనలో పడింది. జూబ్లీహిల్స్ మాదిరి కాకుండా ఈసారి ఖైరతాబాద్ లో కచ్చితంగా గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న గులాబీ పార్టీ..బలమైన అభ్యర్థి కోసం వడపోస్తోందట.




# సర్పంచ్‌లు మంచోళ్లు ఉంటేనే గ్రామాలు అభివృద్ధి: సీఎం రేవంత్‌రెడ్డి



కొత్తగూడెం: ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. "తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది ఇక్కడే. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయి. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండి" అని సీఎం విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క...** దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టిన యూనివర్సిటీని ఆయన స్థాయిలోనే ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈరోజు భూమి పూజ చేసుకున్న దేశంలోనే అత్యున్నత యూనివర్సిటీని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బిల్డింగులు, సకల సౌకర్యాలు పూర్తి చేస్తాం అందుబాటులోకి తీసుకువస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈరోజు కొత్తగూడెంలో భూమి పూజ చేసుకున్న హెల్త్ సైన్స్ యూనివర్సిటీ కార్యక్రమం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఓ పెద్ద కార్యక్రమం అని అన్నారు. పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఈ దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేదని అన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ద్వారా భూమి, భూమి లోపల ఉన్న పొరలు, భూమి లోపల ఉన్న ఖనిజాలు, భూమి చుట్టూ ఉన్న అనేక అంశాల పైన పరిశోధనలు చేయడమే కాకుండా తద్వారా ఈ దేశానికి, ప్రపంచానికి విజ్ఞానాన్ని అందించే అద్భుత కార్యక్రమానికి, అత్యున్నత యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈరోజు భూమి పూజ చేసి పనులు మొదలు పెట్టామని తెలిపారు. యూనివర్సిటీ దేశానికి తలమానికం, అత్యున్నత యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ఈ దేశానికి తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

**విద్యార్థులు, మహిళా సంఘాలతోనే సభ..** విద్యార్థులు, మహిళా సంఘాలతోనే సీఎం సభను నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణాభివృద్ధి శాఖలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపాలిటీల్లోని పట్టణాభివృద్ధి సంస్థ మహిళా సభ్యులు, పాల్వంచలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కేజీబీవీ, గురుకులం, ఖమ్మంలోని రెండు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, నవభారత్ కేఎస్ఎం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో సభ నడిచింది. అయితే ఉదయం పది గంటలకే వివిధ మండలాల నుంచి డ్వాక్రా గ్రూపు సభ్యులను బస్సుల్లో తరలించారు. సీఎం. రాక ఆలస్యం కావడంతో కొంతమంది మహిళలు అసహనం వ్యక్తం చేస్తూ మధ్యాహ్నానికే వెనుదిరిగారు. కానీ విద్యార్థులు మాత్రం సభ ముగిసేంత వరకు అక్కడే ఉన్నారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటపాటలు అందరిలో ఉత్సాహం నింపారు. రేవంత్ రెడ్డి సభాప్రాంగణానికి చేరిన సమయంలో కేరింతలు, చప్పట్లతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్ , సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్ట రాగమయి, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పుసుపులేటి వీరబాబు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, నాగేశ్వరరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సోనియా, రాహుల్‌పై కేసులు పెడితే భయపడేది లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 02: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు.

**ఉస్మానియాను ప్రపంచస్థాయిలో నిలబెడతాం: సీఎం రేవంత్...** డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు.

**ఓఆర్ఆర్ బయటకు పరిశ్రమలు..** కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమలను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్‌పై ఫైర్..** అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

**డీసీసీలకు వార్నింగ్..** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




కృష్ణవేణి చౌక్: గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఇవాళ ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం విద్యార్థులకు వాంతులు కావడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని, ఆ విషయాన్ని వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారని విద్యార్థులు తెలిపారు. ఆ తర్వాత అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లారు. కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులైనట్లు విద్యార్థులు చెబుతున్నారు.




హైదరాబాద్: హిల్ట్ భూముల వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి పోరుబాటకు సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీతో కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించనుంది. పారిశ్రామిక వాడల్లో పర్యటించేందుకు 8 నిజనిర్ధారణ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు నేతలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. విలువైన భూములను తక్కువ ధరకు కట్టబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. మార్కెట్ విలువ కంటే అతి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. హిల్ట్ పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. బుధ, గురువారాల్లో పారిశ్రామికవాడల్లో పార్టీ బృందాలు పర్యటిస్తాయన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే.

# మహేశ్వరంలో రూ.8వేల కోట్లతో డ్రోన్లకు ప్రత్యేక డిఫెన్స్ ఫెసిలిటీ: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో డ్రోన్లకు ప్రత్యేక డిఫెన్స్ ఫెసిలిటినీ జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో జెఎస్‌డబ్ల్యూ డ్రోన్ కంపెనీ ఏర్పాటుకు పార్థ జిందాల్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..రూ.8వేల కోట్ల అంచనా వ్యయంతో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఫెసిలిటీతో మహేశ్వరంలో భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. అనేక రాష్ట్రాలు ఆహ్వానించినప్పటికీ జేఎస్‌డబ్ల్యూ సంస్థ తెలంగాణను ఎంచుకోవడం రాష్ట్ర పారిశ్రామిక విధానం బలాన్ని చాటుతుందని తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయని, రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివరించారు.

# గ్లోబల్ సమ్మిట్‌పై సమీక్ష.. అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు కీలక ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 02: మరికొద్ది రోజుల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదికగా జరగనుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా.. తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఈ సమ్మిట్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

# 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన తెలంగాణ డీజీపీ




హైదరాబాద్: మన అప్రమత్తతే సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుతుందని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై అవగాహనకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆరు వారాలపాటు ఈ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడు తూ.. పేద, ధనిక తేడా లేకుండా అందరూ సైబర్ నేరాలకు గురవుతు న్నారని చెప్పారు. అత్యాశ వల్లే చాలా మంది నష్టపోతున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా గతేడాది సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో తగ్గాయని చెప్పారు.





# తెలంగాణ రాజ్‌భవన్.. ఇక 'లోక్ భవన్'

హైదరాబాద్: తెలంగాణ రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ రాష్ట్రప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు..రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో తెలంగాణ కూడా చేరింది.

# అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి

టేక్మాల్: దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన శ్రీశైలం (40) మంజుల (35) భార్యాభర్తలు. ఇంట్లో నిద్రించిన స్థలంలోనే భార్య మృతదేహమై కనిపించగా.. భర్త ఉరేసుకున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలా మృతి చెందారు? ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.






# పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియదు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 02: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియదని తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ తెలిసి తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం కాగానే ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోనసీమలో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే.. తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే సినిమాలు ఆడవని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. పవన్ కల్యాణ్ సోదరుడు చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదని గుర్తు చేశారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హితవు పలికారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము ఎంతో నష్టపోయామని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయాన్ని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్ల నష్టపోయామని ఆరోపించారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..**కోనసీమ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నాయకుల దిష్టి వల్ల ఈ ప్రాంతంలోని కొబ్బరి మొక్కలు ఎండిపోయాయంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ తెలంగాణ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# చరిత్ర పొరల్లో దాగిన త్యాగధనుడు ఖుదీరాం

## స్వాతంత్ర్య సమరంలో తొలి బాంబు పేల్చిన ధీరుడు ఖుదీరాం - డిసెంబర్ 3...ఖుదీరాం బోస్ జయంతి

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక ఏటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపధ్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్య మాలు భారత స్వాతంత్ర్యో ద్యమంలో భాగాలు. స్వాతంత్ర్య సమర యోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వా లన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహ నీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్క పొడుచు కునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతా వని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉ ద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉ న్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛి కంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిడ్నాపూర్ జిల్లా హబిబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అఖ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్ష ణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంవ్రుదనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకు న్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాల యాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చి వేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు. ఆ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు



కున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉ న్నంత వరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించు కున్నారు. 1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తాలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్ట్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవింద ఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్ల చాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒక బాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు. అయితే ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు గమనించని విషయం... ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేక పోవడం.. అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉండడం. వారు బలి కావడం. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోస్‌ను పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు. 1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచ బడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వా నించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు. మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతు న్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవ ద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉ రితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం. 75ఏళ్ళ స్వతంత్ర భారతం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ డానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# డిసెంబరు 3.. శ్రీకపిలేశ్వరాలయంలో కృత్తికా దీపోత్సవం




తిరుమల పర్వత సానువుల మధ్య సకల తీర్థాలనూ తన ఒడిలో కలుపుకొని ప్రవహించే కపిలా తీర్థం, అక్కడ వెలసిన శ్రీ కపిలేశ్వరాలయం అనాదికాలం నుండి శైవ పరంపర మహిమాన్వితమై పూజించ బడుతున్న ఋషి తపోభూమి. కపిల మహర్షి తపస్సుకు ప్రతీకగా నిలిచిన ఈ ప్రాంతంలో దీర్ఘకాలం తపస్సు చేసి పరమశివుని సాక్షాత్కారాన్ని పొందిన చరిత్ర పురాణాలలో ఎన్నో శ్లోకాల ద్వారా వెలుగు చూసింది. సత్య యుగపు చివరి భాగంలో ధర్మశాస్త్ర-యోగశాస్త్ర ప్రకాశకుడైన కపిలుడు ఒక సందర్భంలో, శివనామ స్మరణలో లీనమై ఉన్నప్పుడు పరమశివుడు అగ్నిజ్వాల స్వరూపంగా ప్రత్యక్షమై వరప్రసాదం అర్పించాడనే వృత్తాంతం ఈ క్షేత్రం పవిత్రతకు మూలాధారం. ఈ సంఘటన ఆ ప్రాంతానికి 'కపిలా తీర్థం' అనే నామకరణాన్ని తెచ్చిపెట్టిందని మహత్వ శాస్త్రాలలో పేర్కొన బడింది. ఆ మహర్షి ధ్యానం వెలసిన ప్రాంతం శివతత్త్వ జ్యోతి రూపంగా మారి ఇక్కడ స్థాపితమైన శివలింగాన్ని 'కపిలేశ్వర స్వామి'గా ఆరాధించడం ప్రారంభ మయ్యింది. అనంతకాలంగా ఆరాట భరితమైన భక్తి తరంగాలు మీదుగా నిలిచిన ఈ క్షేత్రంలో పూర్వకాలం నుండే దీపారాధనకు ప్రత్యేక స్థానం ఉంది. అగ్ని దేవుని కర్తృత్వం ద్వారా ప్రజ్ఞోదయం, శుద్ధి, జ్ఞానం పొందవచ్చనే భావన ఈ శైవ పూజలకు మూలం. కృత్తిక నక్షత్రం శివుని జన్మ నక్షత్రంగా శాస్త్రాలు గుర్తించడంతో ప్రతి కృత్తిక పర్వదినం శివ జ్యోతిని ఆరాధించే అపూర్వ సమయం. డిసెంబరు 3వ తేదీ తిరుపతిలో జరిగే కృత్తికా దీపోత్సవం అట్టి శివాకార దివ్యానుభూతిని ప్రత్యక్షంగా పొందే అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షణం. సాయంత్రపు తూర్పు చూపులతో మొదలై, గుడి గోపురంపై పతాకం కదలాడే చల్లని గాలి, పవిత్ర నదీ ప్రవాహపు ప్రతిధ్వని, గంటనాదాల అనుభూతి ං ఇవన్నీ ఆలయ ప్రాంగణాన్ని పరమ శాంతితో నింపుతాయి. ఈ సమయాన సాయంత్రం 5.30కు గర్భాలయంలో జరిగే దీపారాధనలో అర్చకులు శాస్త్రోక్తంగా గంధం, కుంకుమ, నూనెదీపాలు, అగ్నిమండలంతో శివలింగాన్ని చుట్టుముట్టి జ్యోతిస్వరూపాన్ని పునరుద్ధరిస్తారు. దీపారాధనలో అగ్ని త్రికోణ రూపంలో ప్రతిఫలించడం కేవలం శోభ కాదుబీ అది శైవాగమంలోని 'అగ్ని = జ్ఞానం' అనే ఆదిశాస్త్ర సారాన్ని వ్యక్తం చేస్తుంది. శివలింగాన్ని తాకే ఆ వెలుగు, వెంటనే భక్తుల హృదయాల్లో వెలిగే ఆంతర్య జ్ఞానం ං ఇవి రెండూ కలసిపోయి ఈ మహోత్సవానికి ఆధ్యాత్మిక పూర్ణతను అందిస్తాయి. తరువాత ఆలయ శిఖరంపై వెలిగించే దీపారాధన ప్రత్యేక రహస్యార్థంతో నిండి ఉంటుంది. శిఖరం పైన వెలిగే దీపం, ఆకాశమునకు దేవతా దివ్యార్పణగా భావించ బడుతుంది. శిఖర దీపం దర్శించడమే శత పాపాల పరిహారమని స్కంద పురాణంలోని కపిలా మహత్యం అధ్యాయం పేర్కొంది. "శివజ్యోతి శిఖరం యత్ర, తత్ర నిర్మలతా శతగుణా" అని పురాణ వాక్యం చెప్తుంది ං అంటే శివుడి జ్యోతి శిఖరంపై వెలిగినపుడు భక్తుడిలోని దోషాలు నిర్మలమవుతాయని. ఈ జ్యోతి అగ్నిదేవుని శక్తి స్వరూపమైన కృత్తిక నక్షత్రానికి సంకేతంగా ఉండి, పరమశివుని జ్యోతి స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ కార్యక్రమానంతరం రాత్రి 7.30 గంటలకు పుష్కరిణి వద్ద ఏర్పడే జ్వాలాతోరణం కృత్తికా దీపోత్సవపు అత్యంత శోభాయమాన దృశ్యం. క్రమపద్ధతిలో పుష్కరిణి పక్కన వరసవరసలుగా వెలిగించే అనేక దీపాలు ఒకే అగ్నిధారగా మారి ఆకాశాన్ని తాకినట్లు అనిపిస్తాయి. జ్వాలా తోరణంలో వెలిగే దీపాలు శివుని శక్తి, ప్రకాశం, తేజం, అనుగ్రహం అన్నింటి సమ్మిళిత రూపాన్ని ప్రతిబింబిస్తాయి. తీర్థం చెన్నుమీద మెరుస్తున్న ఆకాశ ప్రతిబింబంలో ఆ జ్యోతి వాలి పడినట్లు కనిపిస్తే, అది భక్తిలో మహాశాంతిని పుట్టిస్తుంది. యుగయుగాలుగా అగ్ని శక్తి బ్రహ్మాండానికి మూలమని వేదాలు చెప్పిన సిద్ధాంతం ఇక్కడ ప్రత్యక్షమవుతుంది ං జ్వాలా రూపంలో పరబ్రహ్మ తేజస్సు భక్తులకు దర్శనమిస్తుంది. కృత్తికా దీపోత్సవం ఆచారంగా మాత్రమే కాక, శివభక్తి గాఢతను బోధించే సాత్విక సాంప్రదాయం. ఈ మహోత్సవం మనసులోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి ఆత్మజ్యోతి వైపు నడిపే శివ దీపిక. కపిలేశ్వరాలయపు ఈ వేడుకలో భాగమయ్యే ప్రతి భక్తులు కేవలం దీపాన్ని చూడడం కాదుబీ తమ జీవితాల్లో ఒక కొత్త ప్రకాశాన్ని ఆహ్వానించడం. జ్యోతి వెలిగినంతకాలం హృదయంలో శాంతి నిలుస్తుందని, శివుని అనుగ్రహం వ్యక్తిని ధైర్యవంతునిగా, ధర్మవంతునిగా మార్చుతుందని శైవ సిద్ధాంతం చెప్తుంది. తిరుపతి కపిలేశ్వరాలయం కృత్తికా దీపోత్సవం ఆధ్యాత్మికానందానికి, భక్తి శ్రద్ధకు, పురాణ స్మృతి పునరుజ్జీవనానికి ప్రతీక. అగ్నిజ్వాలలు వెలిగే ఈ రాత్రి శివుని కృపా కటాక్షం భూమిపై ప్రత్యక్షమవుతున్నట్లుంటుంది. ఒక దీపం నుంచి ఎన్నో దీపాలు వెలిగినట్లే, శివభక్తిలో ఒక్క జ్యోతి హృదయంలో వెలిగితే, జీవితం అంతా శాంతి, జ్ఞానం, ధర్మం, దివ్యతతో నిండి పోతుందనే శాశ్వత సందేశమే ఈ పర్వదినం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం "గైడ్" చిత్రరాజం

## - డిసెంబర్ 3... దేవానంద్ వర్ధంతి సందర్భంగా



హిందీ చలన చిత్ర రంగంలో తనదయిన ముద్ర వేసుకున్న అలనాటి మహా నటుడు దేవానంద్ ( సెప్టెంబర్ 26, 1923 - డిసెంబర్ 3, 2011). సుప్రసిద్ధ హిందీ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు దేవా నంద్ పేరు తీయగానే వెంటనే స్ఫురణకు వచ్చే చిత్రరాజం "గైడ్". ప్రఖ్యాత ఆంగ్ల భారత రచయిత మాల్గుడి డేస్ ఫేం అర్. కె. నారాయణ్ అద్భుత రచన గైడ్. ఈ చిత్రం పలు విశేషాల సమాహారం. అయితే ...దేవానంద్ నటించిన "హం దొనో", చిత్రం 1962 బెర్లిన్ చలన చిత్రోత్సవానికి, భారత దేశ అధికారిక చిత్రంగా ఎంపికకాగా, బెర్లిన్లో దేవానంద్ అమెరికా దర్శకుడు టాడ్ డేనియల్ ను కలిసే అవకాశం కలగడం, టాడ్, పెర్ల్ ఎస్ బక్ ఆహ్వానం పై అమెరికా వెళ్లి వారితో ఒప్పందం కుదుర్చుకుని, గైడ్ చిత్రంలో నటించటానికి అంగీకరించడం యాదృచ్ఛికంగా జరిగాయి. గైడ్ చిత్రానికి ఆంగ్ల చిత్రానికి టాడ్ డేనియల్ దర్శకత్వం వహించాగా, చిత్రానువాదం నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పెర్ల్ ఎస్ బక్, టాడ్ డేనియల్ సంయుక్తంగా నిర్వహించారు. తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. ఆ విడుదల కాగా, చిత్రానువాదం ఆశించిన స్థాయిలో లేక, ఆంగ్ల ప్రేక్షకులను చిత్రం ఆకట్టుకో వడంలో విఫలమయింది. గైడ్ చిత్రాన్ని హిందీలో తీద్దామని అనుకుని వహీదా రెహమాన్ ను నాయికగా ఉండాలని ముందు సత్యజిత్ రే, అనంతరం దేవానంద్ కోరారట. అయితే చిత్రం చిత్రీకరణ హక్కులను దేవానంద్ రచయిత ఆర్కె నారాయణ్ నుంచి ముందు పొందారు. అలా దేవానంద్, వహీదా కాంబినేషన్లో రూపు దిద్దుకున్న చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద విజయ దుందుభి మోగించింది. ఊహించని డబ్బును సమ కూర్చింది. విజయ ఆనంద్ గైడ్ దర్శకత్వ బాధ్యత స్వీకరించాడు. ఆంగ్ల చిత్రానువాదం కాకుండా, భారతీయ ప్రేక్షకులకు నచ్చే విధంగా కొత్త చిత్రానువాదం తయారు చేశాడు. మనసును పూర్తిగా లగ్నం చేసి దర్శకత్వం వహించిన విజయ్ ఆనంద్ కృషి సఫలీకృతం కాగలిగింది. అచ్చంగా దేవానంద్, వహీదా రెహమాన్ ల నట జీవితంలో గైడ్ ఒక అణి ముత్యమే అయింది. విజయానంద్ సందర్భోచిత చిత్రానువాదం, దర్శకత్వం, కథలో వైవిధ్యం, ఎస్.డి.బర్మన్ సంగీతం, వహీద నృత్యాలు, దేవానంద్ నటనా కౌశల్యం ప్రేక్షకుల మనో ఫల కాలపై చెరగని ముద్ర వేశాయి. ప్రేక్షకుల అనూహ్య ఆదరణ ద్వారా చిత్రం అనుకోని విధంగా కలెక్షన్లు సాధించింది. సంగీత దర్శకత్వం మినహా, మిగతా అన్ని శాఖలలోను ఫిల్మ్ ఫేర్ ఉత్తమ బహుమతులను 7 శాఖలలో గెల్చుకొని, అపూర్వ కళాఖండ చిత్రరాజమై నిలచింది. విదేశీ చిత్రాల కోవలో, ఆస్కార్ చిత్రోత్సవానికి భారత దేశ అధికార చిత్రంగా ఎంపికయ్యింది. టైమ్ మ్యాగజైన్ దాని ఉత్తమ బాలీవుడ్ క్లాసిక్స్ జాబితాలో 4 స్థానంలో ఉంది. విడుదలయిన 42 ఏళ్ల తర్వాత, 2007 లో కేన్స్ చిత్రోత్సవంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సుదీర్ఘ సమయానంతరం దూరదర్శన్ లో ఈ చిత్రం ప్రదర్శిత మైనపుడు చాలా మంది ఇళ్లలో టీవీలకే అంకితం అయినారంటే ఎంత గొప్పగా తీసారో స్పష్టం అవుతుంది.

"ఆజ్ ఫిర్ జీన్ కి తమన్నా హై"
"దిన్ ఢల్ జాయే",
"గాతా రహే మేరా దిల్"
"క్యా సే క్యా హెూ గయా",
"పియా తోస్ నైనా లాగే రే"
"తేరే మేరే సాప్నే",
"వహన్ కౌన్ హై తేరా",
"హి రామ్ హమారే రామ్‌చంద్ర"
"అల్లాహ్ మేఘ్ దే పానీ దే"
అన్ని పాటలూ ఆణిముత్యాలే.

1965 ఫిబ్రవరి 6 న సినిమా విడుదల కాగా, అంతకు ముందు ఢిల్లిలో ఈ చిత్రం ప్రివ్యూ ప్రదర్శనకు , ప్రధాన మంత్రి మినహాయించి భారత ప్రభుత్వ మంత్రులంతా చిత్రాన్ని ఆసాంతం, ఆసక్తిగా చూశారు. ఈ చిత్రం విడుదల అయినాక రచయిత ఆర్కె నారాయణ్ చూసి అసంతృప్తి వ్యక్తం చేశారట. డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపక పోయినా, గైడ్ చిత్రం గురించి ముందే జరిగిన విస్తృత ప్రచారం వల్ల ప్రేక్షకుకు మళ్ళీ మళ్ళీ చూసి కలెక్షన్లు సాధించేలా చేశారు..

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# పుణ్యప్రదం.. హనుమద్వ్రతం

మార్గశీర్షే త్రయోదశ్యాం శుక్లాయాం జన కాత్మజా దృష్ట్వా దేవీ జగన్మాతా - మహవీరేణి ధీమతా". మార్గశీర్ష శు క్లపక్ష త్రయోదశినాడు హనుమద్రతం అచరించడం సాంప్రదాయంగా వస్తున్నది. అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరాణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు. ఒక కల్పం అంటే నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని వ్రతానికి ప్రత్యేకత ఉంది. మృగశిర నక్షత్రం హనుమంతుకి ప్రీతిపాత్రమై నది. భక్త సులభుడైన హనుమంతుని అనుగ్రహం పొందడానికి దివ్యమైన మార్గం మార్గశిర శుక్లపక్ష త్రయోదశి నాడు హనుమంతుని, ఆయన శక్తి స్వరూపమైన సువర్చలా దేవిని పూజించటం పరిపాటి. హనుమత్ కథలను శ్రవణం గావించి, ప్రసాదం స్వీకరించి, పదమూడు ముళ్ళ తోరాన్ని ధరించి, పదమూడు సంవత్సరాలు వరుసగా ఆచరిస్తే, సంపూర్ణ అనుగ్రహం కలుగు తుందని భక్తుల విశ్వాసం. శౌనకాది మహర్షులు, సూత మహర్షిని శ్రీహనుమ వ్రతం గురించి వివరించాలని కోరగా ఆయన ఇట్లు వివరించారు. ద్వైత వనంలో పాండవులుండగా, వ్యాస మహర్షి వారి వద్దకు వెళ్ళారు. ధర్మరాజు, ద్రౌపది, సోదర సమేతులై స్వాగతించి లోనికి ఆహ్వానించి, అర్ఘ్యపాద్యాలు ఇచ్చి, భక్తితో సేవించారు. వ్యాసుడు సంతసించి, ద్రౌపది పాతివ్రత్యాన్ని మెచ్చారు. పాండవులు భక్తి శ్రద్ధలతో చేయాల్సిన వ్రతమొకటి ఉ ందని తెలిపారు. అదే హనుమద్ వ్రతం. దుష్ట గ్రహాల్ని, సర్వ వ్యాధుల్ని పోగొట్టి, సకల సుఖాలను, శుభాలను, శ్రేయస్సును ఇస్తుందని, దానిని ఆచరించి, తిరిగి రాజ్యాన్ని పొందాలని ఉ పదేశించారు. పూర్వం ఈ వ్రతాన్ని శ్రీకృష్ణ భగవానుడు, ద్రౌపదికి బోధించి, దగ్గరుండి చేయించాడని, దాని ప్రభావ ఫలితం గానే పాండవులకు అఖిల సంపదలు చేకూరాయని వివరించారు. ఒకసారి అర్జునుడు, ద్రౌపది చేతికున్న తోరణం గురించి అడిగి, వివరణ విని, గర్వం కలగడంతో కోతిని గురించి వ్రతమేమిటని ఈసడించాడు. తన జెండాపై ఉన్న ఒక వానరునికి వ్రతం ఏమిటని ప్రశ్నించాడు. ద్రౌపది, కృష్ణుడు చేయించిన వ్రతంగా వివరించినా, అర్జునుని కోపం పోలేదు. బలవంతంగా ఆమె చేతి తోరణం లాగి వేశాడు. అప్పటి నుండే పాండవులకు కష్టాలు ప్రారంభమైనాయని అరణ్య, అజ్ఞాత వాసాలు దాని ఫలితమేనని, పదమూడు ముళ్ళు గల తోరాన్ని తీసివేయడం వల్లే 13 ఏళ్ళ బాధలు కలిగాయని వ్యాసుడు, ధర్మజునికి వివరించారు. కనుక వెంటనే హనుమద్ వ్రతం చేయాలని హితవు పలికారు. రావణ సంహారం చేసి, సీతా దర్శనం పొంది, అయోధ్యాపతి కావడానికి శ్రీరాముడు, సుగ్రీవాదులతో ఈ వ్రతం చేశారని, వ్యాసుడు, ధర్మజునికి వివరించారు. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని



ఆరుకాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి అణిమాద్యష్టసిద్ధులు లభ్యమవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాలమీద ఆధిపత్యం ఉందో... హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అను సరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదా. పాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్టుడై, హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే. భగవద్దాసులలో సాటిలేని ఆంజనేయుని పూజకు ఉద్దిష్టమైన మార్గశిర శుక్ల త్రయోదశి ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

చురకలు

## సంపాదకీయం

### తమిళనాడు కోసం

# కాషాయం పార్టీ కొత్త ఎత్తులు

దక్షిణాదిన వీక్ గా ఉన్నది బీజేపీ. అయితే తెలంగాణలో మెల్లగా ఎంతో కొంత చోటు సంపాదించుకుంది. ఏపీలో చూస్తే కూటమిలో భాగమై తన ఉనికిని చాటుకుంది. కేరళలో బోణీ కొట్టి ఒక ఎంపీని గెలిపించుకుంది.

కర్ణాటకలో బీజేపీ ఒకసారి అధికారంలోకి వచ్చింది. ఇక 2021లో జరిగిన తమిళనాడు ఎన్నికల్లో నాలుగు ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది కానీ 2026 లో మాత్రం బీజేపీ ఏ విధంగా తన రాజకీయ విస్తరణ చేయాలి అన్న దాని మీద తీవ్రమైన కసరత్తు చేస్తోంది.

**అన్నాడీఎంకేతో కలిసినా :** తమిళనాడులో 2021 ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలసి పోటీ చేస్తే నాలుగు సీట్లు వచ్చాయి. అయితే అప్పటికీ ఇప్పటికీ అన్నా డీఎంకేలో బలం ఎంత పెరిగింది లేదా ఎంత తగ్గింది అన్నది ఒక చర్చగా ఉంది. మరో వైపు చూస్తే ఆనాడు లేని పోటీ ఇపుడు విజయ్ పార్టీ రూపంలో ఉంది. డీఎంకే విజయ్ పార్టీల మధ్యనే పోటీ అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇంకో వైపు అన్నాడీఎంకేలో వర్గ పోరు ఉంది. అంతే కాకుండా ఆ పార్టీ నుంచి బీజేపీలోకి జంపింగులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల నేపధ్యంలో బీజేపీతో పొత్తు పట్ల అన్నాడీఎంకేలో కొంత మంది అనుకూలం, మరికొంతమంది వ్యతిరేకంగా ఉన్నారని వార్తలు ఉన్నాయి. వీటి మధ్య బీజేపీ ఆశలు తమిళనాడులో ఏ మేరకు నెరవేరుతాయన్నది చర్చగా ఉంది.

**పొలిటికల్ రోడ్ మ్యాప్ :** ఈ నేపథ్యంలో తమిళనాడులో బీజేపీ తన పార్టీ విస్తరణకు ఒక రోడ్ మ్యాప్ ని సిద్ధం చేసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర పార్టీ నేతలు అంతా తాజాగా కుంభకోణంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీని సంస్థాగతంగా ఎలా బలోపేతం చేయాలి అన్నది కూడా వారు సీరియస్ గానే మేధో మధనం చేశారు. ముందు బీజేపీని జనం ముందుకు తీసుకుని పోవాలని కమలం పువ్వు గుర్తుని మరింతగా పరిచయం చేయాలని కూడా నిర్ణయించారు.

**బూత్ లెవెల్ నుంచి :** అదే విధంగా బూత్ లెవెల్ నుంచి పార్టీని పటిష్టం చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని కూడా పార్టీ నేతలు తీర్మానించారు. బూత్, మండలం జిల్లా స్థాయిలో బలమైన సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం ద్వారా రానున్న ఎన్నికలను ధీటుగా ఎదుర్కోవచ్చు అన్నది ఆలోచనగా ఉంది. అంతే కాదు క్రమశిక్షణ కలిగిన కేడర్ ని ముందు వారిని భాగం చేస్తూ పార్టీ కార్యకలాపాలు విస్తృతం చేయాలని, వాటిని నిరంతర ప్రచార కార్యక్రమాలుగా మార్చి జనంలోకి పోవాలని నిర్ణయించారు. అంతే కాకుండా పార్టీలోని వివిధ విభాగాల మధ్య న సమన్వయం అవసరాన్ని కూడా పార్టీ నేతలు గుర్తించి ఆ దిశగా అంతా కలసి పనిచేయాలని కోరారు.

**సోషల్ మీడియాతోనే :** రానున్న రోజులలో సోషల్ మీడియా ద్వారానే పెద్ద ఎత్తున ప్రచారానికి తెర తీయాలని కూడా నిర్ణయించారు. సోషల్ మీడియా ప్రచారంతో సహా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలు జనం వద్దకు తీసుకెళ్ళాలని తీర్మానించారు. అలాగే పార్టీ సభ్యత్వాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించారు.

**అర్బన్ సెక్టార్ మీదనే :** బీజేపీకి ఇటీవల కాలంలో ముఖ్యంగా పట్టణ కేంద్రాలు పారిశ్రామిక ప్రాంతాలలో బలం పెరిగింది అని పార్టీ నేతలు అంటున్నారు. అందువల్ల అక్కడ పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం గణనీయంగా పెరిగిందని చెబుతున్నారు. రానున్న ఎన్నికల్లో ఎక్కువగా అర్బన్ సెక్టార్ లో ఫోకస్ పెడితే పార్టీ అనుకున్న విజయాలు సాధిస్తుందని అంటున్నారు. మొత్తానికి చూస్తే దీర్ఘకాలిక లక్ష్యాలను పెట్టుకునే బీజేపీ తమిళనాడు ఎన్నికల బరిలోకి ఈసారి దిగుతోంది అని అంటున్నారు.

# తెలంగాణ మలి ఉద్యమంలో తొలి ఆత్మత్యాగి శ్రీకాంతచారి - డిసెంబర్ 3...శ్రీకాంతచారి వర్ధంతి



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. శ్రీకాంతచారి (ఆగష్టు 15, 1986 – డిసెంబర్ 3, 2009) మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమర వీరుడు. నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడుగా సాధారణ కుటుంబంలో 1986 సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు15) రోజున జన్మించాడు శ్రీకాంతచారి. తండ్రి వెంకటచారి వ్యవసాయంతో పాటు వృత్తి పనులు చేస్తుంటాడు. రవీంద్రాచారి అనే తమ్ముడు ఉన్నాడు. శ్రీకాంతచారి ఆడుతూ పాడుతూ చలాకీగా ఉండేవాడు. సమాజసేవలో ముందుండేవాడు. ఎవరు సాయం కోరినా కాదనేవాడు కాదు. తాను దాచుకున్న డబ్బుని పేదలు, స్నేహితుల కోసం ఖర్చు చేసేవాడు. స్థానికంగానే ప్రాథమిక విద్యను పూర్తిచేసిన శ్రీకాంత్ మోత్కూర్, నకిరేకల్ గ్రామాల్లో అభ్యసించాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లిన శ్రీకాంత చారి తొలుత బీజేపీ లో ఆ తరువాత టీఆర్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా, విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్రను పోషించాడు. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలను ముందుండి నడిపేవాడు. సెలవుల్లో ఇంటికి వెళ్లినా.. తెలంగాణ ధ్యాసే. తెలంగాణ ఉద్యమ సంబంధిత పాటలు పాడుతూ తెలంగాణ నినాదాలు చేస్తూ కవితలు రాస్తూ ఉండేవాడు. తెలంగాణ అతడి ఊతపదమైంది. ఈ క్రమంలో తెలంగాణ కోసం టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన అమరణదీక్ష శ్రీకాంత్‌లో ఉద్యమావేశాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ కారులపై ప్రభుత్వం దమనకాండ, అరెస్టులను చూసి శ్రీకాంత్ తట్టు కోలేక పోయాడు. ఆ ఉద్వేగంతో, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో తన ఆత్మ త్యాగం తర్వాతైనా మొండి ప్రభుత్వంలో చలనం తీసుకు రావాలని కోరుతూ ఆత్మాహుతికి యత్నించాడు. 2009 నవంబరు 29న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటిమీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కున్నాడు. ఉద్యమ జ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ జై తెలంగాణ అంటూ నినదించాడు. నీవైనా న్యాయం చేయమంటూ అంబేద్కర్ విగ్రహాన్ని వేడుకున్నాడు. కాలిన గాయాలతో కామినేని, యశోద, ఉస్మానియాతో పాటు చివరకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 3, 2009 న రాత్రి 10.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచాడు. ఐదు రోజుల పాటు మత్యువుతో పోరాడుతూ కూడా తెలంగాణ స్మరణ చేశాడు. బతికితే తెలంగాణ కోసం మళ్లీ చావడానికైనా సిద్ధమన్నాడు. ఎగిసే మంటల్లో బూడిదవుతుంటే టీవీల్లో చూసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెలు రగిలాయి. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా శ్రీకాంతచారి ఉద్యమజ్వాల రగిలించాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడైన శ్రీకాంతచారి తెలంగాణ ప్రజలందరి గుండెల్లో త్యాగానికి ప్రతి రూపంగా శాశ్వతంగా నిలిచిపోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# దివ్యాంగులకు చేయూత అందించడం మానవ ధర్మం - డిసెంబర్ 3... దివ్యాంగుల దినోత్సవం





అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన నిర్వహించ బడుతుంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుంది. గతంలో యుద్ధాలలో వికలాంగులైన సైనికులు మాత్రమే ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారము నాడు వికలాంగుల దినోత్సవము జరుపుకునేవారు. దానిని ఐక్యరాజ్య సమితిలో ఆమోదించి అన్ని రకాలుగా వికలాంగులైన వారందరు ప్రపంచ యావత్తు ఈ వేడుకలను నిర్వహించు కోవాలని ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారాన్ని "ప్రపంచ వికలాంగుల దినోత్సవము"గా ప్రకటించ బడినది. అలాగే 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరముగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటం ఆ సంవత్సరములో ఎన్నో కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే, 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఎన్నో వర్గాల వారికి అనగా కార్మికులకు మేడే – మే 1వ తేదీన, పిల్లలకు చిల్డ్రన్ డే నవంబర్ 14వ తేదీన, మహిళలకు ఉమెన్స్ డే మార్చి 8వ తేదీన చివరకు ప్రేమికులకు వాలెంటైన్స్ డే ఫిబ్రవరి 14వ తేదీన ఇలా ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన తేది ఉంటే వికలాంగులకు మాత్రం నిర్దిష్ట మైన లేదీ. నాడు కాకుండా మార్చి 3వ ఆదివారం "ప్రపంచ వికలాంగుల దినోత్సవము" జరుపడం వలన ప్రతి సంవత్సరము ఏదో ఒక తేదీన రావడం వలన ఫలాన తేది వాడు వికలాంగుల దినోత్సవము అని గుర్తించ లేకపోవడం జరిగినది. ఈ విషయమై 1994వ సంవత్సరము మొదటి లోనే ఐక్యరాజ్య సమితిలో మరొక పర్యాయం చర్చించి మార్చి 3వ ఆదివారం నాడు జరుపుతున్న "ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని" 1994 నుండి డిసెంబర్ 3వ తేదీనాడు "అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవముగా" జరపాలని ప్రకటించ బడినది. ఆ నాటి నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరము డిసెంబర్ 3వ తేదీనాడు యావత్తు ప్రపంచములో నిర్వహించ బడుచున్నవి. 1995 వికలాంగుల హక్కుల చట్టం వచ్చినప్పటి నుండి వికలాంగుల సంక్షేమము మరియు అభివృద్ధి కై పలు పథకాలు ప్రవేశ పెట్టబడినవి. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 1981లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేయడం, తరువాత 1983లో వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. వాస్తవానికి ఆంగ్ల భాషలో హ్యాండి క్యాప్ డ్, డిజేబుల్డ్, ఫిసికల్లీ ఛాలెంజ్డ్ అని రక రకాల పదాలు వాడుతున్నా, తెలుగులో అంగ వికలులను "వికలాంగులు" కాకుండా "దివ్యాంగులు"గా పేర్కొనడం సమంజసంగా భావించి, సాధ్యమైనంత వరకూ వికలాంగులు అనే పదం వాడుక భాషలో తీసేసి, అలాగే దివ్యాంగులు పదమే వాడుతున్నారు. సమాజంలోని దివ్యాంగుల పట్ల స్వాభావిక గౌరవం, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి, వివక్షత లేని సమాజం, అవకాశాల సమానత్వం, అవరోధ రహిత వాతావరణం నిర్మాణం కొరకు, దివ్యాంగుల హక్కులకు కలుగ జేయడానికి కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించింది. దీన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018లో రూపొందించారు. ఈ చట్టంలో భాగంగా దివ్యాంగులకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించడానికి ప్రత్యేక హక్కులతో పాటు 5% రిజర్వేషన్ కల్పించారు. వారి స్వాలంబనకై తెలంగాణ రాష్ట్రం లో గత తెలంగాణ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు ఏడు లక్షల 30 వేల దివ్యాంగులకు ప్రతి నెల మూడు వేల పదహారు రూపాయలు పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. అలాగే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వెళ్లడానికి అవరోధ రహిత వాతావరణం కల్పించుటకు, అన్ని సంస్థల్లో ర్యాంపులు నిర్మాణమే గాక అచట దివ్యాంగులు ఉపయోగించుకునే మూత్రశాలలు, వీల్ చైర్ లు ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం ఉపాధి పథకం కింద 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నది. దివ్యాంగులకు వారి కార్యక్రమాలు నిర్వహించడం కొరకు వారికి కావలసిన ఉపకరణాలను అందజేయడం ఉచితంగా అందచేయడం జరుగుతున్నది. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికను జోడించి అనేక అభివృద్ధి చెందిన ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతున్నది. అలాగే కొవిడ్–19 పరిస్థితుల్లో దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వారికి కావాల్సిన సేవలు అందజేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేసింది. ఈ టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసిన దివ్యాంగులకు వారికి కావలసిన నిత్యావసర వస్తువులు మందులు ఉపకరణాలు, అలాగే వారికి కావలసిన అనుమతి పత్రాలను అందజేయడానికి ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులోకి తెచ్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# కూచిపూడి నాట్యానికి బందా ఎనలేని సేవలు - డిసెంబర్ 3... బందా కనక లింగేశ్వరరావు వర్ధంతి

తెలుగు టాకీ తొలి తరానికి చెందిన సినిమా నటుడు బందా కనక లింగేశ్వరరావు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, ఆకాశవాణి, నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడు, కూచిపూడి కళాక్షేత్ర వ్యవస్థాపకుడు అయిన బందా కనకలింగేశ్వరరావు (జనవరి 20, 1907– డిసెంబరు 3, 1968 కృష్ణా జిల్లాలోని ఆటపాక గ్రామంలో జన్మించాడు. ఆటపాకలో ప్రాథమిక విద్యాభ్యాసం, అనంతరం బందరు నోబుల్ కళాశాలలో చదివి, మద్రాసు లా కళాశాల నుండి 1932 లో బి.ఎల్. పట్టా పుచ్చు కున్నాడు. 1934లో మొదట న్యాయవాదిగా పనిచేసి, తరువాతి కాలంలో నాటక ప్రదర్శనమే వృత్తిగా చేసుకున్నారు. నాటకాలలో తనకు అత్యంత ఇష్టమైన బాహుకుడు, బిల్వమంగళుడు లతో పాటు, అనేక పాత్రలు పోషించాడు. అయన ఏలూరులో 1938లో నాటక కళాశాలను స్థాపించి పలువురు నటులకు శిక్షణ ఇచ్చాడు. ప్రభాత్ థియేటర్ అనే సంస్థను స్థాపించి నాటక ప్రయోక్తగా నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టాడు. తెలుగు సినిమా ప్రపంచంలో మొదటి తరం సినిమాలైన...సారంగధర (1937 సినిమా), బాల నాగమ్మ, ద్రౌపదీ మాన సంరక్షణం, పాదుకా పట్టాభిషేకం (1945 సినిమా) తదితర సినిమాలలో నటించాడు. కూచిపూడి నాట్యకళకు ఎనలేని సేవచేశాడు. ప్రభుత్వ సాయంతో కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర కళాక్షేత్రం నెలకొల్పి నిర్వహించాడు. కూచిపూడి నాట్య కళ గురించి ప్రముఖ పత్రికలలో వ్యాసాలు రాసి దాని ప్రాధాన్యాన్ని అందరికీ తెలియ జేశాడు.1956 లో ఆకాశవాణిలో నాటక ప్రయోక్తగా పనిచేసి వివిధ నాటకాలను, నాటికలను ప్రసారం చేశాడు. ఆటపాక గ్రామంలో ఒక శివాలయాన్ని, ఒక చెరువును తవ్వించడమే కాకుండా ఒక వేద పాఠశాలను కూడా స్థాపించాడు. ఆయన 1964 లో "కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు"ను పొందాడు. ఉత్తమ నటనకు "రాష్ట్రపతి అవార్డు" లభించింది. ఆయనకు ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన జన్మ శతాబ్ది ఉత్సవాలను హైదరాబాదులో 2006–07 సంవత్సరాలలో ఘనంగా నిర్వహించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




# రాష్ట్ర పతులకు ఆదర్శం రాజేంద్ర ప్రసాద్ - డిసెంబర్ 3... భారత తొలి రాష్ట్రపతి జయంతి



ప్రజలు ప్రేమగా, గౌరవంగా 'బాబూ' అని పిలుచుకునే డా. రాజేంద్ర ప్రసాద్ (1884 డిసెంబర్ 3 – 1963 ఫిబ్రవరి 28) భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి. 1950 నుండి 1962 వరకు రెండు సార్లు రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వహించాడు. బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగి, భారత జాతీయ కాంగ్రెస్ లో భారత స్వాంతంత్ర్యోద్యమ కాలంలో చేరాడు. మహాత్మాగాంధీ మద్దతుదారునిగా 1931 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం, 1941లోజరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. 1946 ఎన్నికల తరువాత నెహ్రూ మంత్రి వర్గంలో ఆహారం, వ్యవసాయం శాఖకు భారత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నాడు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచబడిన సంఘానికి అధ్యక్షుడు. 1951 సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటి భారత పార్లమెంటు ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిగా ఎన్నుకోబడిన నేత. రాజేంద్ర ప్రసాద్ బీహార్ రాష్ట్రంలో శివాన్ జిల్లాలోని జెర్దాయ్ గ్రామంలో 1884లో డిసెంబరు 3 న జన్మించాడు. అతని తండ్రి మహదేవ్ సహాయ్ సంస్కృతం, పర్శియను భాషలలో పండితుడు. తల్లి కమలేశ్వరీ దేవి ఎప్పుడూ రామాయణం నుండి కథలు వివరించేది. ఐదవ ఏటనే పర్షియన్ భాష, హిందీ భాష , అంకగణితం ను నేర్చుకోవడానికి ఒక మౌల్వీ (ముస్లిం పండితుడు) దగ్గరకు పంపించ బడ్డాడు. తరువాత ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసాడు. 12 సంవత్సరాల వయసులోనే రాజ్‌వంశీ దేవిని వివాహం చేసుకున్నాడు. అటు తరువాత విద్యకై పాట్నాలో కె.ఘోష్ పాఠశాలలో చదువుకున్నాడు. ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో చేరి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై నెలకు రూ.30 ఉపకారవేతనం పొందాడు. 1902లో అతడు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. మొదట్లో సైన్సు విద్యార్థి. 1904లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎఫ్.ఎ ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడే 1905లో మొదటి స్థానంలో గ్రాడ్యుయేషన్ చేసాడు. అతని అధ్యాపకులలో జగదీష్ చంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రాయ్ మొదలగువారు ఉన్నారు. ఆయన మేథాశక్తికి ఒక ఎక్జామినర్ (పరీక్షకుడు) ప్రభావితుడై అతడి పరీక్షా జవాబు పత్రంపై "పరీక్షకుని కంటే పరీక్షితుడు గొప్పవాడు" అనే వ్యాఖ్య రాశాడు. 1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. బి.ఎల్. ఆ తర్వాత ఎం.ఎల్. పూర్తి చేసి డాక్టరేట్ కూడా పొందాడు. . అన్నతో కలిసి స్వదేశీ ఉద్యమాన్నీ నడిపాడు. అతడు "డ్వాన్ సమాజం" లో క్రియాశీల సభ్యునిగా సేవలందించాడు. అతడు పాట్నా కళాశాలలో1906లో జరిగిన బీహారీ స్టూడెట్స్ కాన్ఫరెన్సు ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. ఉపాధ్యాయునిగా అనేక విద్యాసంస్థలలో పనిచేసాడు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పూర్తి చేసిన తరువాత అతడు బీహార్ లోని ముజఫర్‌పూర్ లాంగట్ సింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా చేరాడు. తరువాత ఆ సంస్థకు ప్రధానాచార్యునిగా తన సేవలనందించాడు. తరువాత 1909లో కలకత్తాలోని రిప్పన్ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించడానికి గాను ఉద్యోగాన్ని వదిలి వెళ్ళాడు. అతడు ఆ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించే సమయంలో కలకత్తా సిటీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసాడు. 1915 లో "మాస్టర్ ఆఫ్ లా" పరీక్షలకు హాజరై ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకాన్ని పొందాడు. 1937లో అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందాడు. 1916 లో, బీహార్, ఒడిషా రాష్ట్రాల హైకోర్టులలో చేరాడు. తరువాత 1917లో అతడు పాట్నా విశ్వ విద్యాలయంలోని సెనేట్, సిండికేట్ లో మొదటి సభ్యునిగా నియమింపబడ్డాడు. న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అనతికాలంలో స్వాతంత్ర్య పోరాటంవైపు ఆకర్షితు డై, 1906లో మొదటి సారి కలకత్తాలో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల ద్వారా సంబంధాన్ని పెంచుకున్నాడు. 2011లో రెండవసారి వార్షిక సమావేశాల సమయంలో జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. 1916 లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో మహాత్మా గాంధీని కలిసాడు. చంపారన్ లో జరగనున్న నిజ నిర్ధారన కమిటీలోనికి తనతో పాటు స్వచ్ఛంద కార్యకర్తగా రావాలని మహాత్మా గాంధీ అతనిని కోరాడు. 1918 లో'సర్చ్ లైట్'అనే ఆంగ్ల పత్రికను, ఆ తర్వాత 'దేశ్' అనే హిందీ పత్రికను నడిపాడు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. అతడు తన లాభదాయకమైన న్యాయవాద వృత్తిని, అలాగే విశ్వవిద్యాలయంలోని అధ్యాపక వృత్తి విధులను తప్పుకున్నాడు. భారతీయ సాంప్రదాయ విధానాలలో విద్యాభ్యాసం అందిస్తున్న బీహార్ విద్యాపీఠాన్ని 1921లో తన మిత్రబృందంతో కలిసి స్థాపించి భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నడిపాడు. 1921లో మహాత్మా గాంధీతో ఒకమారు సమావేశం తరువాత, విశ్వవిద్యాలయంలో తన సెనేటర్ పదవికి రాజీనామా చేశాడు. రాజేంద్రప్రసాద్ 1934 అక్టోబరులో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. అలాగే 1939లో, నేతాజీ రాజీనామా చేసిన తరువాత, 1947లో ఇంకోసారి, మొత్తం మూడుసార్లు ఆ పదవిని చేపట్టాడు. 1942 ఆగస్టు 8 న క్విట్ ఇండియా సంధర్భంగా అరెస్టు చేసి, బాంకిపూర్ కేంద్ర కారాగానికి తరలించారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష తర్వాత, 1945, జూన్ 15 న విడిచిపెట్టారు. 1946 సెప్టెంబరు 2 న ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం జవాహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో 12 మంది మంత్రులను ఎంపిక చేయగా, రాజేంద్ర ప్రసాద్ ఆహారం, వ్యవసాయ శాఖకు మంత్రిగా పనిచేసాడు. 1946 డిసెంబరు 11 న రాజ్యాంగ సభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. కృపాలానీ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజీనామా చేసిన తరువాత 1947 నవంబరు 17 న కాంగ్రెస్ అధ్యక్షునిగా భాద్యతలు స్వీకరించాడు. భారత స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత 1950 జనవరి 26 న స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించ బడింది. రాజేంద్ర ప్రసాద్ ను తొట్టతొలి రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. భారతదేశానికి అధ్యక్షునిగా రాజ్యాంగం ప్రకారం భాద్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీకి చెందకుండా స్వతంత్రుడిగా వ్యవహరించాడు. ఒక రాష్ట్రపతిగా పక్షపాత ధోరణి లేకుండా, స్వతంత్రంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాడు. భారతదేశంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నెహ్రూ కు వివిధ సందర్భాలలో సలహాల నిచ్చేవాడు. 1957లో రాష్ట్రపతిగా ఎన్నికై, రెండు సార్లు భారత రాష్ట్రపతిని చేపట్టిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు. దేశానికి మొట్టమొదటి రాష్ట్రపతిగా స్వతంత్రంగా మెలిగి, ప్రధానిని గానీ పార్టీని గానీ రాజ్యాంగ నిర్మాణంలో జోక్యం చేసుకోనీక, తరువాత రాష్ట్రపతులకు ఉదాహరణగా నిలిచాడు. "హిందూ కోడ్ బిల్" చట్టం పై వివాదాల తరువాత అతను రాష్ట్ర వ్యవహారాల్లో మరింత చురుకైన పాత్రను పోషించాడు. 12 సంవత్సరాల పాటు భారత రాష్ట్రపతిగా సేవలందించి 1962 న పదవీ విరమణ చేశాడు.1963 ఫిబ్రవరి 28 న ఆయన రాం రాం అంటూ కన్ను మూశాడు. దేశ్ రత్న అని పిలువ బడిన ఆయనకు మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# ట్రాక్టర్ల కొనుగోళ్లలో చేతివాటం

ఆదిలాబాద్ : వాహనాన్ని ఎవరైనా షో రూం ధరకే కొనుగోలు చేస్తారు.. కంపెనీ ఆఫర్ చేస్తే.. కాస్త తక్కువే చెల్లిస్తారు. కానీ, బల్దియా అధికారులు మాత్రం షోరూం ధర కన్నా అధికంగా చెల్లించి మూడు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అందుకు అనుగుణంగానే వాహనాల కొనుగోళ్లకు సంబంధించిన టెండరు తయారీ, ఆమోదం, సాంకేతిక అనుమతుల్లో గుత్తేదారుకు అనుకూలంగా ఎంబీ రికార్డులు నమోదు చేయడం బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బల్దియాలో ట్రాక్టర్ల కొనుగోళ్లలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఈ ఏడాది ప్రారంభంలోనే కొనుగోలు చేయగా అప్పట్లో అనుమానం వచ్చిన పలువురు కౌన్సిలర్లు అవే కంపెనీకి చెందిన ట్రాక్టర్ల కొటేషన్లను ప్రైవేటుగా అడిగి తీసుకున్నారు. బల్దియా కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ధరకు, ప్రైవేటుగా తీసుకున్న కొటేషన్లకు ధరలో వ్యత్యాసం రావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశంతో బల్దియా ఈఈ పేరి రాజు విచారణ చేపట్టగా మొత్తం రూ.2.76 లక్షలు తేడా



వచ్చినట్లు నిర్ధారించారు. తాజాగా ట్రాక్టర్లను సరఫరా చేసిన గుత్తేదారును రూ.2.76 లక్షలు తిరిగి బల్దియాకు చెల్లించాల్సిందిగా ఆదేశించారు.

**గుత్తేదారుతో కుమ్మక్కు**

బల్దియాలో పారిశుద్ధ్య పనులకోసం మూడు ట్రాక్టర్లు అవసరమవగా.. గతేడాది డిసెంబరులో అధికారులు టెండరు ప్రకటన జారీ చేశారు. ఓ కంపెనీకి చెందిన డీఐ35 హెచ్‌పీ 39 సామర్థ్యం గల మూడు ట్రాక్టర్లను గుత్తేదారు కొనుగోలు చేసి బల్దియాకు అందజేశారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.8.70 లక్షల చొప్పున మూడు ట్రాక్టర్లకు మొత్తం రూ.26.10లక్షలు వ్యయమైనట్లు బల్దియా అధికారులు ఎంబీ రికార్డులు చేసి గుత్తేదారుకు చెల్లించారు. కంపెనీకి చెందిన ఒక ట్రాక్టర్ వాస్తవ షోరూం ధర అన్ని రకాల పన్నులు, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు కలుపుకుని రూ.7.78 లక్షలు మాత్రమే ఉంది. అంటే ఒక్కో ట్రాక్టరుకు రూ.92 వేలు చొప్పున మూడు ట్రాక్టర్లకు కలిపి మొత్తం రూ.2.76 లక్షలు గుత్తేదారుకు అధికంగా చెల్లించారు. ఈ వ్యవహారమంతా అప్పట్లో పనిచేసిన ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో జరిగింది.

# గొంతు తడపాల్సిన నీరు.. మురుగుపాలు

బెల్లంపల్లి : బెల్లంపల్లిలో ఇంటింటికి శుద్ధజలం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల తీరుతో నీరుగారుతోంది. లీకేజీలతోపాటు ఇంటింటికి ఏర్పాటు చేసిన కుళాయిలకు ఫ్లో కంట్రోల్ వాల్వులు లేక తాగునీరు మురుగు కాలువల్లోకి చేరుతోంది. వారానికి రెండుసార్లు నీరు సరఫరా చేస్తున్నారు. గంటల తరబడి వేల లీటర్లు శుద్ధజలం రహదారులపై పారుతుంది.

**లీకేజీలే అంతటా..**

బెల్లంపల్లి పట్టణంలో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినా.. ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లు బిగించలేదు. సరఫరా సమయంలో చాలామంది రోడ్లపైనే పడేయడంతో పెద్ద మొత్తంలో నీరు నేలపాలవుతోంది. వేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తుతోంది. పట్టణంలోని 34 వార్డుల్లో 15,000 వేల వరకు నివాసాలున్నాయి. తాగునీరు సరఫరాకు 20 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ జనాభా సుమారుగా 42 వేల వరకు ఉంటుంది. పోస్ట్ ఆఫీస్ బస్తీ(29వ వార్డు), కాల్‌టెక్స్(12, 13),



రాంనగర్, హనుమాన్‌బస్తీ(33), శిశుమందిర్‌రోడ్డు, రైల్వేస్టేషన్, కన్నాలబస్తీ, బూడిదగడ్డబస్తీ, షంషీర్‌నగర్, రడగంబాలబస్తీ, శాంతిఖని, టేకులబస్తీ ప్రాంతాల్లో లీకేజీల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో 1,500 కుళాయిలకు ఆన్ ఆఫ్‌లు లేక నీరంతా వృథాగా పోతోంది. బెల్లంపల్లి పట్టణంలో నీరు సరఫరా చేసే రోజు లక్షకుపైగా లీటర్ల శుద్ధజలం మురుగుపాలవుతోంది.

**ఒక్కో ఇంటికి రెండు మూడు కనెక్షన్లు**


కాల్‌టెక్స్ ప్రాంతంలో నివాసాలతోపాటు దుకాణ సముదాయాలకు రెండు, మూడు చొప్పున కనెక్షన్లను ఏర్పాటు చేసుకున్నారు. గోదావరి నుంచి, అడ ప్రాజెక్టునుంచి వచ్చే విధంగా ఇళ్ల యజమానులు అవసరానికి మించి వీటిని ఏర్పాటు చేయించుకున్నారు. వారంలో రెండురోజులు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అనవసరంగా ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కాల్‌టెక్స్ ప్రాంతంలోని పైవంతెన సమీపంలో నీరంతా బయటకు ప్రవహించి మురుగు కూపంగా మారింది. ఏ ఇంటి ముందు చూసినా మురుగు కాలువలో పడేసిన పైపులే కనిపిస్తున్నాయి.

## గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా.. పంచాయతీలు

ఆదిలాబాద్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1952లో మొదటి పంచవర్ష ప్రణాళిక మొదలైంది. అప్పట్లో ప్రణాళికతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా గ్రామీణుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని సంకల్పించారు. ప్రొ. ఎస్కే డే నేతృత్వంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. దీని అమలుపై శాస్త్రీయ అధ్యయనానికి సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్త డా.బల్వంత్‌రాయ్ మెహతా నేతృత్వంలో బృందాన్ని నియమించారు.

ప్రజా భాగస్వామ్యానికి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం, ప్రణాళిక వికేంద్రీకరణ ద్వారా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వనరుల వినియోగం, శాశ్వతమైన పరిపాలన, అమలు యంత్రాంగం ఏర్పాటు చేయాలని సదరు బృందం నివేదించింది. దీని ఆధారంగా ప్రభుత్వం 1959లో జిల్లా, బ్లాక్, గ్రామ 'పంచాయత్' అనే మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. తొలిసారిగా రాజస్థాన్‌లో అక్టోబరు 2న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో అదే ఏడాది అక్టోబరు 11న అప్పటి ప్రధాని నెహ్రూ ప్రారంభించారు. ఈ వ్యవస్థ దశలవారీగా దేశమంతటా అమలైంది.

# నిప్పు.. ముప్పు



చాంద్రాయణగుట్ట: " పాతబస్తీ శాలిబండలో ఈ నెల 24న గోమతి ఎలక్ట్రానిక్స్ షోరూంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. రూ.లక్షల ఆస్తినష్టం జరిగింది."ఈ ఘటన అగ్నిప్రమాదాల తీవ్రత తెలియజేస్తోంది. ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రమాదాలు జరగకుండా చూడొచ్చని విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, నిప్పు అంటుకోవడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్లక్ష్యం, ఏమరుపాటు కారణంగానే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతుంటాయని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లోనే కాకుండా ఇళ్లలోనూ షార్ట్ సర్క్యూట్, ఏసీ ఓవర్‌లోడ్, అధిక వేడి కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇంట్లో వైరింగ్ పక్కాగా ఉన్నా స్విచ్ బోర్డుల్లో మంటలు రావడం.. అప్పటి వరకు బాగానే ఉన్న ఫ్రిజ్, ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్‌లైట్లు అకస్మాత్తుగా కాలిపోవడం.. విద్యుత్ మోటార్లు, వాషింగ్ మిషన్‌లు, గీజర్‌లను పట్టుకుంటే షాక్ కొట్టడం వంటివి జరుగుతుంటాయి. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోయే అవకాశాలు కూడా ఉంటాయి. అందుకు ప్రధాన కారణం ఎర్తింగ్ లేకపోవడమేనని విద్యుత్తు అధికారులు అంటున్నారు. వైరింగ్ చేసే సమయంలో ఎంసీబీ(మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్), ఈఎల్‌సీబీ (ఎర్త్ లీకేజీ సర్క్యూట్ బ్రేకర్), ఎర్తింగ్ ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని వారు పేర్కొంటున్నారు.

**ఎర్తింగ్ కీలకం..**

విద్యుత్ కనెక్షన్లకు ఎర్తింగ్ కీలకం. అధిక ఓల్టేజీ కారణంగా గృహోపకరణాలు కాలిపోకుండా ఇది రక్షిస్తుంది. ఎర్త్ రాడ్స్ విద్యుత్ ప్రవాహాన్ని భూమిలోకి మళ్లిస్తాయి. పిడుగులతో వచ్చే అధిక విద్యుత్ శక్తిని నేలలోకి పంపిస్తాయి. ప్రధానంగా తడి ప్రాంతాల్లో, అధిక విద్యుత్తు వినియోగించే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ఈఎల్‌సీబీ, ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ సక్రమంగా ఉందా లేదా తెలుసుకోవడానికి ఓమ్స్ మీటర్‌తో పరిశీలించాలి. ఒకటి నుంచి ఐదు ఓమ్స్ మధ్య మీటర్ ఉంటే సురక్షితంగా ఉన్నట్లు భావించాలి. అధికంగా ఉంటే ఎర్తింగ్‌లో ఇబ్బంది ఉన్నట్లు గుర్తించి, సరిచేసుకోవాలి.

**నాణ్యమైన వైరింగ్ ముఖ్యం**

ఇళ్లలో నాణ్యమైన వైరింగ్‌తో పాటు ఎంసీబీలు, ఈఎల్‌సీబీలు, ఎర్తింగ్, స్టెబిలైజర్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్తు మోటార్లు, ఫ్రిజ్‌లు, గీజర్లు తదితర వస్తువులకు వైర్లు తగిలి షాక్ కొడుతుంటాయి. ఈఎల్‌సీబీలు, ఎర్తింగ్ ఏర్పాటుతో ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు. అధిక, లోవోల్టేజీ కారణంగా టీవీలు, ఫ్రిజ్‌లు పాడవకుండా గతంలో స్టెబిలైజర్లు ఉపయోగించే వారు. ప్రస్తుతం ఇన్‌బిల్ట్‌తో టీవీలు, ఫ్రిజ్‌లు తయారవుతున్నాయి. స్టెబిలైజర్ల వాడకం తగ్గింది. స్టెబిలైజర్లు వాడడం వల్ల వస్తువులకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదు.

# 'కొత్త' వారికీ 'పాత' కష్టాలే!




పరిగి : గ్రామీణాభివృద్ధిలో పంచాయతీల పాత్ర ఎనలేనిది. ప్రభుత్వాలు అమలు పరిచే పథకాలు ప్రజలకు అందించడం, గ్రామాభివృద్ధికి ప్రణాళికల తయారీ, ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి పనులు నిర్వహించడం పంచాయతీల విధి. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా పంచాయతీలకు పక్కా భవనాలు మాత్రం కరవయ్యాయి. దీంతో ప్రజాప్రతినిధులు, పల్లెవాసులు సమావేశాలు నిర్వహించుకొని మాట్లాడుకునే అవకాశం ఉండడం లేదు. వివిధ పథకాల కింద చేపట్టినవి సకాలంలో పూర్తి కావడం లేదు. కొత్త వాటిపై దృష్టి సారించక పాట్లు నిత్యకృత్యంగా మారాయి. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న వేళ కొత్త పాలకవర్గాలు ఎక్కడ సమావేశాలు నిర్వహించుకోవాలో తెలియడం లేదు.

**అసంపూర్తిగా వదిలేసి..**


పరిపాలన సౌలభ్యంలో భాగంగా తండాలను సైతం గత ప్రభుత్వం పంచాయతీలుగా మార్చింది. ప్రస్తుతం జిల్లాలో 594 పంచాయతీలున్నాయి. వాటిలో పక్కా భవనాలు కలిగినవి 356 కాగా.. మిగతావి సామాజిక భవనాలు, మహిళా సంఘాలు, పాఠశాలల్లోనే కొనసాగుతున్నాయి. పదేళ్ల కిందట చేపట్టినవీ నేటికీ పూర్తి కాలేదు. దీంతో ఇటు గ్రామ కార్యదర్శులతోపాటు వివిధ పనులపై వెళ్లే ప్రజలకూ అవస్థలు తప్పడం లేదు. సకాలంలో బిల్లులు అందకపోవడంతో చాలాచోట్ల మధ్యలోనే ఆపేస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద జిల్లాకు రూ.8.23 కోట్లతో 42 పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. వాటిలో 31 పనులు ప్రారంభమయ్యాయి. మిగతావి వివిధ రకాల సమస్యలతో మొదలు కాలేదు.

పరిగి మండలం మాదారంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన పంచాయతీ భవనం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. పోల్కంపల్లిలో చివరి దశలో పనులు నిలిచిపోగా.. గ్రామసభ చింతచెట్టు కిందే నిర్వహిస్తుంటారు.

దోమ మండలం బాసుపల్లిలో రూ.16 లక్షలతో చేపట్టిన భవనం స్లాబు పనులతో నిలిచింది. బొంపల్లిలో దశాబ్ద కాలంగా నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలోనే ఆగిపోయాయి. ప్రాథమిక సహకార సంఘం భవనంలోనే పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. **పూర్తయ్యేలా కృషి చేస్తాం..: ఉమేశ్‌కుమార్, ఈఈ, వికారాబాద్**

ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంచాయతీ భవనాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణ దశలను బట్టి వడివడిగా బిల్లులు అందిస్తున్నాం. మిగతావీ ప్రారంభించేలా ప్రయత్నిస్తున్నాం.

# కారును లిఫ్టు ఎక్కిద్దాం



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ కేబీఆర్ పార్కు వద్ద నిర్మించిన మొదటి బహుళ అంతస్తుల పార్కింగ్ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ప్రయోగ పరీక్షలు విజయవంతమవడంతో.. శనివారం సేవలను ప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ శుక్రవారం ప్రకటించింది. ఒప్పందం ప్రకారం..బల్దియా స్థలాన్ని ఇవ్వగా.. ప్రైవేటు సంస్థ సొంత నిధులతో నిర్మించింది. 15ఏళ్లపాటు అక్కడ పార్కింగ్ రుసుమును వసూలు చేసుకోవడం, కేంద్రంపై డిజిటల్ ప్రచారం చేసుకోవడం ద్వారా సంస్థ ఆదాయం పొందుతుంది.

విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కేంద్రం కూడా.. రోజూ లక్షల వాహనాలు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న రోడ్డు మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయి. పార్కులో నడకకు వచ్చే వారు.. పార్కింగ్ వసతి లేకపోవడంతో.. తమ వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వచ్చే సందర్శకుల వాహనాలతోనూ చుట్టూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఎన్టీఆర్ భవన్ చౌరస్తా నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు వెళ్లే రోడ్డు పక్కన 405 చ.మీ విస్తీర్ణంలో ఐదు అంతస్తుల పార్కింగ్ కేంద్రాన్ని నిర్మించింది. అందులో 72 కార్లను నిలపొచ్చు. కార్లను ప్రవేశ ద్వారం వద్ద ఉంచితే.. నిలువుగా తిరిగే చక్రం వాటిని ఖాళీగా ఉన్న అంతస్తులోకి తీసుకెళ్తుంది. 20 ద్విచక్ర వాహనాలనూ పార్కింగ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఉదయం 5గంటల నుంచి రాత్రి 11 వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. ఆర్‌ఎఫ్‌ఐడీ ట్యాగుతో పార్కింగ్ ఉంటుందని, సెన్సర్లు, సీసీ కెమెరాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో తమ కేంద్రం పని చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కేంద్రాన్నీ ఏర్పాటు చేశామన్నారు.

# కళ తప్పిన కూడళ్లు

మెదక్ : మెదక్ పట్టణంలో కూడళ్ల సుందరీకరణ ప్రకటనలకే పరిమితమైంది. ప్రధాన మార్గమైనా నర్సాపూర్–మెదక్–బోధన్ రోడ్డు విస్తరణలో నర్సాపూర్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్, రాందాస్ చౌరస్తాలో శివాజీ, అంబేడ్కర్, గాంధీ, ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో అంబేడ్కర్, మరో చౌరస్తాలో ధ్యాన్‌చంద్ విగ్రహాలను తొలగించి కూడళ్లను విశాలం చేశారు. అయితే అభివృద్ధి పనులను విస్మరించారు. దీంతో వాటిల్లో పొదలు పెరుగుతున్నాయి. మరికొన్ని పశువుల ఆవాసాలకు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటుకు, ప్రైవేట్ వ్యక్తుల ప్రచార బోర్డులకు అడ్డాగా మారుతున్నాయి.

**ప్రకటనలతో సరి**

అసెంబ్లీ, పురపాలిక ఎన్నికల సమయంలో చౌరస్తాలను అందంగా తీర్చిదిద్ది, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అనంతరం పట్టించుకోవడంలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారంలోకి వచ్చిన వెంటనే చౌరస్తాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచడంలేదు. అభివృద్ధిని రాందాస్ చౌరస్తా నుంచే



ప్రారంభిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చిత్రాలను కూడా చూపించారు తప్పితే అడుగు ముందుకు పడలేదు. పట్టణానికి చెందిన ప్రముఖులు, యువకులు కమిటీగా ఏర్పడి డబ్బులు పోగు చేసుకొని రాందాస్ చౌరస్తాలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ పచ్చదనాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు.

**ఎన్‌వోసీ రాగానే పనులు చేపడతాం**
– శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్

పట్టణంలోని ప్రధాన రోడ్డు ఎన్‌హెచ్ శాఖ పరిధిలో ఉండడంతో ఆయా కూడళ్లలో సుందరీకరణ పనులు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు వారి నుంచి అనుమతులకు లేఖ రాశాం. వారి నుంచి (ఎన్‌వోసీ) అనుమతి రాగానే పనులు చేపడుతాం.

# అక్రమ రవాణా.. అడిగే వారేరి!

జహీరాబాద్ : సులభంగా.. పారదర్శకంగా అన్న నినాదంతో ఆన్‌లైన్ పర్మిట్ల జారీ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసింది. అదే సమయంలో అక్రమ రవాణాపై నిరంతర నిఘాకు మొబైల్ స్క్వాడ్‌లు, ఈ–ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ కొనసాగుతుందని ప్రకటించింది. అయితే కొత్త విధానం మాత్రం అమలుకు నోచుకోలేదు. చెక్‌పోస్టులు ఎత్తేసి నెల దాటినా సంచార వాహన తనిఖీలు జాడ లేకపోవడం గమనార్హం. 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఏఎన్‌పీఆర్ (ఆటో నంబర్ ప్లేట్ రీడర్) ఎక్కడా కనిపించడం లేదు. అడిగే వారు లేక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

**ఐదు దశాబ్దాల పాటు..**

అక్రమాల అడ్డగింతకు రవాణా శాఖ చెక్‌పోస్టులు వెలిశాయి. ఆయా చోట్ల ఎంవీఐలు, ఏఎంవీఐలు ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఘటనలు అనిశా సోదాల్లో వెలుగుచూశాయి. ఈ కారణంగా ఐదు దశాబ్దాలుగా కొనసాగిన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి శివారు హైదరాబాద్–ముంబయి జాతీయ రహదారిపై ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు అక్టోబరు 22న తొలగించారు.

**నిరంతరం తనిఖీ చేస్తామని..**

ఆన్‌లైన్ ద్వారా ఆదాయం ఆర్జించేలా రవాణా శాఖ సంచార వాహన తనిఖీ (మొబైల్‌స్క్వాడ్)లను ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. కానీ



ఇంతవరకు వాటి జాడే లేదు. చెక్‌పోస్టులు తొలగించాక అత్యాధునిక ఏఎన్‌పీఆర్ (ఆటో నంబరు ప్లేట్ రీడర్) కెమెరాలు బిగిస్తామని చెప్పిన కార్యరూపం దాల్చలేదు. అనుమతి తీసుకోకుండా వచ్చే వాహనాలను గుర్తించేలా పర్యవేక్షణ ఎక్కడా లేకుండా పోయింది. ఫలితంగా 65వ జాతీయ రహదారితో పాటు అంతర్రాష్ట్ర దారులు జహీరాబాద్–బీదర్, జహీరాబాద్–చించోళి–గుల్బర్గా మార్గాల్లో నిఘా కరవైంది.

**యథేచ్ఛగా తరలివెళ్తూ..**

జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఎక్కువగా సరకు రవాణాతో పాటు ట్రావెల్స్ బస్సులు, మినీ బస్సులు, ట్యాక్సీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాటికి తాత్కాలిక అనుమతి పత్రాలు ఇచ్చేవారు. సరకు వాహనాలను క్షుణ్నంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడక్కడ అధికారులు లేరు. దీంతో జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. ముంబయి, గోవా తీర ప్రాంతాల నుంచి పన్ను ఎగ్గొట్టిన అలంకరణ సామగ్రి, మొబైల్స్ సహా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, నిషేధిత రసాయనాలు తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు..**

అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టు ఎత్తివేయడంతో అక్రమ రవాణాపై దృష్టి సారిస్తాం. అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే సీసీ కెమెరాలు బిగించనున్నాం.
– వెంకటరమణ, ఉప కమిషనర్, ఉమ్మడి జిల్లా రవాణా శాఖ

# సరిపడా లేరు.. పల్లెలకు పోరు

హైదరాబాద్: సర్కారు బడుల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులుండాలని రాష్ట్ర ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. అయినా కొన్ని పాఠశాలల్లో కొరత తీవ్రంగా ఉంది. హైదరాబాద్ జిల్లాలోని పాతబస్తీలో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే... ఒక్కోదాంట్లో సగటున ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. ఇదే తరహాలో రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో తక్కువమంది ఉపాధ్యాయులుంటే.. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువమంది ఉన్నారు. ఆయా బడుల్లో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు అరకొర బోధన జరుగుతోంది. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**విద్యార్థులు లేక..**

గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జీవో 25 ప్రకారం విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులున్నారు. తాత్కాలిక బదిలీలతో కొందరు వేరే బడులకు వెళ్లడం, మరికొందరు దీర్ఘకాలిక సెలవుల్లో ఉండడంతో కొన్నింటిలో సంఖ్య తక్కువగా ఉంది. హైదరాబాద్ జిల్లాలోని పాతబస్తీ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని మండలాల్లోని పాఠశాలల్లో ఒక్కో తరగతిలో పట్టుమని పదిమంది విద్యార్థులు కూడా




లేరు. హైదరాబాద్ జిల్లాల్లో నాలుగు పాఠశాల్లో గరిష్ఠంగా ఒక తరగతిలో 18మంది విద్యార్థులున్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఆరు పాఠశాలల్లో పదిమంది చొప్పున పిల్లలున్నారు. ఆయా పాఠశాలల సమీపంలో ప్రైవేటు విద్యాలయాలు ఎక్కువగా ఉండడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు చొరవ చూపకపోవడంతో సంఖ్య పెరగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**పట్నంలోనే తిష్ఠ**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో 2568 ప్రభుత్వ పాఠశాలలుండగా... అందులో 70శాతం పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. కొత్తగా సర్వీసులో చేరిన ఉపాధ్యాయులు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు బాగా చదువు చెప్పగలిగిన ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో నియమించారు. వీరిలో కొందరు పల్లెలకు వెళ్లేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా బదిలీలు చేయించుకుని హయత్‌నగర్, సరూర్‌నగర్, శంషాబాద్, కొంపల్లి, బాలానగర్, ఉప్పల్ ప్రాంతాల్లోని పాఠశాలలకు వస్తున్నారు. విద్యాశాఖ అధికారులకు తెలిసినా.. ఉత్తర్వులుండడంతో వారిపై చర్యలు తీసుకోవడం లేదు.

# అసలే ఆలస్యం.. ఆపై నాణ్యత లోపం

కాగజ్‌నగర్ :ఇది కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి పల్లె దవాఖానా భవనం. మెట్లతోపాటు గచ్చు, గోడలు ఎక్కడికక్కడే పగుళ్లు తేలాయి. ఈ భవనాన్ని అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే ఆశయంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా స్థాయిని పెంచింది. కేంద్ర ప్రభుత్వం ఈ దవాఖానాల్లో మిడ్ లైఫ్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ అధికారి (సీహెచ్‌ఓ)ని నియమించారు. దీంతోపాటు భవనాల నిర్మాణాలకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను మంజూరు చేసింది. జిల్లాలో 39 భవనాలకు గాను.. ఒక్కోదానికి రూ.20 లక్షలు కేటాయించింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిర్మించిన కొన్నేళ్లకే అవి శిథిలావస్థకు చేరాయి. కొన్ని భవనాల నిర్మాణ పనులు పునాదుల స్థాయిని దాటకపోవడం గమనార్హం.

**ప్రారంభం కాని భవనాలు..**

జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలోని లింగాపూర్, వాంకిడి మండలం-చుంచుపెల్లి, పెంచికల్‌పేట్ మండలం-కమ్మర్‌గాం పల్లె దవాఖానా భవనాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. బెజ్జూరు మండలంలోని ఖర్జెల్లి, చింతలమానెపెల్లి మండలంలోని రవీంద్రనగర్ భవనాలు ర్యాంపు నిర్మాణ దశలోనే కొనసాగుతున్నాయి. బెజ్జూరు మండల కేంద్రంలోని భవనం స్లాబ్ దశలోనే మగ్గుతోంది. బెజ్జూరు మండలం కుకుడ, కుంటలమానెపెల్లి, దహెగాం మండల కేంద్రంలోని కుంచవెల్లిలోని భవనాలు తుది దశకు చేరుకున్నాయి.

అప్పగించడానికి సిద్ధంగా ఉన్నవి : దహెగాం మండలంలోని బీబ్రా, గిరవెల్లి, హత్తిని భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని.. సంబంధిత శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

అప్పగించినవి : కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ, భట్టుపల్లి,




కోసిని, వంజీరి, రెబ్బెన మండలంలోని రెబ్బెన, కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీరాంనగర్, కౌటాల మండలంలోని మొగడ్‌దగఢ్ భవనాలను అప్పగించారు. దహెగాం మండలంలోని ఇట్యాల, కౌటాల మండలం ముత్యంపేట, తిర్యాణి మండంలోని దేవాజీగూడ, ఉల్లిపిట్ట భవనాల్లో విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది.

టెండరు దశలోనే నిలిచినవి : పెంచికల్‌పేట్ మండలం సంజీవనగర్(చేడ్వాయి), రెబ్బెన మండంలోని నారాయణపూర్ భవనాలు టెండరు దశలోనే మగ్గుతున్నాయి.

ఈ విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సీతారాంను సంప్రదించగా.. అక్టోబర్‌లో వివిధ శాఖల భవనాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సమీక్ష నిర్వహించారన్నారు. అసంపూర్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయించడం, లోసుగులు ఉంటే ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

# కాసులిస్తేనే దస్త్రాలు కదిలేది



మల్యాల : మల్యాల తహసీల్దారు కార్యాలయంలో చేతులు తడపనిదే పనులు కావడం లేదన్న విమర్శలున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మొదలు పహాణీలు, విరాసత్, నాలా మార్పిడి తదితర పనులు జరగాలంటే డబ్బులివ్వాల్సిందేనని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు చెప్పిందే వేదంగా మారింది. రిజిస్ట్రేషన్ సమయంలో కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తిప్పుకొని బేరం కుదరగానే పని చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏ పనికి ఎన్ని రోజులు పడుతుందో తెలిపే సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. పలు గ్రామాల పరిధిలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఆరోపణలున్నా పరిరక్షణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**పహాణీనే మార్చేశారు**

సర్వాపూర్-తాటిపల్లి శివారులో ఇద్దరు రైతుల పేరిట ఉన్న భూమికి సంబంధించిన పహాణీలో మరో వ్యక్తి పేరును కార్యాలయంలో పని చేసే ఓ అధికారి ఇరికించి మార్చినట్లు(ట్యాంపరింగ్) తెలిసింది. అధికారుల తీరును యజమానులు ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. భూమి లేని వ్యక్తి పేరుతో పహణీ జారీ చేయడం వివాదాస్పదమైంది.

మ్యాడంపల్లికి చెందిన రైతు తన తండ్రి పేరిట ఉన్న వ్యవసాయ భూమిని విరాసత్ చేయించుకోవడానికి వస్తే అధికారులు మూడు నెలల పాటు తిప్పుకున్నారు. చివరికి ఓ మధ్యవర్తి ద్వారా భారీ మొత్తంలో ముట్టజెబితే పని చేసినట్లు సమాచారం.

కొన్ని సందర్భాల్లో డబ్బును కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగికి యూపీఐ ద్వారా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఏడాది కిందట ఓ రైతు నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేయడం అప్పట్లో తీవ్ర వివాదానికి దారి తీసింది.

పోతారం శివారులోని ప్రభుత్వ భూమిని తన పేరిట మార్చుకోవడానికి ఓ వ్యక్తి అధికారులను ఆశ్రయిస్తే రూ.లక్ష వరకు డిమాండు చేసినట్లు సమాచారం. బేరం కుదరకపోవడంతో దస్త్రాన్ని హోల్డ్‌లో పెట్టినట్లు ప్రచారం సాగుతోంది.

వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేయించడానికి అధికారుల పేరు చెప్పి దళారులు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

రైతులు సొంత భూమిని తమ అవసరాల మేరకు వ్యవసాయేతర(నాలా) భూమిగా మార్చుకోవడానికి చలానా ద్వారా రుసుం చెల్లించినా అధికారులు కొర్రీలు పెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వారం రోజుల కిందట మల్యాలకు చెందిన ఓ రైతు ఇంటి నిర్మాణ నిమిత్తం నాలా మార్పిడి కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

భూముల రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు వసూలు చేయడం లేదు. ఎవరైనా వసూలు చేసినా మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. అనుమానం కలిగితేనే భూమిని పరిశీలించి నిర్ధారించుకున్నాకే రిజిస్ట్రేషన్, విరాసత్ అమలు చేస్తున్నాం. పహాణీని ట్యాంపరింగ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన తర్వాతే నిర్ధారిస్తాం. భూభారతి, రెవెన్యూ సదస్సుల వల్ల కొన్ని సార్లు రిజిస్ట్రేషన్‌లో జాప్యం జరిగినా పెండింగ్‌లో ఉంచడం లేదు. కార్యాలయం బయట ఏం జరుగుతుందో తెలియదు. సిబ్బంది పనితీరుపై ఆరా తీసి అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

వసంత, మల్యాల తహసీల్దారు

# పల్లె పీఠం.. 'యువ' స్వామ్యం



కరీంనగర్ : నా పల్లె అభివృద్ధికి నోచుకోలేదని బాధపడ్డారు.. మురుగు కాలువలు లేవు.. రహదారులు అధ్వానమని ఆక్రోశించారు.. రాజకీయాలు చేస్తూ నాయకులు ప్రగతి మరిచారని ఆవేదన చెందారు.. ఇప్పుడు పల్లె సంగ్రామానికి తెర లేచింది.. ఆ పరిస్థితిని మార్చే అవకాశం వచ్చింది.. గ్రామాల అభివృద్ధికి మీ ప్రణాళిక వివరించండి.. ప్రజల మనసులు చూరగొనండి.. ప్రథమ పౌరులుగా ఎన్నికవండి మంచి పనులతో ప్రగతి బాట పట్టించండి యువత చేతుల్లోనే భవిత అన్న నినాదాన్ని నిజం చేయండి..

కొన్నేళ్లుగా పల్లెల్లో పంథా మారుతోంది. మూడు, నాలుగు దశాబ్దాల కిందట సర్పంచులుగా ఒకట్రెండు కుటుంబాల ఆధిపత్యం ఉండేది.. రిజర్వేషన్లతో పరిస్థితి మారుతూ వస్తోంది. ఈక్రమంలో చదువుకున్న యువత స్థానిక రాజకీయాల్లో మార్కు చూపిస్తోంది. పల్లెను బాగుపరచుకోవాలన్న తపన ఉన్నవారు తమ ప్రణాళికలు వివరించి ఓటర్ల మనసులు చూరగొంటున్నారు. గత ఎన్నికల్లో 30 శాతం యువత ఉమ్మడి జిల్లాలో ఈ అవకాశం దక్కించుకోగా ఈసారి మరింత మంది అవకాశం దక్కించుకునే దిశగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. 2019లో 1210 పంచాయతీలకు దాదాపుగా 7 వేలకుపైగా అభ్యర్థులు పోటీ చేస్తే అందులో డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివిన వారే దాదాపుగా 3 వేలకుపైగా ఉన్నారు. ఇక గెలిచిన వారిలో 60 శాతం మంది ఇంటర్ ఆపై చదివిన వారున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని, ఇతర ప్రభుత్వ కొలువులను, వ్యాపారాలను వదిలి గ్రామ ప్రథమ పౌరులుగా మారాలనుకునే వారూ పదుల సంఖ్యలో కనిపించారు. ప్రజాసేవనే పరమావధిగా భావించి నిస్వార్థంతో పని చేయాలనుకునే వారిని పల్లె జనం ఆశీర్వదిస్తున్నారు. అవకాశాన్ని కల్పిస్తున్నారు.

2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 40 ఏళ్లలోపున్నవారే దాదాపు 30 శాతం సీట్లను దక్కించుకున్నారు. విద్యాధికులు కావడం, పల్లె అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధతను గుర్తించి అవకాశమిచ్చారు.. ఇందులో చాలామంది అభివృద్ధిలో తమదైన మార్కు చూపించగా కొందరు మాత్రం రాజకీయాలకే పరిమితమయ్యారు.

ఈసారి పల్లె సంగ్రామంలోనూ అదే పరిస్థితి నెలకొంది. తొలివిడత నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన మొదటి రోజునే 398 సర్పంచి స్థానాలకు 258 మంది నామపత్రాలు సమర్పించారు. ఇలా నోటిఫికేషన్ వచ్చిన తొలిరోజునే ఉత్సాహాన్ని చూపిన వారిలో 39 ఏళ్లలోపు వారే దాదాపుగా 70 శాతం మంది ఉండటం గమనార్హం.

**యువతవైపు మొగ్గుకు కారణాలు**

పల్లెల్లో మొత్తం ఓటర్లు 20 లక్షల వరకు ఉండగా అందులో యువతే 9 లక్షలు.

సమకాలీన అంశాలపై పట్టు ఉండటం.

సమస్యలపై ప్రశ్నిస్తూ పరిష్కారానికి చొరవ చూపడం

# అధిక వసూళ్లు.. చెత్తతో కష్టాలు

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పురపాలిక పరిధిలో నిత్యం ఇంటింటా తిరుగుతూ తడి, పొడి చెత్తను సేకరించే ప్రైవేటు వ్యక్తులు ప్రజల నుంచి అధికంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. చెత్త సేకరణలో ప్రైవేటు వ్యక్తుల ఇష్టారాజ్యంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు.

తడి, పొడి చెత్త సేకరణను గతంలో ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఇందుకు ఇంటింటా చెత్త సేకరణకు పురపాలిక నుంచి 4 వాహనాలు, ప్రైవేటు ఏజెన్సీలకు చెందిన మరో 5 వాహనాల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నారు. తర్వాత ఏజెన్సీ నిర్వహణ కోసం ఇంటింటికీ రూ.40 వసూలు చేసేందుకు తీర్మానం చేశారు.

**తీర్మానం చేసినా..**

సుల్తానాబాద్ పురపాలికలో 15 వార్డులుండగా 6,100 నివాస గృహాలు, 376 వ్యాపార సముదాయాలున్నాయి. ఒక్కో ఇంటికి రూ.40 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా ఒక ఇంట్లో 4 కుటుంబాలు ఉంటే ఒక్కొక్కరి వద్ద రూ.50 చొప్పున రూ.200 వసూలు చేస్తున్నారు. లేదంటే చెత్తను తీసుకెళ్లేది లేదని ప్రజలకు తేల్చి చెబుతున్నారు.

**రోడ్లపై పేరుకుపోతుండగా..**

అదనంగా డబ్బులు వసూలు చేయడంతో ప్రజలు, వ్యాపారులు చెత్తను బండిలో వేసేందుకు విముకత చూపిస్తున్నారు. ఈ క్రమంలో వారితో వాగ్వాదాలు సర్వసాధారణంగా మారాయి. వారు అడిగినంత ఇవ్వకపోతే చెత్త బుట్టలను ఇంటి ముందు వదిలేసి వెళ్లిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో అనేక కాలనీల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది.



**మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం**

ఇంటింటా చెత్త సేకరించే ప్రైవేటు ఏజెన్సీల వ్యక్తులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరించే వారికి ఇంటికి రూ.40 మాత్రమే చెల్లించాలి. అదనంగా డబ్బులు వసూలు చేస్తే పురపాలిక కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి.

టి.రమేశ్, కమిషనర్

# అధికారి బదిలీ.. కట్టేశారు ప్రహరీ

హైదరాబాద్ : ప్రభుత్వ భూములపై కన్నేసిన అక్రమార్కులు అదునుచూసి కబ్జా చేశారు. ఘట్‌కేసర్ మండలం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి సమీపంలోని కొర్రెముల రెవెన్యూ పరిధి చౌదరిగూడలో రూ.10 కోట్ల విలువైన 2వేల గజాలను ఆక్రమించారు. తొమ్మిదేళ్ల నుంచి ఆక్రమణకు ప్రయత్నిస్తుంటే..అప్పటి తెదేపా నేత రేవంత్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా.. స్వయంగా ఆయన ఆందోళన చేపట్టారు. కబ్జాలకు గురికాకుండా రక్షించారు. తాత్కాలికంగా ఆగిన అక్రమార్కులు సమయం కోసం ఎదురుచూస్తున్నారు. సదరు ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేసిన ఘట్‌కేసర్ తహశీల్దార్ విజయలక్ష్మి



ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో ఆ బోర్డులను తొలగించి రెండు రోజుల్లో 2వేల గజాలను ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు.

**సర్కారు భూముల్లో లే-అవుట్లు..**

ఓఆర్ఆర్, జాతీయ రహదారి రెండూ కలిసి రావడంతో చౌదరిగూడలోని సర్వే నంబర్ 867లో పదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఆరేళ్ల క్రితం లేఅవుట్ చేసి అమ్మేశారు. కాంగ్రెస్ నాయకులు అప్పట్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. తెదేపా తరపున రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఐదు మంది స్థిరాస్తి వ్యాపారులపై ఘట్‌కేసర్ ఠాణాలో కేసు నమోదయ్యింది. అప్పటి నుంచి కబ్జాలు ఆగిపోయాయి. చౌదరిగూడ గ్రామం పోచారం మున్సిపాలిటీలో విలీనం కావడంతో అక్రమార్కులు మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సర్వే నంబర్ 867లో 100 గజాల స్థలంలో గృహ నిర్మాణానికి అధికారికంగా అనుమతులు ఇచ్చారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో అక్రమార్కులు లే-అవుట్లు చేసి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఘట్‌కేసర్ తహశీల్దార్ అక్కడ ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు. ఆమె బదిలీ కాగానే చకచకా పావులు కదిపి ఆక్రమణకు తెరతీశారు.

# జాగా చూస్తారు.. పాగా వేస్తారు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. ముందుగా షెడ్డు వేసి.. కబ్జా చేసేస్తున్నారు. కన్నాల శివారులో ఇటీవల ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అయినా సర్వే నెంబరు 60, 112లో ఇంకా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టణంతోపాటు మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా ఇప్పటి వరకు ఆక్రమణదారులపై అధికారులు ఒక్క కేసు నమెదు చేయలేకపోయారు.

**రడగంబాలబస్తీలో అయిదెకరాలు..**

పట్టణంలోని రడగంబాలబస్తీలో అయిదెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఇక్కడ తాత్కాలిక షెడ్లను పూర్తిగా రేకులతో నిర్మిస్తున్నారు. దట్టంగా ఉన్న ముళ్లపొదల మధ్యలో రేకుల షెడ్లను వేసి భూములను ఆక్రమిస్తున్నారు. కొంతమంది నేతలు గుంటకు రూ.లక్ష చొప్పున విక్రయిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికిప్పుడు నివాసముండే పరిస్థితులు లేకున్నా స్థలం దక్కుతుందనే ఆశతో నిరుపేదలు కొనుగోలు చేసి



నష్టపోతున్నారు. నిత్యం ఇక్కడ ఏదో చోట ఘర్షణలు, పంచాయితీలు చోటు చేసుకుంటున్నాయి. దీని పక్కనే గతంలో రాజీవ్‌గృహకల్ప ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు.

పర్యవేక్షణ కరవై..

రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో నిత్యం కబ్జాల పర్వం కొనసాగుతోంది. అధికారులు కొన్ని చోట్ల కూల్చివేస్తున్నా.. అక్రమార్కులు మాత్రం ఆపడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారం, అర్థ బలం ఉంటే చాలు రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లడానికి జంకుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం.. : కృష్ణ, తహసీల్దార్**

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. రడగంబాలబస్తీలో సర్వే నెంబరు 170లో ఆక్రమణలను తొలగిస్తాం. ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తాం. ఇప్పటికే పట్టణంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం.

# పాటలు లేవు.. కేవలం మాటలే..!

ఆదిలాబాద్ : ఎన్నికలనగానే గ్రామాల్లో వేకువజాము నుంచే పాటలతో హోరెత్తించడం.. రాత్రివరకు ప్రచార రథాలు తిరుగుతూ సందడి చేయడం చూస్తుంటాం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ పేర్లమీద ప్రత్యేకంగా పాటలు తయారు చేసి మరీ లౌడ్ స్పీకర్ల ద్వారా ఊర్లలో వినిపిస్తూ హంగామా చేస్తుంటారు. హైదరాబాద్ వెళ్లి మరీ పాటలు తయారు చేయించడం పరిపాటిగా మారింది. సర్పంచి ఎన్నికలు పార్టీ గుర్తులతో సంబంధం లేకున్నా ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా తెలియజేసేందుకు పార్టీపరంగా తయారైన పాటలతో హోరెత్తిస్తూ చేసిన ప్రచారాలను అందరూ చూశారు. ఈసారి మాత్రం ప్రచారంలో భిన్నమైన శైలి కనిపించనుంది. ఈ ఎన్నికల్లో పాటలు ఉండకపోవడం అందరినీ ఆశ్చర్యపర్చనుంది.కేవలం ప్రసంగాలే : లౌడ్‌స్పీకర్లకు అనుమతి తీసుకున్నాక పోటీచేసే అభ్యర్థులు వాటి ద్వారా తమ ప్రసంగాలనే వినిపించాలి.. లేకపోతే రికార్డింగ్ చేసిన ఉపన్యాసాలతో ప్రచారం చేయాలి. పాటలు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో ఉండొద్దు.. తద్వారా ఉదయం నుంచి రాత్రి వరకు ఊర్లలో సంగీతంతో ఉండే హంగామా ఇక మూగబోనుంది. ఇటు బరిలో ఉండే అభ్యర్థులు ప్రత్యేకంగా పాటలు తయారు చేయించుకోవాల్సిన అవసరం ఉండదని తెలుస్తోంది. ఈ లౌడ్‌స్పీకర్లు సైతం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్యనే ఉపయోగించాలి. బహిరంగ సభలు, రోడ్డుషోల వద్ద మాత్రం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వినియోగించే వెసులుబాటు కల్పించారు. పోలింగ్ కంటే 44 గంటల ముందు ప్రచారం ముగించాలి. అదే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మాత్రం 48 గంటల గడువు విధించారు.

చురకలు

బుధవారం 3 డిసెంబర్ 2025

# ఆగని వివక్ష!

పెద్దపల్లి : పెద్దపల్లి ప్రాంతానికి మంజూరైన చాలా కార్యాలయాలు, నిర్మాణాలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా ఈ ప్రాంతవాసులు వివక్షకు గురవుతూ నష్టపోతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని కార్యాలయాలు, వసతులు ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. తాజాగా గతంలో ఇక్కడి నుంచి తరలించిన ఆర్పీఎఫ్ అవుట్‌పోస్టు ఇదే తరహాలో మరోచోట ఏర్పాటు చేశారు.

**అడిగేవారేరీ..** పెద్దపల్లికి నలభై ఏళ్ల కిందట ఆర్టీసీ బస్‌డిపో మంజూరైంది. గతేడాది డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఏడాది గడిచినా పనులు ప్రారంభం కాలేదు. 20 ఏళ్ల కిందట మినీ స్టేడియం మంజూరైంది. కానీ నిధులు వెనక్కి వెళ్లి ఇప్పటి వరకు ఎలాంటి స్టేడియం నిర్మాణం జరగలేదు. రాజీవ్‌రోడ్డు నిర్మాణ సమయంలో స్టేట్ హైవే అథారిటీ కార్యాలయాన్ని ఏర్పాటు



చేశారు. కొన్నాళ్లకే ఇక్కడి నుంచి జగిత్యాలకు అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో జిల్లాలో హైవేల నిర్మాణం ప్రక్రియ అటకెక్కింది. 2003లో బైపాస్ రోడ్డు మంజూరైంది. గతేడాది బైపాస్ నిర్మాణానికి ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ సర్వే పనులు మొదలు కాలేదు.

**రైల్వేలోనూ..**

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌పై రైల్వేశాఖ మొదటి నుంచి వివక్ష ప్రదర్శిస్తుంది. రైళ్ల హాల్టింగ్‌లు నుంచి వసతుల కల్పన వరకు ఇది కొనసాగుతోంది. గతంలో ఇక్కడి హాల్టింగ్‌లు ఒక్కొక్కటిగా తరలిపోయాయి. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపిన మొదటి ఎక్స్‌ప్రెస్ హిమసాగర్‌కు వరంగల్ తర్వాత మొదటి హాల్టింగ్ పెద్దపల్లి మాత్రమే. కానీ ఈ హాల్టింగ్ ఎత్తేశారు. చివరికి కరోనా కంటే ముందు వరకు హాల్టింగ్ కలిగిన పలు రైళ్ల హాల్టింగ్‌లను ఇప్పటి వరకు పునరుద్ధరించలేదు. తాజాగా పదేళ్ల కిందట ఎత్తేసిన రైల్వే భద్రత దళం అవుట్‌పోస్టుపై ఇన్నాళ్లు పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి. తాజాగా కరీంనగర్ స్టేషన్‌లో ఆర్పీఎఫ్ అవుట్‌పోస్టును ప్రారంభించారు.

# దూదీ.. ఏదీ..!

మిర్యాలగూడ : మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. పర్వదినాలు, సోమవారాల్లో ఉమ్మడి జిల్లాలోని బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో వారు అనేక అవస్థలు పడుతున్నారు. బస్సుల్లో నిలబడి ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చిన్నచిన్న ప్రమాదాలు జరిగిన సమయాల్లో చికిత్స అందించేందుకు బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు ఉండాలి. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నడుస్తున్న బస్సుల్లో 70 శాతం పైగా ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం గమనార్హం. చిన్న చిన్న గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు సదరు పెట్టెలో అవసరమైన మందులు, కాటన్, కట్టు




కట్టే వస్త్రం వంటివి అందుబాటులో ఉంచాలి.

ఇటీవల కొత్తగా వచ్చిన బస్సులు మినహాయిస్తే బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోగా.. ఉన్న బస్సుల్లో వాటిని సిబ్బంది మందులకు బదులుగా టిక్కెట్ ముద్రణ కాగితం, ఇతర సామగ్రి దాచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. లక్షలాది మంది ప్రయాణికులు నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో ఎవరో ఒకరు ఏదో ఒక చోట ప్రమాదాల బారిన పడుతూ గాయాలపాలవుతుంటారు. ఈ సమయంలో ప్రథమ చికిత్స పెట్టెల్లో వైద్య సామగ్రి ఉంటే ఎంతో మేలు కలుగుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

**పెట్టెల ఏర్పాటుకు చర్యలు...**

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ.

కొత్తగా వచ్చిన బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉన్నాయి. పాత వాటిలో గడువు తేదీ ముగిసిన వాటిని తొలగిస్తున్నాం. త్వరలోనే అన్ని బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు, వాటిలో సామగ్రి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం.

# రెచ్చిపోతున్న.. రాచపుండు

నిజామాబాద్ : క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధే కాని.. తొలిదశలో గుర్తిస్తే నివారణ ఎంతో సులువు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడితో జిల్లాలో బాధితుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఆరోగ్య సంరక్షణ, బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేటి 'ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవ' కథనం.

దాచుకుంటే.. కుంగదీస్తుంది..జిల్లాలో గత సంవత్సరం ఆశా కార్యకర్తలు క్యాన్సర్ బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. 10,200 మందిలో ప్రాథమిక లక్షణాలను గుర్తించారు. తుది నిర్ధారణ పరీక్షలను ఏడుగురికి నిర్వహించారు. ఆడవాళ్లలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బయటపడుతోంది. పురుషుల్లో నోరు, ఊపిరితిత్తులకు వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తోంది. ఈ మధ్య కాలంలో ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ తినేవారిలో జీర్ణాశయ, అన్నవాహిక, పెద్దపేగు క్యాన్సర్లు పెరిగినట్లు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఉన్నత స్థాయి, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు సమస్య ఉన్నా బయటకు చెప్పుకోవడం లేదని, ఇది ప్రాణాపాయాన్ని కొనితెస్తుందని అన్నారు.

**సగం మంది ఆడవాళ్లే**

జిల్లాలోని క్యాన్సర్ బాధితుల్లో 50 శాతం మంది మహిళలే

60శాతం మందికి సర్వైకల్ క్యాన్సరే నిర్ధారణ అవుతోంది

మరో 30 శాతం రొమ్ము, పది శాతం ఇతర క్యాన్సర్ కేసులు బయటపడుతున్నాయి

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితుల్లో 80 శాతం మంది కోలుకుంటున్నారు.

అధునిక టీకాలతో కేసులు తగ్గాయి

క్యాన్సర్ కేసులు పెరగడంతో ప్రభుత్వం గత నెలలో జీజీహెచ్‌లో ప్రత్యేక చికిత్సా విభాగాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి.. కీమోథెరపీ, ఇతర చికిత్సలను జీజీహెచ్‌లో అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 85 మందికి ఉచిత చికిత్స అందుతోంది. స్త్రీలు రొమ్ము క్యాన్సర్ బారినపడకుండా మమోగ్రఫీ విధిగా చేయించుకోవాలి. సర్వైకల్ క్యాన్సర్‌ను 'పాప్ స్మియర్' టెస్ట్‌తో గుర్తించడం తేలిక. –డా. చైతన్య, క్యాన్సర్ వైద్య నిపుణుడు

# విలాసాలే లక్ష్యం.. 'మత్తు'మార్గం!



హైదరాబాద్: తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. పేదరికం.. చెడు స్నేహాలు యువత తప్పటడుగులు వేసేందుకు కారణాలుగా భావించేవారు. ఇటీవల సైబర్‌క్రైమ్, డ్రగ్ స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడుతున్న వారిలో అధికశాతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు ఉంటున్నారు. ఒక్క సంపాదన, ఈఎంఐలతో బతుకీడ్చటం నచ్చని వారు.. విలాస జీవితాన్ని ఆస్వాదించేందుకు అక్రమ కార్యకలాపాలను ఎంచుకుంటున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. అరెస్ట్ చేస్తున్న ప్రతి వెయ్యి మందిలో 800 మంది 25–40 ఏళ్ల మధ్య వయస్కులే. వీరందరి నోట వచ్చిన ఒకేమాట.. 40 ఏళ్ల లోపు ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాత ఏ కష్టం చేయకుండా గడిపేయాలంటూ చెప్పటం ఆశ్చర్యానికి గురి చేసిందని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. నగదు స్వాధీనం చేసుకునేఅవకాశం లేకుండా క్రిప్టో రూపంలో మార్చేస్తున్నారు. విదేశాల్లోని మిత్రులను బినామీలుగా మార్చి ఆస్తులు బదిలీ చేస్తున్నారు.

**ఎంజాయ్ చేయాలని..**

చెన్నైకు చెందిన రాహుల్(31).. ఉన్నత విద్య పూర్తిచేశాడు. నెదర్లాండ్స్‌లోని ప్రముఖ కంపెనీలో భారీ వేతనంతో కొలువు సంపాదించాడు. పబ్‌లో సరదాగా తీసుకున్న డ్రగ్స్‌కు బానిసగా మార్చాయి. నెమ్మదిగా పెడ్లర్‌గా అవతారమెత్తాడు. హెరాయిన్, కొకైన్ పెద్దఎత్తున తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. రెండుచేతుల సంపాదన.. వారాంతం ఇష్టమైనచోట వినోదాల విందు. రెండేళ్లకే రూ.కోటి చేసుకున్నాడు. నగరంలోని కొనుగోలుదారులకు డ్రగ్స్ ఇచ్చేందుకువచ్చి హెచ్‌న్యూపోలీసులకు చిక్కాడు. ఇదేబాటలో ఐటీఉద్యోగి రాహుల్, డీజే సిద్దార్థ, వ్యాపారి సంజయ్ మెహ్రా, ప్రైవేట్ ఉద్యోగి జాన్సన్‌రాజ్ డ్రగ్స్, క్రిప్టో కరెన్సీ మార్పిడితో అక్రమాలకు పాల్పడుతున్నారు.

**నగదు డ్రాతో ఊచలు..**

బిహార్‌కు చెందిన రంజీ క్రికెటర్ రిషి తుషార్(30). బరోడా జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఇంజినీరింగ్ చదివిన ఆయన ఉద్యోగం చేస్తే వచ్చే చాలీచాలని జీతం వద్దనుకున్నాడు. గోవాలో పరిచయమైన సైబర్ నేరస్థులతో చేతులు కలిపి విదేశీ ఫోన్‌నంబర్లతో సామాజిక మాధ్యమాల గ్రూపులు రూపొందించి వేల మంది అమాయకులకు లాభాల వల విసిరి మోసాలకు సహకరించాడు. వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చటం, అక్కడ జమ చేసిన నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్చి విదేశాలకు తరలిస్తూ రూ.లక్షల సంపాదనకు అలవాటుపడ్డాడు. ఒక బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా చేసిన నగదు ఇతడిని సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టిచ్చింది.

# ఇంతింతా వచ్చి.. అంతా ఆక్రమించి!



తాండూరు: జిల్లాలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా సంబర్భాల్లో ఆక్రమణలను నిర్ధారించుకోకుండా రెవన్యూ అధికారులు పట్టాలు జారీ చేస్తుండడంపై ఇటీవల హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రెవెన్యూ, నీటి పారుదల శాఖల సమన్వయ లోపంతో అడ్డులేకుండా పోతోందన్న విమర్శలున్నాయి.

**పొలాల్లో కలిసిపోతున్న శిఖం భూములు..**

గ్రామాలకు దూరంగా ఉండే చెరువుల శిఖం భూములను ఆనుకునే వ్యవసాయ పొలాలున్నాయి. రాజకీయ అండదండలున్న కొందరు శిఖం భూములను పొలాల్లో కలిపేసుకుంటున్నారు. దీనికి కొందరు రెవెన్యూ అధికారులు వంత పాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు సమీపంలోని చెరువు శిఖం భూముల్లోనైతే ఏకంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. వరద కాలువలను సైతం ఆక్రమిస్తున్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద పారే పరిస్థితులు లేకపోవడంతో ముంపు సమస్య తలెత్తుతోంది. సమీప పొలాలు, కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. తాండూరులో ఇప్పటికే మూడు కుంటలు కనుమరుగయ్యాయి.

**ఎక్కడెక్కడ..**

యాలాల మండలం కోకట్ చెరువు శిఖం భూమి 12 ఎకరాలుంటుంది. ఇప్పటికే ఎకరం భూమి ఆక్రమణకు గురైంది. స్థిరాస్తి వ్యాపారులు దీన్ని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఇప్పటికీ కొంత శిఖం భూమిలో నాపరాళ్ల వ్యర్థాలు, సుద్ద పోసి ఆక్రమణకు పాల్పడేందుకు తతంగం నడుపుతున్నారు.

వికారాబాద్ శివారెడ్డి పేటలో 11 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో లేఅవుట్లకు అనుమతి ఇవ్వడంతో ప్లాట్లు చేశారు. పరిగిలోని రుకుంపల్లి గేటు సమీపంలో చెరువు శిఖం భూమి 42 ఎకరాలు. ప్రస్తుతం 14– 20 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలింది ఆక్రమణకు గురైంది.

తాండూరు పట్టణంలోని గొల్లచెరువు శిఖం భూమి 78 ఎకరాలు. పదెకరాలు ఆక్రమణకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కడుతున్నారు.

ఏక్తా ఫసల్ కింద పంటలు సాగు చేయొచ్చు..

చెరువులు, కుంటల్లో నీరు లేకుంటే పంటలు పండించి ఆర్థికంగా లబ్ధి పొందొచ్చు. కొందరు సొంతానివని అమ్ముకొని సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మండలాలు: 20

చెరువులు, కుంటలు: 1,124

**రెవెన్యూ, పురపాలిక అధికారులకు ఫిర్యాదు చేశాం..**

– శిరీష, డీఈఈ, నీటిపారుదల శాఖ, తాండూరు

తాండూరు గొల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పురపాలిక, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. గొల్లచెరువు ఆక్రమణలకు సంబంధించి సంయుక్త సర్వేకు రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. ఎవరైనా శిఖం భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

# అనుమతి లేకపోతే బాదుడే



కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల్లో నూతన భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొత్తగా ఇంటిని నిర్మించుకునే కొందరు పట్టణ ప్రణాళిక ద్వారా అనుమతులు తీసుకోవడంలేదు. మరికొందరు అనుమతి ఒకలా, నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. అనుమతి కోసం వస్తే నిబంధనల పేరిట ముప్పు తిప్పలు పెడతారని, పెద్ద ఎత్తున ఫీజు చెల్లించాల్సి వస్తుందనే భయంతో అధికారుల వద్దకు రాకుండా, ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి ఎంతో కొంత అందించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. కానీ ఆ తర్వాత వచ్చే చిక్కులు మాత్రం గుర్తించడం లేదు.

**ఆస్తిపన్నులో వందశాతం జరిమానా**

రూ.లక్షలు ఖర్చు చేసి అనుమతి లేకుండా అన్ని హంగులతో భవనాలు నిర్మించుకుంటున్నారు. ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ విషయం బయటపడుతోంది. అనుమతి పత్రం లేకపోతే ఆస్తిపన్ను మదింపులో జరిమానా విధిస్తారని తెలుసుకోవడం లేదు.

మొత్తమే అనుమతి లేకపోతే వందశాతం, అదనపు నిర్మాణాలుంటే 25–75 శాతం అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ భవనాలకు జాతీయ బ్యాంకుల్లో రుణాలూ మంజూరు కావు. ఈ విషయం తెలియక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని పురపాలికల్లో నాలుగేళ్ల వ్యవధిలో భవన నిర్మాణానికి 7,144 దరఖాస్తు చేయగా 5,261 అనుమతులు ఇచ్చారు. 1,883 అర్జీలను తిరస్కరించారు. వీరంతా భవనాలు నిర్మించుకొని పరోక్షంగా ఆస్తిపన్నులో జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కరీంనగర్‌లో అక్రమ నిర్మాణాల సంఖ్య లెక్కనే లేదు. వేల సంఖ్యలో ఉన్న ఇళ్లకు జరిమానా పడుతుందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరముంది.

కొత్తగా బిల్డ్ నౌ ద్వారా అనుమతి

కొత్త పురపాలక చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక విధానం రావడంతో నిర్దిష్ట సమయంలో అనుమతులు జారీ చేసేలా సులువు పద్ధతులు తీసుకొచ్చారు. సెప్టెంబరు 15లోపు టీజీబీపాస్ ద్వారా అనుమతులు ఇవ్వగా, ఆ తర్వాత నుంచి బిల్డ్ నౌ ఆప్, పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణ ప్రణాళిక అధికారులు మాత్రం ఏ విధానం వచ్చినా సరే పరిశీలించడంలో జాప్యం చేస్తున్నారు.

# ముగ్గు పోయరు.. మొగ్గు చూపరు..!

సూర్యాపేట: ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా మొదటి విడతలో పైలట్ గ్రామాలను ఎంపిక చేసి వారికి ధ్రువపత్రాలు అందజేయగా.. వారు నిర్మాణం చేపడుతున్నారు. ఇక రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా జాబితా ప్రకారం అర్హులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. నిబంధనల ప్రకారం ప్రొసీడింగ్ కాపీలను అందించిన 40 రోజుల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది. పనులు చేపట్టకుంటే వారిని తిరస్కరించి ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ జిల్లాలో మాత్రం అలాంటి వారి వివరాల సేకరణే మొదలు పెట్టలేదు. దీంతో అర్హుల జాబితాలో ఆ తర్వాత స్థానాల్లో ఉన్న తమకు అందని ద్రాక్షగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రెండో విడతలో ఇళ్లకు సంబంధించి అర్హులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి 70 రోజులు అవుతోంది. వారి



జాబితాను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు సేకరించి గృహ నిర్మాణశాఖ అధికారులకు, ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ఆ తరవాత వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తిరస్కరణ కోసం వారికి సంతకం తీసుకోవాల్సి ఉంది. కానీ కొందరు లబ్ధిదారులు సంతకం పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించడడానికి వీలు లేకుండా పోయింది.

**ఈ నెల అవకాశం ఇస్తున్నాం**

సిద్దార్థ, హౌసింగ్ పీడీ, సూర్యాపేట

అర్హులను ఎంపిక చేసి ప్రొసీడింగ్ కాపీలను అందించాం. ఈ కాపీలు అందుకున్న 40 రోజుల్లో ఇళ్లు ప్రారంభించకుంటే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. కాగా కొందరు ఇంటి నిర్మాణానికి సుముఖంగా లేరు. వారి వివరాలు ఎంపీడీవోల వద్ద నుంచి రావాల్సి ఉంది. ఈ నెల వరకు వారికి అవకాశం కల్పిస్తున్నాం. లేనట్లయితే తిరస్కరించి కొత్త వారికి అవకాశం కల్పిస్తాం.

# బకాయిలున్నా.. భరించాల్సిందేనా..!

హుజూర్‌నగర్: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలలో కోతలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. మరో వైపు యాసంగిలో మిల్లులకు ఇచ్చిన సీఎంఆర్ ఇంకా పూర్తి కాలేదు. అది పూర్తి చేయకపోతే కొత్త సీఎంఆర్ ఇవ్వబోమని అధికారులు అంటున్నా.. సీజన్ ముమ్మరంగా జరిగే సమయంలో ధాన్యం తీసుకోక, కేటాయింపులు చేసుకోక తప్పని పరిస్థితి ఉంది.



అధికారులు గత నెలలో విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఉమ్మడి జిల్లాలో గత వానాకాలం సీఎంఆర్ లక్ష్యంలోనూ ఇంకా కొంత మేరకు బకాయిలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నుంచి దాదాపు 30 శాతం, యాదాద్రి జిల్లా నుంచి 13 శాతం బకాయిలు ఉన్నాయి. ఇక యాసంగికి సంబంధించి సూర్యాపేట జిల్లా నుంచి కేవలం 22 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయింది. నల్గొండ 58 శాతం, యాదాద్రి జిల్లా నుంచి 39 శాతం మాత్రమే వసూలయ్యాయి. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం రాకడ ప్రారంభమైంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. బకాయిలు భారీగా పేరుకుపోవడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.

# ఆసుపత్రి నిధుల స్వాహా గుట్టు!

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాసుపత్రి నిధుల 'గోల్‌మాల్' వ్యవహారం ఇంకా ఎటూ తేలడంలేదు. నిధులను కాజేసిన కొందరిపై రెండేళ్ల కిందట విచారణ జరిగింది. అక్రమాలు నిజమేనని విచారణాధికారులు తేల్చారు. అయినా ఇప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. విలువైన ప్రజాధనం ఇష్టానుసారంగా పక్కదారి పట్టినా.. కనీసం ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

**రసీదుల్లేకుండానే..** రోగుల అవసరాల కోసం వచ్చిన డబ్బులను ఎలాంటి రసీదుల్లేకుండానే జిల్లాసుపత్రిలో కీలకంగా వ్యవహరించిన కొందరు కాజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద వచ్చిన సొమ్ము విషయంలో ఎలాంటి లెక్కలను నమోదు చేయలేదు. ఆడిట్‌లలో బయటపడ్డ లొసుగులను లోలోపల సమసిపోయేలా చేశారు. 2023లో ఓ మహిళా ప్రజాప్రతినిధి ఆసుపత్రిలో అధికారుల పనితీరు బాగాలేదని, జవాబుదారీతనం కొరవడుతోందని, నిధుల ఖర్చు ఇష్టానుసారంగా ఉంటుందంటూ అప్పటి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అప్పటి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి లలితాదేవి 2023 డిసెంబరు 20న విచారణ చేపట్టారు. అప్పటి సూపరింటెండెంట్‌తోపాటు అభియోగాలు వచ్చిన కీలక విభాగాల అధికారులను విచారించారు.

**ఎవరి ఒత్తిడితో..** విచారణానంతరం అప్పటి కలెక్టరు, డీహెంహెచ్‌వోలపై కొందరు రాజకీయ నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడితోనే ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఏడాదికి రూ.50–80 లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.2 కోట్ల మేర అవినీతి జరిగిందనే గతంలో ప్రచారం నడిచింది. ఆ నివేదికలను కూడా బయటకు రాకుండా కొందరు చక్రం తిప్పారు. ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్న కొందరు ఉన్నతాధికారులు ఈ పక్కదారి పట్టిన నిధుల ప్రస్తావన తెరమీదకు రాకుండా కలెక్టర్లపై ఒత్తిడి చేశారనే ప్రచారముంది. తాజాగా ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధి శేఖర్ ఈ నిధులను రికవరీ చేయాలని పోరాటం చేస్తుండటంతో ఏ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాలి. **లెక్కలేని ఖర్చు..** 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆసుపత్రి అభివృద్ధికి ఎన్‌హెచ్‌ఎం, కాయకల్ప కింద రూ.1.25 కోట్ల నిధులొచ్చాయి. ఇందులో రూ.93.19 లక్షలను వివిధ అవసరాల కోసం ఖర్చు చేశామని లెక్కలు చూపించారు. వీటికి రసీదుల్లేనే లేవు. నిధులకు సంబంధించి విచారణాధికారులకు రికార్డులను అందించలేకపోయారు.

# ఇంగిలాయి... లాభమేనోయి

మండవల్లి : ఆక్వా రంగంలో రైతులంతా వనామీ రొయ్యలు, తెల్లచేపల సాగుతో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందుల నుంచి విముక్తి పొంది స్థిరమైన ఆదాయాన్ని సాధించేందుకు మండవల్లి మండలం భైరవపట్నంకు చెందిన కూనపరాజు నాగరాజు కొత్త రకం చేపల సాగుపై దృష్టి సారించారు. పూర్వం కొల్లేరు ప్రాంతంలో విరివిగా లభించి నేడు కనుమరుగైన ఇంగిలాయి(సింగి) చేపలను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. మంచి దిగుబడులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**వనామీతో విసుగు చెంది..**

రైతు నాగరాజు నాలుగేళ్లుగా వనామీ రొయ్యల సాగులో ఒడుదొడుకులతో విసుగు చెందారు. డిమాండ్ ఉన్న చేపల సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లోని ఆక్వానెస్ట్ హేచరీ సహకారంతో మండవల్లి మండలం గన్నవరంలో రెండెకరాల్లో ఇంగిలాయి చేపల సాగు చేపట్టారు. సాధారణంగా ఇతర చేపలు, పురుగులను వేటాడి తినే ఈ చేపలకు ఫ్లోటింగ్ పెల్లెట్‌ను అలవాటు చేయడంతో



ఇబ్బందులు తగ్గినట్లు చెప్పారు.

**కోల్‌కతా మార్కెట్‌కు..**

ఇంగిలాయి చేపల్లో ఔషధ గుణాలు ఉన్నట్లు బెంగాలీల నమ్మకం. దీంతో కోల్‌కతా నుంచి నేరుగా వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క ఆకివీడు, భీమవరంలో ఉన్న ట్రేడర్స్ సైతం కోల్‌కతాకు బతికి ఉండగానే చేపలను ఎగుమతి చేస్తున్నారు. నాగరాజు ఎనిమిది నెలల సాగు కాలంలో నాలుగు సార్లు పట్టుబడి చేసి ఏకంగా 9.5 టన్నుల దిగుబడి సాధించారు. కిలోకు రూ.320 నుంచి 350 వరకు మార్కెట్ ఉంటుంది. మంచినీటి సదుపాయం ఉంటే ఆరు నెలల్లోనే పట్టుబడి చేసే వీలుంటుంది.

**ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం**

మూడెకరాల్లోపు ఉన్న చిన్న చెరువుల్లో ఇంగిలాయి చేపల పెంపకం ఎంతో అనువుగా ఉంటుంది. ప్రతి 15 రోజులకు మంచినీటి మార్పు చేయాలి. కొంగలు, కాకుల నుంచి రక్షణకు చెరువుపై వలలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. అన్ని కలిసి వస్తే ఖర్చులన్నీ పోయి ఎకరానికి రూ.2 లక్షల వరకు లాభం సాధించవచ్చు. మార్కెటింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేవు.' అని కూనపరాజు నాగరాజు తెలిపారు.

# పల్లె వైద్యం.. కాసుల కష్టం


ఆదోని: ప్రభుత్వ ఆస్పత్రులకు అభివృద్ధి నిధులు అందలేదు. దీంతో అప్పు చేసి వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మూడు, ఆరు నెలలకోసారి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా నిధులు విడుదల చేయాల్సి ఉంది. రెండు త్రైమాసికాలు దాటిపోయాయి.. 2025 సంవత్సరం ముగింపునకు చేరినా.. నయా పైసా అందలేదు. దీంతో రోగులకు అవసరమైన తాగునీరు మొదలుకొని శుభ్రతకు వినియోగించే ఫినాయిల్ వరకు అప్పుచేసి కొనాల్సి వస్తోంది. లేదంటే వైద్యులు, సిబ్బంది జేబు నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆదోని మండలం పెద్దతుంబలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 50- 60 మంది రోగులు వస్తారు. ఇక్కడి ల్యాబ్‌లో రోగుల నుంచి సేకరించిన నమూనాలు, వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్ లేదు. ఫార్మసీ విభాగంలోని పెద్ద రిఫ్రిజిరేటర్లో భద్రపర్చాల్సి వస్తోంది. ఆ గది నిత్యం తెరిచి ఉండదు. అవసరమైన ప్రతిసారి అక్కడి వెళ్లి తెచ్చుకోవడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

**ఏ కేంద్రానికి ఎంతిస్తారు**

ఏడాదికి సీహెచ్‌సీకి రూ.3- 4 లక్షలు, పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు, పట్టణ ఆరోగ్య కేంద్రానికైతే రూ.50 వేలు కేటాయిస్తారు. వీటితో రోగులకు తాగునీటి వసతి కల్పించడం, ఫినాయిల్, స్టేషనరీ కొనుగోలు, ఓపీ చీటీలు, ఓపీ దస్త్రాలు, కంప్యూటర్ మరమ్మతులు, ప్రింటర్ క్యాట్రిడ్జ్, అంతర్జాల బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

అత్యవసర సమయంలో మందుల కొనుగోలు, ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులకు అత్యవసరమైతే రవాణా ఖర్చులు భరించాలి.

జిల్లా కేంద్రం నుంచి ఔషధాలు తెచ్చుకునేందుకు రవాణా ఖర్చులు, ఆస్పత్రుల్లో చిన్నపాటి మరమ్మతులు చేయించడం, గ్రామాలకు వ్యాక్సిన్ల తరలింపు, పైఅధికారులు సందర్శనకు వచ్చినప్పుడు ఏర్పాట్లు.. తదితర



వాటికి వీటి నుంచే వెచ్చించాల్సి ఉంటుంది.

సొంత డబ్బుతో పీహెచ్‌సీల నిర్వహణ

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పీహెచ్‌సీకి ఈ ఏడాది నిధులు రాకపోవడంతో కర్నూలు నుంచి మందులు తెచ్చుకునేందుకు.. పేపర్లు, ప్రింటర్ ఇంకులు, అంతర్జాల బిల్లలకు ఇప్పటి వరకు వైద్య సిబ్బంది రూ.50 వేలు సొంతంగా వెచ్చించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని యర్రగుంట్ల పీహెచ్‌సీలో ఇన్వర్టరు పాడవడంతో వైద్యులే రూ.4 వేల వరకు సొంత డబ్బు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు.

పడకండ్ల పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్వహణకు సిబ్బంది ఇప్పటి వరకు రూ.40 వేలు వెచ్చించారు. అహోబిలం పీహెచ్‌సీ సిబ్బంది రూ.30 వేలు ఖర్చుచేసి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

సీహెచ్‌సీలు 18

పీహెచ్‌సీలు 87

పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 47

# మనదే సొమ్ము.. మనమే తీసుకుందాం!



అనంతపురం : బ్యాంకు ఖాతాలో డబ్బు ఉన్నప్పటికీ పదేళ్లుగా లావాదేవీలు చేయలేదా? ఖాతాలో సొమ్మును ఎలా తీసుకోవాలి అని ఆలోచిస్తున్నారా..? అలాంటి వారి కోసం రిజర్వు బ్యాంకు మీ సొమ్ము..మీ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టింది. పదేళ్లుగా లావాదేవీలు చేయనివారు జమైన నిధులను ఖాతాదారులు, వారు లేకపోతే వారసులు తీసుకునే అవకాశాన్ని కల్పించింది.

**ఎలా పొందాలంటే..**

పదేళ్ల పాటు పలు బ్యాంకుల్లో లావాదేవీలు జరగకపోతే సదరు ఖాతాల్లోని నగదు ఆర్‌బీఐకు చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేట్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏఎఫ్) ఖాతాకు వెళుతుంది. సరైన ఆధారాలు చూపించి తీసుకునే వీలు కల్పించింది. ఈ అవకాశం డిసెంబరు 31 వరకు మాత్రమేనన్న విషయాన్ని గుర్తించుకోవాలి.

అన్‌క్లెయిమ్ డిపాజిట్లు ఉన్నవారు ఆధార్, పాన్, పాస్‌పోర్టు ఫొటోతో సదరు బ్యాంకును సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేయాలి. ఆర్‌బీఐ పరస్పర ధ్రువీకరణ ప్రక్రియ అనంతరం 10 నుంచి 15 రోజుల్లో సంబంధిత వ్యక్తుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది.

ఖాతా తెరిచిన సమయంలో నామినీ పేరు రాసి ఉంటే వారికే ఇస్తారు. ఒకవేళ ఖాతాదారు మరణించిన సందర్భంలో వారసులు, ఇతర సంబంధీకుల మరణ ధ్రువీకరణపత్రం, కుటుంబ సభ్యుల అంగీకారపత్రంతోపాటు బ్యాంకు కోరిన ఇతర ఆధారాలు సమర్పించి నగదు పొందవచ్చు.

**పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు : నరేశ్‌రెడ్డి, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్**

లబ్ధిదారులు ముందుగా ఉద్గమ్ పోర్టల్‌లో వివరాలు పరిశీలించవచ్చు. అందులో పేరు, మొబైల్ నంబరుతో రిజిస్టరు చేసుకోవాలి. ఖాతా తిరిగి వినియోగంలోకి వచ్చి... అందులో నగదు తిరిగి తీసుకోవాలంటే సంబంధిత బ్యాంకు శాఖకు వెళ్లి ఈకేవైసీ చేయించు కోవాలి కొత్త పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# ఈ పాపం ఎవరిది?



అనంతపురం : మొన్న ఎమ్పీఆర్ దక్షిణ కాలువ గేటు.. నిన్న సుబ్బరాయసాగర్.. తాజాగా పీఏబీఆర్ కుడి కాలువ గేటు.. ఇలా కీలకమైన కాలువల గేట్లన్నీ మొరాయిస్తున్నాయి. ఏటా మరమ్మతు, నిర్వహణ లేకపోవడమే దీనికి మూలం. ఈ పాపం ఎవరిది.. అన్న చర్చ తెరపైకి వచ్చింది. గత వైకాపా పాలకులు జలవనరుల శాఖను ఏమాత్రం పట్టించుకోలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టులే అత్యంత కీలకం. ఇరు జిల్లాలకు తాగు, సాగునీటిని అందించేవి ఇవే. వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. ప్రతి సంవత్సరం నీటి సీజన్ మొదలయ్యే నాటికి క్రస్ట్ గేట్లు, కాలువల షట్టర్లు, కాలువల్లో పిచ్చిమొక్కలు, వ్యర్థాల తొలగింపు, గట్ల మరమ్మతు.. తదితర వాటికి తగిన నిధులు ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఇవేవీ అమలు కాలేదు. ఫలితంగా గేట్లు పైకి లేవకుండా మొండికేశాయి.

**నివేదిక బుట్టదాఖలు**

పీఏబీఆర్ ప్రాజెక్టును 1986 ప్రాంతంలో నిర్మించారు. అప్పట్లోనే డ్యాం కుడి కాలువ గేటు ఏర్పాటు చేశారు. తరచూ లీకేజీ, మరమ్మతులు తలెత్తుతుండటంతో 2018లో మెకానికల్ ఇంజనీర్ల బృందం పరిశీలించింది. డ్యాం, కాలువ గేట్ల నిర్మాణమే లోపభూయిష్టంగా ఉందంటూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 2019లో ఎన్నికలు రావడంతో సమస్య మరుగునపడింది. ఈలోపు వైకాపా అధికారంలోకి వచ్చినా నివేదికను విస్మరించింది.

డ్యాంలో 2023లో నీరు అడుగంటింది. అప్పట్లోనే కాలువ గేటుకు మరమ్మతు చేయాల్సి ఉంది. పాలకులు ఎవరూ నోరుమెదపలేదు. ప్రస్తుతం 40 చెరువులు... కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో సాగు, తాగునీటి కోసం నిరీక్షిస్తున్నారు. అత్యవసర మరమ్మతు కోసం కూటమి ప్రభుత్వం రూ.29 లక్షలు మంజూరు చేసింది.

**కదిలింది కొద్దిగానే..**

హెచ్చెల్సీ పరిధిలో పుట్లూరు మండలం సుబ్బరాయసాగర్ ఉంది. 1974 ప్రాంతంలో సాగర్ గేటును అమర్చారు. ప్రస్తుతం సాగర్‌లోకి నీరు వస్తోంది. ఇక్కడి నుంచి పుట్లూరు, గరుగుచింతపల్లి, కోమటికుంట్ల చెరువులకు నీరు వదలడానికి గేటును ఎత్తడానికి నాలుగు రోజులుగా శ్రమిస్తున్నారు. నాలుగు ఇంచులు మాత్రమే పైకి లేచింది. 60 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. మూడు చెరువులకు నీరు వెళ్లాలంటే ప్రవాహం స్థాయి పెరగాలి. చెరువులకు నీరు చేరితేనే ఆయా ప్రాంతాల ప్రజల దాహార్తి తీరేది. మరమ్మతులు చేయడానికి కూటమి ప్రభుత్వ ఆదేశాలతో నిధులు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇటీవల ఎమ్పీఆర్ దక్షిణ కాలువ గేటును పైకి లేపడానికి అష్టకష్టాలు పడ్డారు. కర్ణాటక నుంచి సాంకేతిక సిబ్బందిని పిలిపించి గేటును పైకి ఎత్తించారు. కీలకమైన ఎమ్పీఆర్‌ను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల కూటమి సర్కారు రూ.5.32 కోట్లు మంజూరు చేసింది. నీటి సీజన్ ముగియగానే పనులు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# మొంథా గాయం.. అందని సాయం

పెనుమూరు : రబీకి సంబంధించి వేరుసెనగ డిసెంబరు 15లోపు విత్తితేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. అదును దాటితే పంట వేసినా ఆశించిన ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో నగరి వ్యవసాయ డివిజన్‌లో ఇప్పటికే అక్కడక్కడ వేరుసెనగ విత్తడం గమనార్హం. అధిక వర్షాలు కురిస్తే పంట నష్టపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు గతంలో కురిసిన వర్షాలతో చెరువులకు నీరు చేరింది. మళ్లీ వానలు పడితే పంట చేతికందే సమయంలో మొంథా తుపాను ఉమ్మడి జిల్లాలోని రైతులను నట్టేట ముంచింది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు కొంత ఊరట లభిస్తుందని అనుకున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నివేదిక అందించారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పరిహారం మాత్రం అందించలేదు. దీంతో రబీలో పంటల సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దూసుకొస్తున్న మరో ముప్పు**

ఉత్తర తమిళనాడు తీరం వైపుగా దిత్వా తుపాను దూసుకొస్తోందని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే తూర్పు మండలాల్లో చాలా మంది రైతులు వేరుసెనగ, వరి సాగు చేశారు. కొన్నిచోట్ల ఉద్యాన పంటలైన మిరప వేశారు. భారీ వర్షాలు పడితే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**ప్రభావిత మండలాలు**

చిత్తూరు జిల్లాలో గంగాధరనెల్లూరు, సోమల, తవణంపల్లి, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, పూతలపట్టు, పెనుమూరు, యాదమరి, గుడిపాల, సదుం, బంగారుపాళెం ఐరాల, పాలసముద్రం మండలాల్లో అధికంగా వరి పంట దెబ్బతింది. నూర్పిడి సమయంలో వర్షాలు పడడంతో పొలంలోనే మొలకలు వచ్చాయి.

చిత్తూరు జిల్లాలో పంట నష్టం వివరాలు

మొత్తం రైతులు: 334 మంది

వరి పంట: 176.87 హెక్టార్లు

వేరుసెనగ: 14 హెక్టార్లు

# ఒళ్లు సలసల.. రోగులు విలవిల

చిత్తూరు : చిత్తూరు నగరంలో జ్వరాల కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. టెలిఫోన్ కాలనీ, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్, మాపాక్షి, శంకరయ్యగుంట, చవటపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా.. అసౌకర్యాలు, మందుల కొరత కారణంగా చాలామంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల పారిశుద్ధ్యం దిగజారింది. దీంత దోమలు వృద్ధి చెంది.. కునుకు లేకుండా చేస్తున్నాయి.

**ఆ మాత్రం లేవా..?**

నగరంలోని ఏడు యూపీహెచ్‌సీలు ఉన్నా.. చాలాచోట్ల మందుల కొరత ఉంది. చిన్న పిల్లలకు అవసరమైన పారసెటమాల్ సిరప్, దగ్గు నివారణకు ఆమ్‌ప్రాక్స్ సిరప్‌తో పాటు సాధారణమైన పారసెటమాల్-500 ఎంజీ, డైక్లోఫినాక్, పాంటాప్, రాంటాక్, బి-కాంప్లెక్స్, మల్టీ విటమిన్, యాంటీ బయోటిక్స్ మాత్రలు లేవు. రక్త పరీక్షలు చేయడానికి అవసరమైన రీ-ఏజెంట్‌లు లేకపోవడంతో కొన్ని పరీక్షలు చేయలేకపోతున్నారు.

**ప్రైవేటులో బాదుడు తప్పట్లేదు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లేకపోవడంతో రోగులు ప్రైవేటుకు వెళ్తున్నారు. కన్సల్టేషన్ ఫీజు రూ.350 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తీవ్రత అధికంగా ఉన్నా, మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు రక్త పరీక్షల పేరిట రూ.600 నుంచి రూ.1,100లు, మందులకు కనీసం రూ.1,200




వరకు తీసుకుంటున్నారు.

**నగరంలో 15 డెంగీ కేసులు**

నగరంలోని ఏడు ఆస్పత్రుల పరిధిలో 15 డెంగీ కేసులు నమోదయ్యాయి. టెలిఫోన్ కాలనీలో 1, మురకంబట్టులో 1, ప్రశాంత్‌నగర్‌లో 1, మాపాక్షిలో 4, చవటపల్లిలో 4, సత్యనారాయణపురం ఆస్పత్రి పరిధిలో 4 కేసులు నమోదు అయ్యాయి. మురకంబట్టులో గన్యా కేసు ఒకటి నమోదైంది.

# స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్‌ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32-సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్-పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్-2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

# గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ-పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ.523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ-పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్‌ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్-2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్-1, ఫేజ్-2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్‌అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్‌అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ-పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

# తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

## 'జీవీఎంసీ'లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లపువాని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది.

ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గాజువాకతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

## కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, ఆవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంఠారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నిబిల్లి, రొంగలపాలెం, ములకాపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి..ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

## నీటి కొరత.. కాసుల పంట



నాయుడుపేట : నీరు లేకుండా పారిశ్రామిక ఉత్పత్తులను ఊహించలేం.. ఈ విషయాన్నే వైకాపా నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పారిశ్రామికవాడలకు నీరు సరఫరా చేసి కాసులు దండుకున్నారు. ఆ పార్టీ అధికారం ఉన్నన్నాళ్లు నీటి వనరుల పనులకు అడ్డంకులు సృష్టించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఈ దందాను కొనసాగిస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అతిపెద్ద పారిశ్రామికవాడలైన మేనకూరు, అత్తివరంలో అవసరమైన నీటిలభ్యత లేకపోవడంతో ఉత్పత్తులకు పరిశ్రమల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు పారిశ్రామికవాడల్లో 105 వరకు భారీ, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. వీటికి రోజూ 0.27 టీఎంసీల నీరు అవసరం. దీన్ని స్థానిక వైకాపా నేతలు అవకాశంగా చేసుకుని అక్రమార్జన సాగిస్తున్నారు.

**నేతల పెత్తనమిలా..**

పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడంలో నేటికీ వైకాపా నేతల పెత్తనం నడుస్తోంది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో ఫిల్టర్ పాయింట్లు నిర్మించి నీటిని పంపింగ్ చేసి పరిశ్రమలకు అధిక మొత్తానికి సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా నీటి సరఫరా వైకాపా నేతల కనుసన్నల్లో సాగుతోంది.

**అధికారి ఏమన్నారంటే..**

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు చివరి దశలో ఉన్నాయని.. త్వరలో తెలుగు గంగ నుంచి పారిశ్రామికవాడలకు నీరు సరఫరా చేస్తామని ఏపీఐఐసీ డీజడ్ఎం రాంబాబు తెలిపారు.

**పనులకు అడ్డంకులిలా..**

ఈ పారిశ్రామికవాడలకు పదేళ్లుగా నీటిసమస్య నెలకొంది. తెలుగు గంగ నుంచి నీటి సరఫరా చేసేందుకు 2017లో నాటి తెదేపా ప్రభుత్వం రూ.119 కోట్లతో పనులు ప్రారంభించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం చివరి దశలో పనులు నిలిపేసింది. ఏడీబీ ద్వారా జరుగుతున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తయితే వైకాపా నేతల రాబడికి గండి పడుతుందని, గతంలో పనులకు అంతరాయం కలిగించారనే ఆరోపణలున్నాయి.

## కొయ్య బొమ్మ.. చేయూత అందేనమ్మా



శ్రీకాళహస్తి : కొయ్య బొమ్మలు అంటేనే గుర్తుకొచ్చేది ఏర్పేడు మండలంలోని మాధవమాల కొయ్య బొమ్మల కళాకారులు. గ్రామస్థులంతా బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ సహకారం లేకపోవడంతో కొన్నాళ్లుగా రోజు కూలీలుగా మారుతున్నారు. వీరిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది.

**క్షేత్రస్థాయి పరిశీలనలు..:** రాయితీపై కొయ్య సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటవీశాఖ అధికారులు కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. డిపోలు, అటవీ ప్రాంతం నుంచి ఎంత సరఫరా చేయాలి.. రాయితీ , ఒక్కో యూనిట్‌కు ఇవ్వాల్సిన కలప, ఎదురయ్యే సమస్యలను గుర్తిస్తున్నారు.

**రోజు కూలీలుగా కళాకారులు..**

బొమ్మల తయారీకి నిద్రగన్నేరు, సీమచింత కలపను వాడుతారు.కొయ్య ప్రస్తుతం బయట ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. అడుగు (144 ఇంచులు) రూ.600 నుంచి రూ.700 మధ్య పలుకుతోంది. బొమ్మల ధర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడటంతో విక్రయాలు సాగడం లేదు. కళాకారులు ఈ వృత్తిని వదిలి కూలీలుగా మారుతున్నారు.

**ఇవీ వివరాలు..** ప్రత్యేకత: కొయ్య బొమ్మల తయారీ

సంఘం: బాలాజీ సంఘం

కుటుంబాలు: 850

యూనిట్లు: 150

## ఉద్యాన రైతుకు చేయూత



చిత్తూరు : జిల్లా ఉద్యాన పంటలకు నిలయం. మామిడి, టమాటా, పూలు, కూరగాయల పంటలు విస్తారంగా సాగవుతున్నాయి.. ఈ పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్లస్టరు అభివృద్ధి విధానానికి శ్రీకారం చుట్టాయి.. ఈ ఏడాది నుంచే అమలుకు ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

క్లస్టర్ విధానంపై ఇప్పటికే అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఉద్యాన రైతులకు శిక్షణ ఇచ్చారు. స్థానికంగా ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా పండించే ఉత్పత్తులను ఎంపిక చేసి పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో ప్రాజెక్టును నిర్వహిస్తారు. ఔత్సాహికుల ఎంపిక పూర్తి చేసి వారితో నేషనల్ హార్టికల్చర్ బోర్డుకు దరఖాస్తు చేయించేందుకు కసరత్తు ప్రారంభించారు. వచ్చే మూడు నెలల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తిచేయనున్నారు..

**ఇదీ ప్రధాన లక్ష్యం..**

వివిధ ఉద్యాన పంటల్లో విత్తనం మొదలు పంటల సాగు, యాజమాన్యం పోస్ట్ హార్వెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చుతారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించి ఎగుమతులు ప్రోత్సహించడం, సాగు ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయం పెంచడమే దీని ప్రధాన లక్ష్యం.

**ప్రయోజనం ఇలా..**

మామిడి, టమాటా, అరటి, బొప్పాయి తదితర పలు కూరగాయల ఉత్పత్తులను రైతులు మార్కెట్‌లో వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. అలాకాక క్లస్టరు నిర్వహణ సంస్థతో యూనిట్ ఏర్పాటు చేస్తే రైతుల ఉత్పత్తులను వారే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తారు. వాటిని ప్రాసెస్ చేయడంతో విలువ జోడించి ఎగుమతి చేస్తారు. క్లస్టరు పరిధిలో వెయ్యి నుంచి రెండు వేల ఎకరాలు, 150 నుంచి 250 మంది రైతులు ఉంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి రాయితీలు అందుతాయి. ఉదాహరణకు జిల్లాలో మామిడి, టమాటా సాగు ఎక్కువగా ఉంది. వీటి ప్రాసెసింగ్ యూనిట్‌లు ఇక్కడ నెలకొల్పేందుకు అవకాశం ఉంది.

రైతులు ఉపయోగించుకోవాలి.. ఉద్యాన రైతులు క్లస్టరు విధానాన్ని ఉపయోగించుకోవాలి. రూ.కోట్లు పెట్టుబడి వ్యయం పెట్టగల ఔత్సాహికులను గుర్తించి దరఖాస్తు చేయిస్తాం. ప్రాజెక్టు వ్యయంలో 40–50 శాతం రాయితీ వస్తుంది. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించే వారితోనూ క్లస్టరు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించవచ్చు.

## తిరుపతిలో పశు పరిశోధనా కేంద్రం!



తిరుపతి: పశుసంపద అభివృద్ధి, దేశీయ బ్రీడ్ల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో భారీ స్థాయిలో లైవ్‌స్టాక్ రీసెర్చ్ కేంద్రం (పశు సంపద పరిశోధనా కేంద్రం) ఏర్పాటుకు తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీనికి వందల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేస్తోంది. రాయలసీమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో దీన్ని నెలకొల్పనున్నారు. దీని ద్వారా దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పశువుల సంపదపై సమగ్ర పరిశోధనలు చేపట్టనున్నారు.

ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటులో ముఖ్యంగా మూడు అంశాలపై దృష్టి సారించనున్నారు.

**జాతి పరిరక్షణ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమైన ఒంగోలు జాతి పశువుల జన్యుపదార్థాన్ని (జర్మప్లాజమ్) పరిరక్షించడం, పుంగనూరు బ్రీడ్ అభివృద్ధి, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**పునరుత్పత్తి:** పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వాటి వారసత్వ జన్యు లక్షణాలను బలోపేతం చేయడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారిస్తారు.

**వ్యాధి నిరోధకత:** పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

క్రాస్ బ్రీడ్స్ అభివృద్ధిపై పరిశోధన

దేశీయ బ్రీడ్లే కాకుండా, మెరుగైన ఉత్పాదకత కోసం విదేశీ, దేశీయ జాతుల సంకరం (క్రాస్ బ్రీడింగ్)పైనా పరిశోధనలు చేస్తారు.

**ఫ్రీజివాల్ బ్రీడ్:** తితిదే గోశాల సహకారంతో ఇప్పటికే హాల్‌స్టీన్ ఫ్రీజియన్, స్థానిక సాహివాల్ జాతులను సంకరం చేసి అభివృద్ధి చేసిన 'ఫ్రీజివాల్' వంటి కొత్త బ్రీడ్ల పునరుత్పత్తి, సామర్థ్యంపై పరిశోధనలు చేయనున్నారు.

నాణ్యమైన పందులు, కోళ్లు: పశువులే కాకుండా మెరుగైన కోడి, పంది జాతులను అభివృద్ధి చేస్తారు.

ప్రయోజనమిలా.. ఈ కేంద్రంలో పశువులకు వసతి, అత్యాధునిక డయాగ్నసిస్ ల్యాబ్‌లు, పరిశోధనా సౌకర్యాలు కల్పించనున్నారు. హెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్, బ్రీడ్ కన్జర్వేషన్ పనులు ఒకేచోట చేపడతారు.

## లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్తర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్తర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ–కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావల్సినవారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి.

ఈ–కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశారు. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ–కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

## చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.

జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేశ్

## అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరంన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఎటూ ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

# సరదా స్నానం.. కారాదు ప్రాణాంతకం

నిడదవోలు : ఈ ఏడాది ఫిబ్రవరిలో మహాశివరాత్రి వేళ తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరి రేవులో స్నానానికి దిగిన అయిదుగురు విద్యార్థులు మృతి చెందారు. 2023లో రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు కొవ్వూరు వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. 2022లో బొబ్బర్లంక బ్యారేజీ, కొవ్వూరు వద్ద గోదావరిలో స్నానానికి దిగిన రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు యువకులు, ఒక వ్యక్తి మృతి కార్తిక మాసంలో విహార యాత్రల కు పంట కాలువలు, చెరువులు, వాగులు, కొండవాగులున్న ప్రాంతాలకు వస్తుంటారు. స్నానాలకు దిగి, లోతు తెలియక మృత్యువాత పడుతున్నారు.

**ప్రమాదకర ప్రాంతాలు..**



పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు, నిడదవోలు మండలం పందలపర్రు, పెండ్యాల, తాళ్లపూడి, తాడిపూడి, కాతేరు, బొబ్బర్లంక, విజ్జేశ్వరం, ధవళేశ్వరం ఆర్మ్

**ఏం చేయాలంటే..**

రేవులు ఉన్న చోటే స్నానాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పలు రేవుల వద్ద కనీసం గోదావరిలోకి దిగేందుకు కూడా అవకాశం ఉండదు. అటువంటి ప్రాంతాల్లో ఎవరూ దిగకుండా గస్తీతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించి యాత్రికులు అటువైపు వెళ్లకుండా రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

యాత్రికులు ఎక్కువగా వచ్చే సెలవు దినాల్లో ప్రధాన ప్రాంతాల్లో అధికారులు గస్తీ ఏర్పాటు చేయాలి.

# రుచుల 'కుండపోత'.. ట్రెండ్‌కు అనుగుణంగా పూతరేకులు

ఆత్రేయపురం : కోనసీమ అంటే కట్టిపడేసే దృశ్యాలే కాదు. నోరూరించే రుచుల పసందు. ఆ రుచుల్లో ఆత్రేయపురం పూతరేకులది ప్రత్యేక స్థానం. పూతరేకులంటే పంచాదార, బెల్లం డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసేవే కాదు.. ఇంకా బోలెడు రకాలు ఉన్నాయి. మధుమేహ బాధితులు తినేందుకు వీలుగా కాకరకాయ పొడి, కారంపొడి వేసి చుట్టిన పూతరేకులూ ఉన్నాయి. చిన్నపిల్లలు ఇష్టంగా తినడానికి చాక్లెట్ పౌడర్, బూస్ట్, హార్లిక్స్ చల్లినవీ లభిస్తాయి. ఇష్టంగా ఒక్క రోజులో తినేందుకు వీలుగా క్యారెట్, బీట్‌రూట్, తేనె జోడించి మరీ విభిన్న రుచుల్లో అందుబాటులోకి తెస్తున్నారు.

**ఎక్కడికైనా ఇక్కడి నుంచే..**

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రకరకాల పూతరేకులు అందుబాటులో ఉండటంతో ఇటీవల అమ్మకాలు పెరిగాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో ఫంక్షన్లు జరిగేటప్పుడు



వారి ఆహ్వానంపై వెళ్లి అక్కడే తయారు చేసి అందజేస్తున్నారు. శనివారం వచ్చిందంటే చాలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చేవారు వేల మంది ఇక్కడ ఆగి పార్సిళ్లు తీసుకెళ్లుతుంటారు.

**ఏటా రూ.6కోట్లు**

ఒకప్పుడు ఇంటింటా.. ఊరూరా తిరిగి అమ్మకాలు జరిపే స్థాయి నుంచి ఆన్‌లైన్ వరకు వ్యాపారం చేరింది. తయారీ, విక్రయంలో మహిళలదే కీలక పాత్ర. సినీ, ఇతర ప్రముఖులు, వివిధ సంస్థలకు ఇక్కడి నుంచే పూతరేకుల పార్సిళ్లు వెళ్తుంటాయి. ఆర్టీసీ, రైల్వే, విమాన కార్గోల ద్వారా ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఏటా రూ.6 కోట్ల వరకు లావాదేవీలు సాగుతున్నాయి.

**1200 మహిళా సంఘాలకు ఉపాధి**

ఒక్క ఆత్రేయపురం మండలంలోనే 1200 స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ పరిశ్రమపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఒక్కో మహిళ అమ్మకాల ద్వారా రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

# పేరుకున్న బకాయిలు.. తడారుతున్న గొంతులు..!

రాజమహేంద్రవరం : ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షిత జలాలు అందివ్వాలన్న 'జల్‌జీవన్ మిషన్' లక్ష్యానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టక, తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారుల బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని గాడిలో పెట్టినా.. బకాయిలు చెల్లించకపోవడంతో దాదాపు రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయి.అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 65 పనులు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైతే 46 పనులు పూర్తి చేశారు. కానీ ఆరు పనులకే బిల్లులు చెల్లించారు. రంగంపేటలో పనులన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి.కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల పరిధిలో 34.16 కోట్ల అంచనా వ్యయంతో 86 పనులు మంజూరవ్వగా అయిదు మాత్రమే పూర్తయ్యాయి.గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో రూ.28.57కోట్లతో 92 పనులకు గాను 76 పూర్తి చేశారు.

నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో రూ.48.78 కోట్లతో 92 పనులు కేటాయించారు. అవన్నీ నేటికీ ప్రారంభదశలోనే ఉన్నాయి.రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం మండలాలకు రూ.32.26 కోట్ల అంచనాలతో 51 పనులు మంజూరవగా సగం నిధులు సైతం ఖర్చు చేయలేని దుస్థితి. 27 పనులు వివిధ దశలో ఉన్నాయి.


త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. కొంత మేర బకాయిలు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. అని ఎస్ఈ గిరి అన్నారు.

రూ.216.30 కోట్లు: అంచనా వ్యయం రూ.35 కోట్లు: చెల్లించాల్సిన బకాయిలు

508: మంజూరైన పనులు 337: పూర్తి చేసింది

139: వివిధ దశల్లో ఉన్నవి 60,635: ఏర్పాటు చేయాల్సిన కుళాయిలు

# లెక్కలకు ఆటలే సమాధానం




ఆళ్లగడ్డ : విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు.. కానీ అడిగింది చెప్పడానికి 'లెక్క'లేనంత భయపడుతున్నారు. దీన్ని పోగొట్టడానికి కోటకందుకూరు ఆదర్శ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు (టీజీటీ) తూపల్లె వెంకటచంద్ర ఓ ఉపాయం పన్నారు. సమస్యకు సమాధానం చెబితే చరవాణిలో వీడియో తీస్తానని పిల్లలను ఉత్సాహపరిచారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో పెట్టి విద్యార్థులకు చూపించేవారు. వాటిని చూసిన వారు శెభాష్ అంటూ ప్రశంసించేవారు. దీంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది.

కేవలం బోర్డుల మీదే చెప్పడం కాకుండా ఆటపాటలతో చెప్పడం ఆరంభించారు. సంఖ్యారేఖపైన కూడిక, తీసివేతలను గీత గీసి దానిపై గెంతుతూ చెప్పడం, తొమ్మిదో తరగతిలో కోఆర్డినేట్ జామెట్రీలో వర్టికల్, హారిజాంటల్ గీతలు వేసి గమ్యస్థానానికి చేరడాన్ని విద్యార్థులతో గెంతులాట ఆడిస్తూ బోధిస్తున్నారు. ఛార్టుపైన రాయడం, రంగుల బొమ్మలు వేయించడం, వివిధ ఆకారాలను కృత్యాధారంగా చూపించడం, కర్రసాము, చెక్కభజన, కోలాటం ఆడిస్తున్నారు. ఇటీవల 'రఘుకుల తిలక' పాటకు కోలాటం చేస్తూ విద్యార్థులతో ఆయన చేసిన ప్రదర్శన వీడియో సామాజిక మాధ్యమాల్లో 6 లక్షల వ్యూస్ వచ్చాయి. ఇప్పటి వరకు చదువు, ఆటలకు సంబంధించి 500 వరకు వీడియోలు తీశారు. విద్యార్థులకు బోధించే వీడియో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చూసి ఎక్స్ వేదికగా అభినందించారు.

# ఘనులు మాటేసి.. ఖనిజం కాజేసి



నంద్యాల : అటవీ భూముల్లో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. డోన్ మండలంలోని కొచ్చెరువు, కన్నప్పకుంట, బాయిపల్లి అటవీ ప్రాంతాల్లో డొలమైట్, వైట్‌క్లే, తెల్ల సుద్ద, క్వార్ట్జ్ తవ్వకాలు భారీగా సాగుతున్నాయి. అక్రమార్కులకు రాజకీయ అండదండలు సమృద్ధిగా ఉండటంతో దందా సాగుతోంది.

**రాత్రి వేళల్లోనే...**ఎంపిక చేసిన కూలీలను లారీలు, టిప్పర్లలో ఎక్కించి అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్దేశిత ప్రాంతానికి తరలిస్తున్నారు. ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి నుంచి తీస్తున్న వైట్‌క్లే బలపాల పరిశ్రమలకు తరలివెళ్తుంది. బేతంచెర్ల మండలంలో అక్రమంగా బయటకు తీస్తున్న ఐరన్‌ఓర్.. చిన్న మల్కాపురం వద్ద బళ్లారి నుంచి దిగుమతి అవుతున్న ఇనుప ఖనిజంతో కలిపి ఇటీవలే ఏర్పాటైన పరిశ్రమకు తరలిస్తున్నారు.

**పర్మిట్లు లేకుండానే..**

జీరో బిల్ (బిల్లులు లేకుండా)తో ఖనిజాల రవాణాకు ఎర్రమల కొండల ప్రాంతంలో ప్రత్యేకంగా ఒక మాఫియా ఉందన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి పర్మిట్లు లేకుండా తరలిస్తున్నప్పటికీ కేసులు నమోదు చేస్తున్న ఘటనలు అంతంతమాత్రమే. ఇటీవల బేతంచెర్ల మండలంలో 1,000 టన్నుల ఐరన్ ఓర్‌ను అధికారులు పట్టుకున్నారు.

**వారి 'కనుసన్నల్లో'**

ఎవరు అధికారంలో ఉంటే ఆ ప్రాంత నాయకుల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్ సాగుతుంది. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెల కొండ అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, పేలుళ్లన్నీ ఎవరు 'గద్దె' నెక్కుతారో వారి నేతృత్వంలోనే జరుగుతాయి. ప్యాపిలి మండలం చంద్రపల్లిలో ఓ నాయకుడి ఆధ్వర్యంలోనే పదేళ్లుగా సాగుతోంది. బేతంచెర్ల మండలంలో ఐరన్‌ఓర్ అక్రమ తవ్వకాల సొమ్ము కొందరికి నెల మామూళ్లుగా మారిపోయాయి. డోన్ మండలంలోని మైనింగ్ మాఫియాతో పెట్టుకుంటే 'పీఠాలు' కదులుతాయన్న భావన ఉంది.

**అటవీ భూముల్లో యథేచ్ఛగా..**

ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి ప్రాంతంలో వైట్‌క్లే తవ్వకాలు సాగుతున్నాయి. అక్రమ మైనింగ్‌తో అటవీ ప్రాంతం దెబ్బతింటోంది. బేతంచెర్ల మండలంలో ఐరన్‌ఓర్ అక్రమ తవ్వకాలకు అంతే లేకుండా పోయింది. గూటుపల్లె, ముద్దవరం, రంగాపురం, ముసలాయిచెరువు ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి.

పాపసానికొట్టాల ప్రాంతంలో ఐరన్‌ఓర్‌ను పెద్దఎత్తున తవ్వి తరలిం చేస్తున్నారు.

డోన్ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెలికి తీస్తున్న క్వార్ట్జ్, డోలమైట్, తెల్ల సుద్ద ఇతర ప్రాంతాలకు తరలివెళ్తోంది.

# రాయి'తీయని'ఉపాధి

కర్నూలు : గ్రామీణ యువకులు, నిరుద్యోగులకు తేనెటీగల పెంపకం ద్వారా ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఉద్యానశాఖ ద్వారా సమగ్ర ఉద్యాన మిషన్ (ఎంఐడీహెచ్) కింద విరివిగా రాయితీలు అందిస్తున్నాయి. దీనికి ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందొచ్చు.

**ఎవరు అర్హులు**

తేనెటీగల పెంపకంపై శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రం కలిగుండాలి. ఎమ్మిగనూరులోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో వారం రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో శిక్షణ ఇప్పించి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

**ఈగలు ఎవరిస్తారు**

తేనె ఉత్పత్తికి సంబంధించి ఈగలు, పెట్టెలు ఉద్యాన శాఖ రాయితీపై అందిస్తోంది. బాక్సు, స్టాండు, తేనెటీగల తెట్టు కలిపి ఒక యూనిట్. ఒక యూనిట్‌లో 8 తేనెటీగల తెట్టు (రాణి ఈగలు, కూలీ ఈగలు) ఉంటాయి.

**ఎంత ఖర్చవుతుంది..**

ఒక వ్యక్తికి 50 యూనిట్లు (50 బాక్సులు) వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. ఒక యూనిట్ పూర్తి ధర రూ.4 వేలు కాగా అందులో 40 శాతం రాయితీ (రూ.1,600) ఇస్తారు. ఒక వ్యక్తి 20 నుంచి 50 వరకు బాక్సులను ఏర్పాటు చేసుకోవచ్చు. తెట్టు నుంచి తేనె తీసే యంత్రం (ఎక్స్‌ట్రాక్టర్) పూర్తి ధర రూ.20 వేలు కాగా.. అందులో 40 శాతం (రూ.8 వేలు) రాయితీ ఇవ్వనున్నారు.

**ఎక్కడ పెట్టాలి**

సొంత పొలం ఉండాల్సినవసరం లేదు. పూత ఉండే పంటల దగ్గర పెట్టెలను ఏర్పాటు చేయాలి. నువ్వులు, పొద్దుతిరుగుడు, వాము, కంది తదితర పంటల వద్ద పెట్టాలి. ఆయా పంటలకు రసాయనిక మందులు ఎక్కువగా పిచికారీ చేయరు కాబట్టి తేనెటీగల పెంపకానికి అనువుగా ఉంటుంది. పొలాల వద్ద పెట్టెలు పెట్టిన 20 రోజులకు తేనె ఉత్పత్తి అవుతుంది. 30 రోజుల తర్వాత నాణ్యమైంది వస్తుంది. ఒక బాక్సు నుంచి 3- 4 కిలోల తేనె వస్తుంది. కిలో రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయించొచ్చు.

# హాల'దారి' అవస్థలు

నందికొట్కూరు : జాతీయ రహదారి వెంట పొలాలకు వెళ్లేందుకు అవసరమైన బాటలు నిర్మించకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. బాటకు ఇరువైపులా ఉన్న పొలాలకు వెళ్లేందుకు రహదారుల సౌకర్యం లేక రైతులు కి.మీ.ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు దిగితే 10 మీటర్ల దూరంలో ఉన్న పొలానికి 4 నుంచి 6 కి.మీ దూరం చుట్టూ తిరిగి వెళ్తున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు పొలాలకు మార్గం లేకపోవడంతో ఆరు మండలాల పరిధిలో సుమారు 40 ప్రాంతాల్లో అన్నదాతలు తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసుకున్నారు. రహదారికి ఇరువైపులా.. పొడవునా గుత్తేదారులు దిమ్మెలు ఏర్పాటు చేయగా రైతులు వీటిని తొలగించి కంకర, మట్టి వేసి చదును చేసుకుని పొలాల్లోకి రాకపోకలు సాగిస్తున్నారు. దీనిని తొలగించాల్సిందేనని గుత్తేదారులు చెబుతున్నారని అన్నదాతలు వాపోయారు. పొలాలను పోగొట్టుకుని నష్టపోవడమేకాక పొలాలకు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారులు, పాలకులు స్పందించాలని వారు విన్నవిస్తున్నారు.

రస్తాలు మాయం

340సీ నంబరు జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా భూములు పోగొట్టుకున్న రైతులకు పరిహారం చెల్లించారు. సుమారు 750 మంది రైతులు తమ భూములను ఇవ్వాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లే రస్తాలు సైతం కనుమరుగయ్యాయి. ఎన్‌హెచ్ నిర్మాణ సమయంలో పొలాలకు వెళ్లేలా రహదారులు నిర్మించాలంటూ రైతులు గుత్తేదారులను నిలదీశారు. పనులను సైతం అడ్డుకున్నారు. తగిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిబంధనలు ఒప్పుకోవంటూ అధికారులు చేతులెత్తేశారు.

ఐదు వేల మందికి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా సమీపం నుంచి ఆత్మకూరు శివారు వరకు సుమారు 66.115 కి.మీ. మేర 340సీ నంబరు జాతీయ రహదారిని నిర్మించారు.

కల్లూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల పరిధిలోని పొలాల మీదుగా ఏర్పాటుచేశారు.

ఆరు మండలాల పరిధిలో ఎన్‌హెచ్ వెంబడి సుమారు 30 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంతో దీనిని ఆనుకుని ఉన్న 7,500 హెక్టార్లకు చెందిన సుమారు 5 వేల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

# పారిశ్రామికోత్సాహం

కాకినాడ: విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో ప్రపంచస్థాయి సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో మిగతా జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలతో సందడి తీసుకువస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో ఏపీఐఐసీ, పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ చేపడుతున్నారు. ఐలా, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలతో కలిసి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, పెట్టుబడులను ఆకర్షించేలా సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**పెట్టుబడులను ప్రోత్సహించేలా..**

ప్రస్తుతమున్న పరిశ్రమల యాజమన్యాలతో పాటు, కొత్త పారిశ్రామికవేత్తలు స్థానికంగా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తారు. ఇందుకోసం ఔత్సాహికులతో 'ఐలా' పరిసరాల్లో పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులు సమావేశాలు నిర్వహిస్తారు.

**రూ.7.80 కోట్లతో మౌలిక వసతులు..**



ఐలా నిధులతో పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. వాకలపూడిలో రూ.3.98 కోట్లు, సర్పవరం రూ.3.13 కోట్లు, పెద్దాపురం ఐలా పరిధిలో రూ.87 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతారు. రెండుచోట్ల పనులకు టెండర్లు పిలిచారు. రహదారుల మరమ్మతులు, భద్రతా క్యాబిన్లు, ప్రవేశద్వారాల ఆర్చ్‌లను నిర్మించనున్నట్లు ఏపీఐఐసీ జెడ్ఎం రమణారెడ్డి తెలిపారు.

**ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ..**

వాకలపూడి, సర్పవరం, పెద్దాపురం పారిశ్రామికవాడలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జేసీబీలతో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు, కాలువల్లో పేరుకున్న పూడిక తొలగిస్తున్నారు. ఏపీఐఐసీకి చెందిన ఖాళీ స్థలాల్లో అటవీశాఖ నుంచి మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గ్రీన్ బెల్ట్ తగినంత ఉండేలా చూస్తున్నారు.

# 'సిండికేట్'గా నంజుకున్నారు

ఒంగోలు : సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘంలోని అక్రమాల పుట్ట పగిలింది. 2024-25 ఆడిట్ నివేదికలో మొత్తం బండారం బయటపడింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో త్రిమెన్ కమిటీతో సొసైటీ నిర్వహించారు. ఆ సమయంలో బైలాకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని రూ.కోటి మేర నిధులు పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూకట్ల విజయమ్మ ఛైర్‌పర్సన్‌గా త్రీమెన్ కమిటీని నియమించారు. ఆమె బాధ్యతలు స్వీకరించాక గతంలో చోటుచేసుకున్న అక్రమాలను గుర్తించి అధికారుల దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్రా సురేంద్రబాబుతో విచారణ




జరిపించారు. సమగ్ర పరిశీలన అనంతరం ఆడిట్ నివేదికను డీసీవోకు ఆయన సమర్పించారు. ప్రధానంగా ఆరు అంశాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు.

**ఇదిగో అక్రమాల చిట్టా...**

సంఘం భవనం, గోదాము నిర్మాణానికి టెండర్లు పిలవకుండా నాటి ఛైర్మన్ కనుసన్నల్లో పనులు చేపట్టారు. నిబంధనల ప్రకారం అంచనా వ్యయం రూ.5 లక్షలు దాటితే టెండరు పిలవాలి. దీనికి సంబంధించి ఎంబుక్‌లో లెక్కలకు, బ్యాంకులో డ్రాచేసిన నిధులకు సైతం రూ.లక్షల్లో వ్యత్యాసం ఉంది. ఎంబుక్‌లో రూ.64 లక్షల ఖర్చు చూపగా... బ్యాంకు నుంచి సుమారు రూ.98 లక్షలు డ్రాచేశారు.

సామాజిక, రైతు సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాల్సిన కామన్ గుడ్ ఫండ్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ.40 లక్షలను రిజర్వ్ ఫండ్ ఖాతాకు బదిలీ చేశారు.

మహాజనసభ ఆమోదం లేకుండా కార్యాలయం ఎండీని నియమించి... నెలకు రూ.50 వేలు వేతనంగా చెల్లించారు. నిబంధనలను కాదని విశ్రాంత అధికారిని నియమించారు. ప్రభుత్వం మారాక సదరు ఎండీ ఆ పోస్టు నుంచి తప్పుకున్నారు.నియామకాలకు సంబంధించి డీసీవో, మహజన సభ అనుమతి తప్పనిసరి. అటువంటిది... ప్రకటన ఇవ్వకుండా తమకు అనుకూలమైన వ్యక్తిని జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. మరో ఉద్యోగిని రెగ్యులర్ చేశారు.

ఇష్టానుసారం నియామకాలు, నిధులు ఖర్చు చేయడంపై సెక్షన్ 51 విచారణ అవసరమని ఆడిట్ నివేదికలో సిఫార్సు చేశారు.

# పేరుకే జాతీయం.. దారంతా గుంతలమయం

టంగుటూరు: కోల్‌కతా - చెన్నై 16వ నం.జాతీయ రహదారి టంగుటూరు మీదుగా పోతుంది. దీని మీదుగా వెళ్లే కారుకు రూ.105, బస్సుకు రూ.355, లారీకి రూ.555, భారీ వాహనాలకు రూ.675 మేర టోల్ గేట్ పన్ను వసూలు చేస్తున్న నిర్వాహకులు ఎలాంటి సౌకర్యాలను కల్పించడంలేదు. నిర్వహణ సరిగ్గా లేక రోడ్డంతా గుంతలు పడినా పట్టించుకోవడంలేదు.

జిల్లాలో సమారు 60 కి.మీ. దూరం ప్రకాశం జిల్లాలో 16వ నం.జాతీయ రహదారి సుమారు 60 కి.మీ వెళ్తుంది. ప్రజారవాణా, వాణిజ్యం, వంటి వ్యవహారాల్లో జిల్లాకే మణిహారంలాంటి ఈ మార్గం టోల్‌ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యానికి అధ్వానంగా మారింది. టంగుటూరు- వల్లూరు - సింగరాయకొండ మార్గం మధ్య 24 కి.మీ మేర పరిశీలిస్తే ఒక్కో గుంత అడుగు నుంచి మూడు అడుగుల వరకు లోతు ఉంటోంది. ఇలా సుమారు 400 గుంతల వరకు దర్శనమిస్తున్నాయి. అలాగే పలు చోట్ల 20 అడుగుల మేర తారు దెబ్బతింది. రాకపోకల సమయంలో ఆయా గుంతలను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. జాతీయ రహదారి రోడ్డు మరమ్మతులు, పారిశుద్ధ్యం, గ్రీనరీ, రోడ్డు భద్రత, సిగ్నల్స్, యాక్సిడెంట్ జోన్ ఎంపిక వంటి బాధ్యతల విషయంలో పన్ను వసూలు చేస్తున్న కంపెనీలదే పూర్తి బాధ్యత.

చురకలు



# ముడిపట్టు ధర పైపైకి

ధర్మవరం : నేతన్నకు కొత్త సమస్య ఎదురైంది. ముడిపట్టు ధర పెరగడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పట్టుచీరల తయారీకి ఉపయోగించే వార్పు, సర్పూరి ధరలు ఆరు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200 పెరిగాయి. పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గడంతో ముడిపట్టుకు డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత మగ్గాలు, మరమగ్గాలకు ప్రతినెలా 3.25 లక్షల కిలోల ముడిపట్టు వినియోగిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్ నుంచి స్థానిక రీలర్లు పట్టుగూళ్లు కొనుగోలు చేసి దారం తీస్తున్నారు. వీరు ఉత్పత్తి చేసే ముడిపట్టు 20 శాతం మగ్గాలకు మాత్రమే సరిపోతోంది. దీంతో కర్ణాటకపై ఆధారపడాల్సి వస్తోంది. కర్ణాటకలోనూ ఆరు నెలలుగా పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గడంతో ముడిపట్టు ధరలు పెరిగాయి. ఫలితంగా ఒక్కో పట్టు చీరపై రూ.800 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు.

**తగ్గిన పట్టుపురుగుల పెంపకం**

శ్రీసత్యసాయి జిల్లాలో 18 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. రైతులు పండించిన పట్టుగూళ్లను హిందూపురం, ధర్మవరం మార్కెట్లలో విక్రయిస్తారు. వర్షాకాలంలో పట్టుపురుగుల పెంపకం తగ్గింది. దీంతో మార్కెట్కు తక్కువ స్థాయిలో గూళ్లు వస్తున్నాయి. ఇవి జిల్లాలోని రీలింగ్ పరిశ్రమలకు ఏమాత్రం సరిపడటం లేదు. కిలో పట్టుగూళ్ల ధర



రూ.750 వరకు పలుకుతోంది.

**రాయితీ ఇస్తేనే ఊరట**

రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకొని పట్టుచీరలు, పావడాలు నేస్తున్నాను. ముడిపట్టు ధర పెరగడంతో ఒక్కో పట్టు చీర తయారీపై రూ.800కు పైగా అదనపు భారం పడుతోంది. అందుకు అనుగుణంగా పట్టుచీరల ధరలు పెరగడం లేదు. తయారీదారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలాగే ధర పెరిగితే మగ్గాలు నడపడం కష్టమవుతుంది.

**చిప్పల మార్కండేయ**

ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాలు: 20 వేలు
మర యంత్రాలు..: 25 వేలు
కేంద్రాలు: ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, యాడికి, ఉరవకొండ, సోమందేపల్లి, గోరంట్ల
నెలకు అవసరమైన ముడిపట్టు: 80,000 కిలోలు
మరమగ్గాలకు.. : 2,25,000 కిలోలు
ముడిపట్టు ప్రస్తుతం కిలో: రూ.6,400
ఆరు నెలల కిందట : రూ.5,200

# నిధుల్లేక.. నిలువెల్లా గండ్లు

తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతాంగాన్ని చెరువులే ఆదుకుంటున్నాయి. ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. అయితే శతాబ్దాలనాటి చెరువులను ఏటా తుపాన్లు, భారీ వర్షాలు దెబ్బతీస్తున్నాయి. దీంతో ఎప్పుడు కట్ట తెగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు బతుకుతున్నారు. ఇది ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి చెరువు. మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతింది. వెంటనే స్పందించి మరమ్మతులు చేయడంతో నష్టం తగ్గింది. తాజాగా గురువారం కేవీబీపురం మండలంలోని పాతపాలెం రాయలచెరువు కట్ట తెగిపోవడంతో గ్రామాల్లోకి వరద పోటెత్తింది. ఎక్కడికక్కడ పశువులు కొట్టుకుపోయాయి.

**నివర్ తుపానుతో అపారనష్టం**

ఐదేళ్ల కిందట నివర్ తుపాను జిల్లాను వణికించింది. దాదాపు 25 శాతం చెరువులకు తీవ్రనష్టం జరిగింది. మరో 15 శాతం జలవనరులు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.450 కోట్లతో శాశ్వత మరమ్మతులకు అధికారులు ప్రతిపాదించినా వైకాపా ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. రూ.21 కోట్లతో పైపైన బాగుచేసి మమ అనిపించారు. అనంతరం నాలుగైదు సార్లు జలవనరుల శాఖ నివేదించినా పట్టించుకోలేదు.

**19 గ్రామాలకు కునుకులేదు..**

2021 నవంబరులో కురిసిన వర్షాలతో 500 ఏళ్ల కిందట నిర్మించిన రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు కట్టకు లీకేజీలు ఏర్పడ్డాయి.

0.50 టీఎంసీల సామర్థ్యమున్న చెరువుకు 0.90 టీఎంసీల నీరు రావడంతో ఏ క్షణమైనా కట్ట తెగుతుందనే భయం ఏర్పడింది. దాంతో 19 గ్రామాల్లోని 20వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 50వేల సంచుల ఇసుక బస్తాలు వేసి భారీ ప్రమాదం జరగకుండా చూశారు. తాజాగా గండి పడినా ప్రాణనష్టం జరగలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరువులు 5,871
ఆయకట్టు 1.13 లక్షల ఎకరాలు
మొంథా ప్రభావంతో దెబ్బతిన్న చెరువులు 680
మరమ్మతులకయ్యే వ్యయం రూ.71.49 కోట్లు
శాశ్వత పనులకు ప్రతిపాదనలు : రూ.450 కోట్లు,
వైకాపా ప్రభుత్వం ఇచ్చింది : రూ.21 కోట్లు

# కళ్లెదుటే బీభత్సం

కేవీబీపురం : రాయల చెరువు గండితో రైతుల ఆశలన్నీ జలసమాధయ్యాయి. వరద ఉద్ధృతికి చెరువు కట్ట తెగిపోవడంతో భీతావహ పరిస్థితి నెలకొంది. ఐదు గ్రామాల ప్రజలు ముంపులో చిక్కుకున్నారు. నిమిషాల వ్యవధిలోనే పాతపాళెం, కళత్తూరు ఎస్సీ కాలనీలు, పాతపాళెం అరుంధతివాడ, కళత్తూరు గ్రామంలో కొంతమేర ఇళ్లలోకి వరద నీరు చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఆవులు, గేదెలు వరదలో కొట్టుకుపోయాయి. 900కు పైగా పశువులు మృతిచెంది ఉంటాయని ప్రాథమిక అంచనా. రాత్రవుతున్నా యంత్రాంగం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. 25 స్తంభాలు నేలకూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ బాధితులతో మాట్లాడి సహాయ చర్యలను పర్యవేక్షించారు. శెభాష్ సుందరయ్యగిరిజన వ్యక్తి సుందరయ్య చొరవ రాయలచెరువు గండి ఘటనలో వందల మంది ప్రజల ప్రాణాలను నిలబెట్టింది. ఓళ్లూరు గిరిజనకాలనీకి చెందిన ఆయన చెరువులో నిత్యం చేపల వేటకు వెళ్తుంటాడు. అలా కట్టకు బొగద ఏర్పడటాన్ని గుర్తించారు. హుటాహుటిన రెండు కిలోమీటర్లు నడిచి ఉప సర్పంచి మస్తాన్కు తెలియజేశారు. ఆయన పరిశీలించి.. సర్పంచి సురేష్‌చౌదరికి చరవాణిలో సమాచారం ఇచ్చారు. ఆయన సీఐ రవీంద్ర, ఎస్ఐ నరేష్‌లతో కలిసి కళత్తూరు, పాతపాళెం ఎస్సీ కాలనీలతో పాటు అరుంధతివాడ ప్రజలను అప్రమత్తం చేశారు. ఆపై ఏరాజులకండ్రిగ, ఎగువపూడి, జయలక్ష్మీపురం కాజ్‌వేల వద్ద రాకపోకలు తహసీల్దార్, ఎంపీడీవోలు నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది.ఎప్పుడు.. ఎలా..ఉదయం రాయల చెరువుకు పడిన బొగదను గుర్తించిన సుందరయ్య. ఉప సర్పంచి మస్తాన్ గండిపడుతుందని సర్పంచి సురేష్‌చౌదరికి చరవాణిలో సమాచారం.

# కాసులిస్తేనే కదలిక!



పుట్టపర్తి: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ మండలంలో ప్రతి పనికీ సీఐ చేయి తడపాల్సిందేనన్న ఆరోపణలున్నాయి. ఈయన ఈ ప్రాంతంలో వద్దని.. ఇటీవల మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు డీఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాద ఘటనలో వాహనం వెనక్కి ఇచ్చేందుకు ఓ సీఐ రూ.25 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ సతీశ్‌కుమార్ దృష్టి సారించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నెలన్నర వ్యవధిలోనే జూదం, చోరీల నియంత్రణకు తగు చర్యలు తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొందరు పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**వైకాపా నాయకులతో కలిసి..**

పెనుకొండకు చెందిన ఓ ఉపాధ్యాయుడు 2017లో కొంతమందితో కలిసి సర్వే నం.693లో 2.93 ఎకరాలు కొని వాటా ప్రకారం పంచుకున్నారు. మిగులును అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లుగా మార్చుకున్నారు. వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి తనకు సదరు స్థలం కావాలని అడగ్గా.. ఇవ్వకపోవడంతో కబ్జా చేయాలని చూశారు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని అప్పటి ఎస్ఐ, సీఐలు వేధింపులకు గురిచేశారు. ఈ క్రమంలో కొందరు నాయకులు, అనుచరులతో కలిసి ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి నగదు, అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లు ఎత్తుకెళ్లారు. ఈక్రమంలో నాయకులకు సహకారం అందించిన ఎస్ఐ, సీఐలను వీఆర్‌కు పంపించారు. తర్వాత ఎస్ఐకు సీఐగా పదోన్నతి కల్పించి ఉమ్మడి జిల్లాలోనే మరో ప్రాంతానికి బదిలీ చేశారు. సీఐను కడప జిల్లాకు పంపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరినా.. స్పందన లేకపోవడంతో సదరు ఉపాధ్యాయుడు గతేడాది డిసెంబరు 12న అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో అప్పటి ఎస్పీ పూర్తి విచారణ చేసి.. నివేదికను డీఐజీకి పంపించారు. వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

**కేసు నమోదు చేయక..**

ముదిగుబ్బకు చెందిన ఇర్ఫాన్ బేల్దారి పనులు చేయిస్తుంటాడు. పెనుకొండకు చెందిన షరీఫ్ గతంలో అతనివద్ద బేల్దారి పనులు చేసేవాడు. బెంగళూరులో తెలిసినవారి వద్ద బంగారం ఎక్కువ ఉందని, సగం ధరకే ఇప్పిస్తానని ఇర్ఫాన్‌కు ఆశ చూపాడు. షరీఫ్, అతని స్నేహితుడు బాబాకు రూ.2 లక్షలు ఇచ్చాడు. బంగారం నకిలీదని తేలడంతో ఇర్ఫాన్ ముదిగుబ్బలో ఫిర్యాదు చేశాడు. వారు పెనుకొండకు వెళ్లమన్నారు. సంఘటన జరిగింది సోమందేపల్లి పరిధిలో అక్కడికే వెళ్లాలని సూచించారు. వారు మళ్లీ తిరిగి పెనుకొండకు వచ్చారు. అయినా ఎక్కడా కేసు నమోదు కాలేదు.

**ఇసుక తరలిపోతున్నా..**

ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా అవుతోంది. ముదిగుబ్బలోని పీసీరేవు, తాడిమర్రిలోని సీసీరేవు నుంచి పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్ల ద్వారా రాత్రివేళల్లో బెంగళూరుకు తరలిస్తున్నారు. ముదిగుబ్బ మీదుగా కదిరి, బత్తలపల్లి మీదుగా అనంతపురానికి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నెలనెలా మామూళ్లు అందుతుండటంతోనే దందా జరుగుతోందన్నది బహిరంగ రహస్యమే.

# అనర్థమని చెప్పరు.. అవగాహన కల్పించరు!



అనంతపురం : రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంతలో బాల్యవివాహాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, యాడికి, గార్లదిన్నె, శింగనమల ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఘటనలు ఆందోళన కల్గిస్తున్నాయి. తాజాగా మరొక ఘటన తెరపైకి వచ్చింది. ఇవన్నీ నెల వ్యవధిలోనే బహిర్గతం కావడం ప్రస్తావనార్హం. విద్యాసంస్థల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బాల్యవివాహాల అనర్థాలు, నియంత్రణపై అవగాహన కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు.

**చాపకింద నీరులా..**

సెప్టెంబరు, అక్టోబరులో ఏకంగా 13 బాల్యవివాహాలు జరిగినట్లు ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఆనంద్ ఆవేదన వెలిబుచ్చారు. సంబంధిత యంత్రాంగం తూతూమంత్ర సమీక్ష.. ప్రచార పత్రాల విడుదలతోనే సరిపుచ్చుతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నా అవగాహన శిబిరాలు నిర్వహించలేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి.

**540 మంది.!**

అంగన్‌వాడీ కేంద్రాల్లో 23,596 మంది గర్భిణి, బాలింతలు లబ్ధిదారులుగా ఉన్నారు.

540 మంది 19 ఏళ్లలోపు వారు ఉండటం విశేషం. వీరిలోనూ 257 మంది గర్భిణులు, 283 మంది బాలింతలు ఉన్నట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. 540 మందికి పెళ్లిళ్లు అయినట్లు తెలుస్తోంది.

వారంతా ఉరవకొండ, శింగనమల, కంబదూరు, కణేకల్లు, గుత్తి, తాడిపత్రి వంటి ప్రాజెక్టుల పరిధిలో ఉన్నారు. యుక్త వయసులోనే పెళ్లి అయినా యంత్రాంగం పసిగట్టలేదు. కనీసం అడ్డుకునే ప్రయత్నాలు చేయలేదు.

**ముందుగా గుర్తించక..**

జిల్లాలో బాల్యవివాహాలు జరగడం, మోసానికి గురై గర్భం దాల్చడం.. వంటి ఘటనలు ఈ మధ్యనే ఎక్కువ తెరపైకి వచ్చాయి. యాడికి, గార్లదిన్నె, శింగనమల ప్రాంతాల్లో బాలికలు గర్భం దాల్చిన తర్వాతే వెలుగుచూశాయి.

కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం ప్రాంతాల్లో వివాదాలు తలెత్తడంతో బాల్యవివాహాలను ఆపారు. తాజాగా.. శింగనమలలో తన బిడ్డ కనపించలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సదరు బాలిక పెళ్లి చేసుకొని వచ్చింది. అంతా అయ్యాక.. బుధవారం ఆ బాలిక, తల్లిదండ్రులతో అధికారులు సమావేశమయ్యారు.

ఘటనలు జరుగుతున్నా ముందుస్తు సమాచారం అందడం లేదు. సంబంధిత ప్రాంతాల్లో అవగాహన సమావేశాలను నిర్వహించకనే ఇలాంటి దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి.

# పెన్నా తీరంలో జూదం



అనంతపురం :తాడిపత్రి మండలం ఆలూరు గ్రామ సమీపంలోని కొండల్లో నిత్యం జూదం నిర్వహిస్తున్నారు. రోజుకొక చోట ఆడిస్తున్నారు. ఏ రోజు ఎక్కడ ఆడిస్తున్నారనే విషయాన్ని కొన్ని గంటల ముందు ఫోన్ ద్వారా తెలియజేస్తారు. కొంత దూరం వరకు కార్లలో తీసుకెళ్లి అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై తరలిస్తున్నారు. చుక్కలూరు క్రాస్, సజ్జలదిన్నె పారిశ్రామికవాడలో మూతపడిన గ్రానైట్ పరిశ్రమల్లో పెద్దఎత్తున ఆడిస్తున్నారు.

నందలపాడు, పాత వంతెన, కొత్త వంతెన ప్రాంతాల్లో పెన్నానది ఆనుకుని ఉన్న తోటల్లోనూ స్థావరాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు అక్కన్నపల్లి, హుస్సేనాపురం, బ్రహ్మణపల్లి, చిన్నపొలమడ గ్రామాల పరిధిలోనూ దందా సాగుతోంది.

పెన్నా తీరంలో జూదరులు విజృంభిస్తున్నారు. తాడిపత్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో స్థావరాలు ఏర్పాటు చేసి ఆడిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు బహిరంగంగానే స్థావరాలను నిర్వహిస్తున్నారు. వారికి స్థానిక పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెన్నాతీరం, పండ్లతోటలు, కొండల్లో జూదం సాగుతోంది. అనంతపురంతో పాటు నంద్యాల, కడప జిల్లాల నుంచి తాడిపత్రి వస్తున్నారు. ప్రత్యేక నెట్‌వర్క్ ద్వారా ఒకచోటుకు చేరుస్తున్నారు. పగలే కాకుండా రాత్రి వేళల్లోనూ దందా జోరుగా సాగుతోంది. ఒక్కో ఆటకు గెలిచిన వారి నుంచి 10 నుంచి 20 శాతం కమీషన్ తీసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

**పోలీసుల సహకారం..**

తాడిపత్రికి చెందిన కొందరు స్థానిక నాయకుల కనుసన్నల్లో నడిచే జూదానికి పోలీసుల నుంచి పూర్తి సహకారం లభిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఆదేశించినప్పుడు మాత్రం నామమాత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేయడం లేదు.

**కట్టడి చేస్తున్నాం..**

జిల్లాలో జూదం నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు పెడుతున్నాం. తాడిపత్రిలోనూ ఇటీవలే కొందరిని అరెస్టు చేశాం. జూద నిర్వాహకులకు సహకరిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదు.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

# కార్మికులకు కార్డు.. భద్రతకు రివార్డు!

తిరుపతి : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడగు వేస్తున్నాయి. ఈ - శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్మికుల గుర్తింపునకు పోర్టల్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నా.. చాలామంది నమోదు చేసుకోలేదు.

**అర్హులు ఎవరు:**

18- 59 ఏళ్లలోపు వారు అర్హులు. ఈ- శ్రమ్ కార్డులతో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.

ఇప్పటివరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరిద్దరు కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి సామాజిక భద్రతతోపాటు వివిధ పథకాలు అందుతాయి.

దరఖాస్తు ఇలా..: ఈ - శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణిలో సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుపతి, చిత్తూరు కార్మిక శాఖ కార్యాలయాలలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేశారు. సీఎస్‌ఈ




కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుతోపాటు వివరాలు నింపి కార్డులు పొందవచ్చు. ఒకసారి తీసుకుంటే ఐదేళ్లు అమలులో ఉంటుంది. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవగాహన సదస్సులు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టారు.

మాన్‌ధనం: పీఎం - శ్రమ యోగి మాన్ ధన్ (ఎస్‌వైఎం) పథకానికి 18 - 40 ఏళ్ల వయస్సున్న కార్మికులు అర్హులు. కార్మికులు వయస్సు ఆధారంగా కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వం చెల్లిస్తాయి. 61 ఏళ్లు దాటిన తర్వాత కార్మికులకు పింఛను వర్తిస్తుంది. కనిష్ఠంగా రూ.55.. గరిష్ఠంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్థిక ప్రయోజనం:**

ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద మరణ, అంగ వైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.

వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా సాయం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తారు.

కార్మికురాలు, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికులు: 9 లక్షల మంది ఇందులో భవన
నిర్మాణ కార్మికులు: 1,45,341 మందిఈ శ్రమ్‌లో నమోదైన కార్మికులు
చిత్తూరు: 4,66,831
తిరుపతి: 78,912
మదనపల్లె: 1,08,117

# తెలుగు అకా'డమ్మీ'

తిరుపతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థ కేటాయించాలని నిర్ణయించారు. తిరుపతి కేంద్రంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీని తిరుపతికి 2020 జూన్ 16న నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధి బాధ్యతల్ని తెలుగు అకాడమీకి అప్పగిస్తూ తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతర్గత సమస్యలతో అకాడమీ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోగా.. 2022 జూన్ 1 ఎట్టకేలకు తిరుపతిలోని తుమ్మలగుంట మార్గంలో తితిదే గోశాలకు చెందిన భవనంలో ప్రారంభమైంది. వైకాపా ప్రభుత్వ పాలనలో అకాడమీని విజయవాడ నుంచి తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలో అకాడమీ కాగితాలకే పరిమితమైంది.

**ఉద్యోగులు విజయవాడలో..**అకాడమీని అధికారికంగా తిరుపతిలో ఏర్పాటు చేసినప్పటికీ అనధికారికంగా ఇప్పటికీ విజయవాడ నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**స్థలాన్వేషణతో సరి**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతిని గత ప్రభుత్వం నియమించగా ఆమె అకాడమీ భవన నిర్మాణ స్థలాన్వేషణకే పరిమితమయ్యారు.

**వారు తిరుపతి వస్తే ఒట్టు**

తెలుగు అకాడమీ కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించిన రీసెర్చ్, సేల్స్, పరిపాలనాధికారులతో సహా 14 మంది ఉద్యోగులు తిరుపతిలోని కార్యాలయంలో ఇప్పటి వరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

**అక్కడి నుంచి అటే..**

విజయవాడలో పుస్తకాలను ముద్రించి వాటిని అక్కడి నుంచే రాష్ట్రంలోని అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతీయ కేంద్రాలకు చేరవేసి విక్రయాలు సాగిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆర్.డి.విల్సన్ సైతం తిరుపతిలోని అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని కన్నెత్తి చూడలేదు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలకే పరిమితం**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, ఆధునిక తెలుగుబోధన, ఎంసెట్ పుస్తకాలతో పాటు వివిధ అనువాదాలు, మోనోగ్రాఫులు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళి, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నిఘంటువులు, పరిపాలన న్యాయ పదకోశం వంటి 158కి పైగా ప్రచురణలు ముద్రించేది. ప్రస్తుతం కేవలం ఇంటర్, డీఎడ్, బీఎడ్, పాఠ్యపుస్తకాలు, పరిమిత సంఖ్యలో టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ మాత్రమే ముద్రించి సరఫరా చేస్తోంది.

ప్రస్తుతం తిరుపతి ప్రాంతీయ కేంద్రం తరహాలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్, పొరుగుసేవల విధానంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సహాయకులే తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

**భాషాభిమానుల ఆకాంక్షలివీ..**

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.250 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే తెలుగు అకాడమీ, ప్రస్తుతం రూ.15 కోట్లకు మించలేదని అంటున్నారు. త్వరలో పాఠశాలల పాఠ్యపుస్తకాలు, డిగ్రీ, పోటీ పరీక్షల పుస్తకాలు, సివిల్స్‌కు సిద్ధం అవుతున్న వారికి అకాడమీ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ వ్యవహారంపై స్పష్టతను భాషాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## రాజసం ఉట్టిపడేలా ఆకట్టుకుంటున్న రేణూ దేశాయ్.. ఎప్పుడూ ఇలా చూడలేదు భయ్యా!

రేణూ దేశాయ్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్యగా అవతరించక ముందు హీరోయిన్ గా, కాస్ట్యూమ్ డిజైనర్ గా మంచి పేరు సొంతం చేసుకుంది. ముఖ్యంగా బద్రి, జానీ వంటి చిత్రాలలో పవన్ కళ్యాణ్ తో కలిసి నటించిన ఈమె పెళ్ళికి ముందే పవన్ కళ్యాణ్ తో సహజీవనం చేసి అఖీరా నందన్ కు జన్మనిచ్చింది. కొడుకు సమక్షంలో వివాహం చేసుకున్న వీరు ఆద్య అనే అమ్మాయికి జన్మనిచ్చారు. కానీ కొన్నాళ్లకే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. ఇక అప్పటినుంచి పిల్లల ఆలనా పాలన చూసుకుంటూ పూణే లోనే సెటిలైపోయిన రేణూ దేశాయ్ అటు పేద పిల్లలకు, పేదవారికి, జంతువులకు తోచినంత సహాయం చేస్తూ.. మంచి మనసు చాటుకుంటుంది. అంతేకాదు ఎన్జీవో కూడా నడుపుతున్న ఈమె అవసరమైన డబ్బులను అభిమానుల ద్వారా అడుగుతూ వాటి అవసరాలను తీరుస్తూ ఉంటుంది. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఏదో ఒక విషయంపై స్పందించే రేణు దేశాయ్ తొలిసారి ర్యాంప్ వాక్ చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. రాజసం ఉ



ట్టిపడేలా తన అందంతో ఆకట్టుకుంది. తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలను రేణు దేశాయ్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేయడంతో ఈ గెటప్లో రేణుదేశాయ్ ను ఎప్పుడు ఇలా చూడలేదు అంటూ అభిమానులు సైతం తెగ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఫోటోల విషయానికి వస్తే.. మల్టీకలర్ సిల్క్ సారీ ధరించిన ఈమె దీనికి గోల్డెన్ కలర్ పైతాన్ వర్క్ తో డిజైన్ చేశారు. ఈ చీరకు కాంబినేషన్ లో క్రీం కలర్ బ్లౌజు ధరించింది ఈ ముద్దుగుమ్మ. ఈ సిల్క్ చీరను హైలైట్ చేస్తూ తన అందాన్ని రెట్టింపు చేసుకునేలా సింపుల్ జువెలరీతో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. రాజసం ఉట్టిపడేలా ఆమె ర్యాంప్ వాక్ చేస్తూ నడిచిన తీరుకి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. తొలిసారి మహారాణి గెటప్ లో కనిపించింది అంటూ తెగ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే రేణూ దేశాయ్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రేణు దేశాయ్ కెరియర్ విషయానికొస్తే.. రవితేజ హీరోగా నటించిన టైగర్ నాగేశ్వరరావు సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. ఈ సినిమా తర్వాత వరుస అవకాశాలు అందుకుంటుంది అనుకున్నారు. కానీ మరి అవకాశాలు రాలేదో లేక ఈమె ఇంకో సినిమాకు అవకాశం ఇవ్వలేదో తెలియదు కానీ ప్రస్తుతం ఇండస్ట్రీకి దూరంగా ఉంటుంది రేణు దేశాయ్. సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టివ్గా ఉంటూ అభిమానులకు చేరువలో ఉంటుంది. ఏది ఏమైనా రేణు దేశాయ్ కి సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## కీర్తికి సక్సెస్ దక్కేదెప్పుడు?

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ ఈ మధ్య వరుస ఫ్లాపులను ఎదుర్కొంటుంది. గత కొన్నాళ్లుగా కీర్తి నుంచి వచ్చిన ఏ సినిమాలూ తెలుగులో పెద్దగా ఆడటం లేదు. రీసెంట్ గా కీర్తి నటించిన రివాల్వర్ రీటా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాలతో రిలీజైన రివాల్వర్ రీటా కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది.

**ఫలితం లేకుండా పోయిన కీర్తి ప్రమోషన్స్..** స్వయంగా కీర్తి సురేష్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొని సినిమాను ప్రమోట్ చేసినప్పటికీ అది కూడా ఏ మాత్రం మెరుగైన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది.

ఇంకా చెప్పాలంటే చాలా మందికి అసలు ఆ సినిమా ఒకటి రిలీజైంది అని కూడా తెలియదు. దానికి తోడు సినిమాలో కంటెంట్ కూడా పెద్దగా క్లిక్ అవకపోవడంతో రివాల్వర్ రీటా మొదటి రోజే డిజాస్టర్ గా నిలిచింది.

**కీర్తి ఖాతాలో మరో ఫ్లాపు...** రివాల్వర్ రీటా రిజల్ట్ తో కీర్తి మరోసారి తన ఖాతాలో ఫ్లాపును వేసుకుంది. దీంతో కీర్తి తనకు సక్సెస్



ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తోంది. మొన్నామధ్య కీర్తి తెలుగులో చేసిన ఉప్పు కప్పురంబు సినిమా కూడా డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజవగా, అది కూడా అంచనాలను అందుకోలేకపోయింది. ఇక రఘుతాత మూవీ కూడా అంతే, సినిమా కూడా ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. కాగా కీర్తి భోళాశంకర్ తర్వాత తెలుగులో డైరెక్ట్ సినిమాలు చేసింది లేదు.

పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న కీర్తి సురేష్ ఇప్పుడా గ్యాప్ ను పూరించాలని వరుస సినిమాలను లైన్ లో పెట్టి అందులో భాగంగానే రివాల్వర్ రీటాను ఆడియన్స్ ముందుకు తీసుకొస్తే, అది కాస్తా ఫ్లాపుగా నిలిచింది. ప్రస్తుతం కీర్తి విజయ్ దేవరకొండ సరసన దిల్ రాజు బ్యానర్ లో ఓ సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా అయినా కీర్తికి మంచి సక్సెస్ ను అందిస్తుందేమో చూడాలి.




## బాలయ్యకు రికార్డు బిజినెస్.. మరి రికార్డు హిట్?



నందమూరి బాలకృష్ణ ఒకప్పుడు ఇండస్ట్రీ హిట్లు ఇచ్చారు. కానీ మధ్యలో ఆయన మార్కెట్ బాగా దెబ్బ తింది. ఓ మోస్తరు హిట్టు కోసం కూడా ఏళ్లతరబడి వేచి చూసిన పరిస్థితి. అలాంటి టైంలో 'సింహా'తో బాలయ్యను తిరిగి రేసులోకి తీసుకొచ్చిన ఘనత బోయపాటి శ్రీనుదే. వీరి కలయికలో ఆ తర్వాత వచ్చిన లెజెండ్, అఖండ కూడా పెద్ద హిట్లయ్యాయి. ఇప్పుడు ఆయన్నుంచి 'అఖండ-2' రాబోతోంది. ఈ సినిమా బాలయ్య కెరీర్లోనే అత్యధిక బడ్జెట్లో తెరకెక్కిన సినిమా. నిర్మాతలు దీని మీద ఏకంగా రూ.150 కోట్ల దాకా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్లే బిజినెస్ కూడా రికార్డు స్థాయిలోనే జరిగింది. అన్ని హక్కులూ కలిపి రూ.200 కోట్లకు పైగానే తెచ్చి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు థియేట్రికల్ బిజినెస్ కూడా రూ.150 కోట్ల మేర జరిగినట్లు అంచనా. రెండు తెలుగు రాష్ట్రాల టార్గెట్ రూ.120 కోట్ల మేర జరిగినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. నైజాంలో రూ.30 కోట్లు, సీడెడ్లో రూ.25 కోట్లు, ఆంధ్రాలో రూ.55 కోట్ల మేర ఈ సినిమాకు బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే ఈ సినిమా రూ.200 కోట్ల దాకా గ్రాస్ రాబట్టాల్సి ఉంది. హిందీ హక్కులకు, అలాగే ఓవర్సీస్ రైట్స్‌కు కూడా మంచి రేటే వచ్చింది. వరల్డ్ వైడ్ ఈ మూవీ బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే రూ.300 కోట్ల దాకా గ్రాస్ కలెక్ట్ చేయాల్సి ఉంది 'అఖండ-2'. మామూలుగా అయితే బాలయ్య రేంజికి అది చాలా పెద్ద టార్గెట్టే. కానీ మిగతా సినిమాలు వేరు, అఖండ వేరు. దీనికి పాన్ ఇండియా అప్పీల్ ఉండడం, సీక్వెల్ క్రేజ్ కూడా తోడవుతుండడంతో పాజిటివ్ టాక్ వస్తే ఈ టార్గెట్ అందుకోవడం కష్టమేమీ కాదు. ఈ సినిమా బాలయ్య కెరీర్లో హైయెస్ట్ గ్రాసర్ కావడం లాంఛనమే. బాక్సాఫీస్ దగ్గర కూడా అనుకూల పరిస్థితులు ఉన్నాయి కాబట్టి టాక్ బాగుంటే ఈ ఏడాది టాలీవుడ్ హైయెస్ట్ గ్రాసర్‌గానూ 'అఖండ-2' రికార్డు నెలకొల్పే అవకాశాలున్నాయి.

## టాలీవుడ్ లో మలయాళం కిక్కు



తెలుగు సినిమా రేంజ్ పెరిగే కొద్దీ విలన్ల ఎంపికలో కూడా భారీ మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు మన హీరోలను ఢీకొట్టాలంటే బాలీవుడ్ నుంచి పవర్ఫుల్ బాడీ ఉన్న నటులను దిగుమతి చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. కండల కంటే కళ్లలో కసిని, నటనలో వైవిధ్యాన్ని చూపించే నటుల వైపు మన దర్శకులు మొగ్గు చూపుతున్నారు. ఆ అన్వేషణలో వారికి దొరికిన అద్భుతమైన గని 'మలయాళ ఇండస్ట్రీ'. ఇప్పుడు టాలీవుడ్ లో మాలీవుడ్ విలన్ల హవా గట్టిగా నడుస్తోంది. ఒక హీరో ఎలివేట్ అవ్వాలంటే విలన్ పాత్ర అంతకంటే బలంగా ఉండాలి. ఇప్పుడు మన పాన్ ఇండియా సినిమాల్లో సరిగ్గా అదే జరుగుతోంది. కేరళలో సూపర్ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోలు సైతం, మన తెలుగు సినిమాల్లో నెగిటివ్ రోల్స్ చేయడానికి సై అంటున్నారు. కేవలం గెస్ట్ రోల్స్ లా కాకుండా, సినిమాను మలుపు తిప్పే క్రూరమైన పాత్రల్లో వారు కనిపిస్తుండటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న 'వారణాసి' సినిమా కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ను ఎంచుకోవడం సంచలనం సృష్టించింది. ఇందులో ఆయన 'కుంభా' అనే క్రూరమైన విలన్ గా కనిపించబోతున్నారు. మొదట ఒక వికలాంగుడిలా కనిపించినా, లోపల ఎంతటి రాక్షసుడు దాగి ఉంటాడో తెరపై చూడాల్సిందే. అలాగే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలో మరో మలయాళ హీరో టోవినో థామస్ విలన్ గా చేస్తున్నారనే వార్త అంచనాలను పెంచేసింది. దీనిపై అధికారిక ప్రకటన లేకపోయినా, బజ్ మాత్రం గట్టిగానే ఉంది. ఇక 'పుష్ప' సినిమాతో ఫహద్ ఫాజిల్ తెలుగులో విలనిజం స్థాయిని ఎలా పెంచారో చూశాం. ఆయన భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర పుష్ప 2లో మరింత బాగా క్లిక్కయ్యింది. మరోవైపు షైన్ టామ్ చాకో వరుస పెట్టి తెలుగు సినిమాలు చేస్తున్నాడు. నాని 'దసరా' నుంచి మొదలుపెడితే ఎన్టీఆర్ 'దేవర', బాలయ్య 'డాకు మహారాజ్', నితిన్ 'రాబిన్ హుడ్' వరకు అన్నింట్లోనూ వైవిధ్యమైన విలన్ పాత్రలతో గుర్తింపుని అందుకున్నాడు. కేరళలో హీరోలుగా సినిమాలు చేస్తూనే, తెలుగులో ఇలా పవర్ ఫుల్ విలన్లుగా మారడం వారి నటనా ప్రతిభకు నిదర్శనం. రొటీన్ అరుపులు, కేకలు కాకుండా.. తమదైన బాడీ లాంగ్వేజ్ తో భయపెట్టే విలన్లుగా వారు మన ఆడియన్స్ ను మెప్పిస్తున్నారు. అందుకే సునీల్ శెట్టి లాంటి బాలీవుడ్ స్టార్స్ కూడా "టాలీవుడ్ ఇప్పుడు కేవలం బాలీవుడ్ వైపే చూడటం లేదు, దేశమంతా వెతుకుతోంది" అని వ్యాఖ్యానించారు. మొత్తానికి ఈ 'మాలీవుడ్ విలన్స్' ఎంట్రీతో తెలుగు సినిమా స్క్రీన్ పై కొత్త ఎలివేషన్స్ కనిపిస్తున్నాయి. మన హీరోల మాస్ ఇమేజ్ కు, మలయాళ నటుల రా అండ్ రస్టిక్ పర్ఫార్మెన్స్ తోడైతే వచ్చే కిక్కే వేరు. రాబోయే రోజుల్లో ఈ లిస్టులో ఇంకెంతమంది మలయాళ స్టార్లు చేరతారో చూడాలి.

## 'నన్ను జడ్జ్ చేయండి'.. అషు రెడ్డి బోల్డ్ లుక్ వైరల్

సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తూ వార్తల్లో నిలిచే పేరు అషు రెడ్డి. డబ్స్మాష్ వీడియోలతో 'జూనియర్ సమంత'గా గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, తక్కువ సమయంలోనే స్టార్ సెలబ్రిటీ హోదాను దక్కించుకున్నారు. వెండితెరపై కనిపించింది తక్కువే అయినా, సోషల్ మీడియాలో మాత్రం అగ్ర హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని ఫాలోయింగ్ను సొంతం చేసుకున్నారు. తన గ్లామర్తో, బోల్డ్నెస్తో ఇంటర్నెట్ను షేక్ చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. తాజాగా అషు రెడ్డి తన వెకేషన్కు సంబంధించిన ఫోటోలను ఇన్స్టాగ్రామ్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఆమె బాహామాస్లోని అందమైన లొకేషన్లలో చిల్ అవుతున్నారు. అక్కడ దిగిన ఫోటోలలో.. లైట్ ఆలివ్ గ్రీన్ కలర్ డ్రెస్సు ధరించి ఎంతో స్టైలిష్గా, గ్లామరస్గా దర్శనమిచ్చారు. సూర్యకాంతిలో చేతులతో లవ్ సింబల్ పెడుతూ, తన వంపుసొంపులతో నెటిజన్లను కట్టిపడేస్తున్నారు. ముఖ్యంగా ఆమె ఇచ్చిన బోల్డ్ పోజులు, "నన్ను జడ్జ్ చేయండి" అంటూ పెట్టిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె కాన్ఫిడెన్స్కు, గ్లామర్కు నెటిజన్లు ఫిదా



అవుతున్నారు. నితిన్ హీరోగా నటించిన 'చల్ మోహన్ రంగ' చిత్రంతో అషు రెడ్డి ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత బిగ్ బాస్ రియాలిటీ షోలో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. హౌస్లో ఉన్నన్ని రోజులు తనదైన ఆటతీరుతో, గ్లామర్తో ఆకట్టుకున్న ఆమె, బయటకు వచ్చాక తన క్రేజ్ను రెట్టింపు చేసుకున్నారు. ఆ మధ్య సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూలు ఆమెను ఇంటర్నెట్ సెన్సేషన్గా మార్చేశాయి. ఆ ఇంటర్వ్యూల ద్వారా వచ్చిన పబ్లిసిటీతో ఆమె పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం అషు రెడ్డి సినిమాల కంటే విదేశీ పర్యటనలు, సోషల్ మీడియా ప్రమోషన్లపైన ఎక్కువ దృష్టి సారించారు. తరచుగా దుబాయ్, అమెరికా వంటి దేశాలకు వెళ్తూ.. అక్కడి లగ్జరీ లైఫ్స్టైల్ను ఎంజాయ్ చేస్తున్నారు. ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులతో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉంటారు. నటిగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే, వెబ్ సిరీస్లు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. సినిమా అవకాశాలు లేనప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అషు రెడ్డి హవా కొనసాగుతూనే ఉంది.

## ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది

ఎవరి లైఫ్ ఏ క్షణాన ఎటు మలుపు తిరుగుతుందో ఎవరూ చెప్పలేం. జీవితంలో తర్వాత ఫలానా జరుగుతుందని ముందే ఊహించలేం. అందుకే జీవితమంటే ఊహాతీతం అంటుంటారు. సినీ ఇండస్ట్రీలో కూడా దీనికి మినహాయింపేమీ కాదు. అసలు ఎవరూ ఊహించని విధంగా కొందరు స్టార్లు అవడం, ఓవర్ నైట్ లో క్రేజ్ ఏర్పడటం జరుగుతుంటాయి.

**డిసెంబర్ లో కీర్తి నుంచి రెండు సినిమాలు...** అలా ఇండస్ట్రీలోకి ఇప్పటికే ఎంతోమంది తమ లక్ ను టెస్ట్ చేసుకుంటున్నారు. ఇక అసలు విషయానికొస్తే ఉప్పెన సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన కృతి శెట్టి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నారు. అందులో ఒకటి విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కాగా, రెండోది నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తీ హీరగా తెరకెక్కిన అన్నగారు వస్తున్నారు. ఈ రెండు సినిమాలూ డిసెంబర్ లోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



**ఉప్పెన ఛాన్స్ ఎలా వచ్చిందంటే?...** ఇక అసలు విషయానికొస్తే కృతి శెట్టి తన తాజా సినిమా LIK ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే రెండు సాంగ్స్ రిలీజవగా, వాటికి ఆడియన్స్ నుంచి అంతంతమాత్రంగానే రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ లో కృతి తనకు ఉప్పెన సినిమాలో అవకాశమెలా వచ్చిందో వెల్లడించారు. ఓ కమర్షియల్ యాడ్ షూటింగ్ కోసం వెళ్లిన తనకు అనుకోకుండా ఆ ఛాన్స్ వచ్చిందని కృతి పేర్కొన్నారు. ఒక రోజు ఓ కమర్షియల్ యాడ్ షూటింగ్ ఆడిషన్ కోసం వెళ్లిన తనను అది పూర్తయ్యాక పికప్ చేసుకుంటానని తన తండ్రి చెప్పారని, తన ఆడిషన్ పూర్తై తండ్రి ఎంతకీ రాకపోవడంతో పక్కనే ఉన్న స్టూడియోలోకి వెళ్లానని, అక్కడో మరో ఆడిషన్ జరుగుతుందని, అక్కడ తనను చూసి మూవీస్ పై ఇంట్రెస్ట్ ఉందా అని అడిగితే ఏం చెప్పాలో తెలియక తన తల్లి ఫోన్ నెంబర్ ఇచ్చి వచ్చానని, ఆ తర్వాత టీమ్ తన తల్లికి కాల్ చేసి ఉప్పెనలో ఛాన్స్ ఇచ్చారని చెప్పారు. పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా కృతి శెట్టి హీరోయిన్ గా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన ఉప్పెన మూవీ ఎంత పెద్ద హిట్ అయిందో, ఆ సినిమా తర్వాత కృతికి ఎలాంటి స్టార్‌డమ్ వచ్చిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఉప్పెన సినిమా కృతిని ఓవర్ నైట్ స్టార్ ను చేసినప్పటికీ దాన్ని అమ్మడు కంటిన్యూ చేయలేకపోయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536